www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బంగాళాఖాతంలో వాయుగుండం
నేడు తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం
10,11 తేదీల్లో సీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు
జనవరిలో వాయుగుండాలు 160 ఏళ్లలో నాలుగోసారి.. మరోవైపు పెరిగిన చలి
అల్లూరి జిల్లా జి.మాడుగులలో 2.7 డిగ్రీలు
ఈ ఏడాదిలో ఇదే కనిష్ఠ ఉష్ణోగ్రత
3



బట్టతలకు కొత్త మందు
జుట్టు మొలిపించే సరికొత్త ఔషధం క్లాస్కొటెరోన్
ఇప్పటికే మొటిమలను తగ్గించడానికి అమెరికాలో ఈ మందు వాడకం.. అందుకు ఎఫ్‌డీఏ అనుమతులు
ఇప్పుడు బట్టతలపై క్లినికల్ ట్రయల్స్‌లో సత్ఫలితాలు
దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉన్నట్లు వెల్లడి
12

గురువారం | 8-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 303 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి పూర్తి, నక్షత్రం: పుబ్బ మ.12.24 తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.7.59-9.40, దుర్ముహూర్తం: ఉ.10.31-ఉ.11.15, మ.2.56-3.40, అమృతఘడియలు: శేషం ఉ.7.30. మరలా తె. 6.05 మొదలు, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.51, సూర్యాస్తమయం: 5.52 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తిరుమలకు ఖాళీ మద్యం బాటిళ్లు తీసుకెళ్లింది ఈ కారులోనే

ఇరికిద్దామనుకొని.. అడ్డంగా దొరికారు!
తిరుమలలో ఖాళీ మద్యం సీసాల గుట్టు రట్టు
టీటీడీ, పోలీసుల ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు వైసీపీ, జగన్ మీడియా ప్రతినిధుల కుట్ర
తిరుపతి నుంచి ఖాళీ సీసాలు పట్టుకెళ్లి తిరుమలలో పడేశారు
వాటిని వీడియోలు తీసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం
పక్కా ఆధారాలతో నిందితుల గుర్తింపు
వైసీపీ కార్యకర్తలు, జగన్ మీడియా ప్రతినిధిపై కేసు.. ఇద్దరి అరెస్టు.. ఒకరు పరారీ

తిరుపతి/తిరుమల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో పాటు టీటీడీని, పోలీసులను ఇరుకున పెడదామని స్కెచ్ వేశారు. కానీ, సీన్ రివర్స్ కావడంతో అడ్డంగా దొరికిపోయారు. వైసీపీ, జగన్ మీడియా ప్రతినిధులు పన్నిన కుట్రను పోలీసులు కనిపెట్టేశారు. తిరుమలలో పోలీసు గెస్ట్ హౌస్ వద్ద ఖాళీ మద్యం సీసాల వీడియో లోగుట్టును రట్టు చేశారు. తిరుపతి నుంచి ఖాళీ మద్యం బాటిళ్ల తీసుకొచ్చి తిరుమలలో పడేసి, వాటిని వీడియోలు తీసి వైరల్ చేసినట్టు

మిగతా 14వ పేజీలో...

రాజకీయాలొద్దు
నదీ జలాలపై ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి
భావోద్వేగాలతో ఆటలు సరికాదు
తెలంగాణకు సీఎం చంద్రబాబు హితవు
గోదావరిలో పుష్కలంగా జలాలు.. దేవాదులను విస్తరిస్తే కాదంటామా?
గతంలో కాళేశ్వరాన్ని అడ్డుకున్నామా?.. కానీ, 'పోలవరం'పై రాజకీయమా?

పోలవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దంటూ తెలంగాణను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. "ప్రజా ప్రయోజనాల కోసం రాజకీయం చేయాలి. అంతేగానీ, రాజకీయాలకోసం రాజకీయం కాదు. రాజకీయ నేతలు పోటీలు పడి మాట్లాడవద్దు." అని ఆయన హితవు పలికారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో

మిగతా 13వ పేజీలో...



బుధవారం ఢిల్లీలో అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు




బుధవారం పోలవరం ప్రాజెక్టు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన మంత్రి నిమ్మల రామానాయుడు

'అమరావతి'కి చట్టబద్ధత కల్పించండి!
బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదించండి
నిధులు, ప్రాజెక్టులతో ఏపీని ఆదుకోండి
'జీ రామ్ జీ'తో రాష్ట్రంపై అదనపు భారం
ప్రత్యామ్నాయ నిధులు ఇవ్వండి
14
అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ, మద్యం కేసులో జగన్ పాత్రపై చర్చ?

పోలవరం ఎంతో ప్రత్యేకం!
ఈ ప్రాజెక్టుతో నదులన్నీ అనుసంధానం
13
వచ్చే నెల 15 నాటికి డయాఫ్రమ్ వాల్ సిద్ధం
పోలవరం వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తాం
గంగా-కావేరీ అనుసంధానం నా స్వప్నం: సీఎం

'సీమ'పై జగన్‌ది రాద్ధాంతం
ఎత్తిపోతలతో లభించేవి 35 టీఎంసీలు
అందులో రాష్ట్రం వాటా 22 టీఎంసీలే
కానీ, సీమ సస్యశ్యామలం అంటూ అబద్ధాలు
జగన్ అక్రమాలపై దర్యాప్తునకే 30 ఏళ్లు: బాబు



'పీపీపీ'పై ఎన్ని వ్యాజ్యాలు వేస్తారు?
పెండింగ్‌లో ఉన్న పిల్ వైసీపీ కార్యకర్తదే.. ఈ విషయాన్ని కచ్చితంగా చెప్పగలం
పార్టీ తరఫున మరో పిల్ అవసరమేంటి?.. సీనియర్ న్యాయవాదిని నిలదీసిన హైకోర్టు
గత పిల్‌తో జత చేయాలని ధర్మాసనానికి లేఖ్ల తరఫు న్యాయవాది పదేపదే అభ్యర్థన
కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
11

పీపీపీ కాలేజీలు ప్రభుత్వ ఆధీనంలోనే
ఇందులో రోగులకు ఉచిత/ రాయితీపై చికిత్స
11
ఈ విధానం గుజరాత్‌లో విజయవంతమైంది
దీన్ని అమలు చేయడమనేది రాష్ట్రాల నిర్ణయమే
ఎన్ఎంసీ నిబంధన సెక్షన్-8కు సవరణ చేశాం
వైద్య కళాశాలల ఏర్పాటుకు కార్పొరేట్‌కూ చాన్స్
కౌన్సెలింగ్‌లో జాప్యం జరగకుండా చర్యలు



ఎన్ఎంసీ చైర్మన్ అభిజాత్ సేథ్ స్పష్టీకరణ

వైసీపీ ఎమ్మెల్యేలను ఏం చేద్దాం!



అసెంబ్లీకి రాకుండా వేతనం, టీఏ, డీఏలు పొందడమేంటి?
నోటీసులిచ్చి కమిటీ ముందుకు పిలిపించాలి: జ్యోతుల
13
ప్రజాభిప్రాయం కూడా తీసుకొని ఓ నిర్ణయానికి: బుద్ధప్రసాద్
అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై ఎథిక్స్ కమిటీలో చర్చ

పండగ కోడికి కార్పొరేట్ కళ


కృష్ణా, ఏలూరు సరిహద్దుల్లో హైటెక్ బరి
అద్దాలు, ఏసీలతో నిండిన ప్రత్యేక గ్యాలరీలు
'వారధి' పేరిట శుభలేఖలా ఆహ్వాన పత్రికలు
12
పాస్‌లు ఇస్తూ రారండోయ్.. అంటూ పిలుపులు
విస్తీర్ణం 28 ఎకరాలు.. ఏడు ఎకరాల్లో పార్కింగ్
రోజుకు 40 పందేలు.. 5 లక్షలు-కోటి వరకు బెట్టింగ్
వీఐపీలకు మహారాజ ఆతిథ్యం.. రక్షణగా బౌన్సర్లు
అక్కడికే విందు భోజనాలు అందించేలా ఏర్పాట్లు
బహుమతులుగా కార్లు ఇస్తామంటూ ప్రకటనలు



ప్రధాన బరి.. వీఐపీ గ్యాలరీతో..

సంక్రాంతి కోసం కోడి రెడీ అవుతోంది. కార్పొరేట్ లుక్స్ జోడిస్తూ కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని గన్నవరం, ముసునూరు మండలాల సరిహద్దుల్లో హైటెక్ బరిని సిద్ధం చేస్తున్నారు. పూర్తిగా అద్దాలు, ఏసీలతో వీఐపీ గ్యాలరీలు... పెళ్లి శుభలేఖ అంత అందంగా ఆహ్వాన పత్రికలు, రండి.. రండి.. దయ చేయండి.. అంటూ స్వయంగా పిలుపులు.. గెలిస్తే కార్లు బహుమతులుగా ఇస్తామంటూ ప్రకటనలు..! వెరసి కోడి కూతను మోతెక్కించేందుకు నిర్వాహకులు అన్ని హంగులతో సిద్ధమవుతున్నారు.

జగన్ హయాంలోనే సీమ ఎత్తిపోతలపై స్టే


భోగాపురం విమానాశ్రయం గురించి జగన్ ఏమన్నారో ప్రజలందరికీ తెలుసు
విశాఖ ఉక్కు లాభాల బాట పట్టాలి
స్టీల్ ప్లాంటు భూములను ఇతర అవసరాలకు కేటాయించేది లేదు
14
2 నెలల్లో గూగుల్ డేటా సెంటర్ పనులు
రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళనొద్దు: లోకేశ్

మోదీ నన్ను.. 'సర్.. ప్లీజ్' అన్నారు
అపాచీ హెలికాప్టర్లను త్వరగా పంపాలని విజ్ఞప్తి చేశారు: ట్రంప్
భారత్ ఆర్డర్ చేసింది 28 అయితే.. 68 హెలికాప్టర్లంటూ తప్పుడు సమాచారం



అమెరికా లేకుంటే నాటోకు ఎవరూ భయపడరు
రష్యా, చైనా భయపడేది ఒక్క అమెరికాకే
నేను జోక్యం చేసుకోకుంటే ఉక్రెయిన్ ఇప్పటికే రష్యా వశమై ఉండేది
ఒంటిచేత్తో 8 యుద్ధాలు ఆపా.. అయినా నార్వే నాకు నోబెల్ నిరాకరించి మూర్ఖంగా వ్యవహరించింది: ట్రంప్
గ్రీన్‌ల్యాండ్ జోలికెళ్తే నాటో ముక్కలేనన్న యూరోప్ దేశాలకు కౌంటర్

- కొందామా.. కొట్టేద్దామా?
- గ్రీన్‌ల్యాండ్‌పై ట్రంప్ 'కు'తంత్రం!

- పారిపోవడానికి ఖమేనీ ప్లాన్!
- కుటుంబంతో సహా రష్యా వెళ్లిపోవడానికి ఇప్పటికే ప్రణాళిక

- రష్యా చమురు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా

2

1800118004

» పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి సీబీఎస్ఈ హెల్ప్‌లైన్

» 10-12వ తరగతి విద్యార్థులకు కౌన్సెలింగ్

న్యూఢిల్లీ, జనవరి 7: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించేందుకు, ఒత్తిడిని అధిగమించి విజయం సాధించేందుకు సన్నద్ధమయ్యేలా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో సీబీఎస్ఈ 24 గంటలు అందుబాటులో ఉండే హెల్ప్ లైన్‌ను ప్రారంభించింది. 1800118004 నెంబరుకు విద్యార్థులు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ముఖ్యంగా మానసిక, పాఠ్యాంశాలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా కౌన్సెలింగ్ పొందవచ్చని సీబీఎస్ఈ తెలిపింది. ఫిబ్రవరి 17 నుంచి థియరీ పరీక్షల ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఈ ఐవీఆర్ఎస్ ఫోన్ సేవలను ఈ నెల 6వ తేదీ నుంచే అందుబాటులోకి తీసుకువచ్చినట్టు పేర్కొంది. ఈ సేవలు 10వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు.. ఈ ఏడాది జూన్ 1వ తేదీ వరకు ఉచితంగా వినియోగించుకోవచ్చని. ఐవీఆర్ఎస్ సేవలు హిందీ, ఇంగ్లీష్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఫోన్ సేవలకు 73 మంది నిష్ణాతులైన కౌన్సెలర్లను, ప్రిన్సిపాల్స్‌ను, సీబీఎస్ఈకి చెందిన విద్యావేత్తలను నియమించినట్టు పేర్కొంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్.. ఇక ఈజీ!

న్యూఢిల్లీ, జనవరి 7: ఐఐటీలలో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్ష విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఐఐటీ కౌన్సిల్ కీలక సిఫారసులు చేసింది. అభ్యర్థుల సామర్థ్యం ఆధారంగా పరీక్షలో మార్పులు చేయాలని సూచించింది. దీని ప్రకారం.. ప్రశ్నలను డైనమిక్‌గా రూపొందించడంతోపాటు నిర్ణీత సమయంలో జవాబు రాసేలా ప్రశ్న పత్రాలను రూపొందిస్తారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఈ ఏడాది నిర్వహించనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ముందు ప్రయోగాత్మక ఐచ్ఛిక పరీక్షను నిర్వహించాలని కౌన్సిల్‌లోని నిపుణుల బృందం సిఫారసు చేసింది. ఈ ఫలితాల ఆధారంగా భవిష్యత్తు పరీక్షలకు ఏ విధమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించవచ్చనేది స్పష్టమవుతుందని పేర్కొంది. అదేవిధంగా ఐఐటీలలో మానసిక ఆరోగ్య నిపుణులను నియమించేందుకు మంజూరు చేసిన పోస్టులను భర్తీ చేయాలని సూచించింది. ఇదిలా ఉండగా, ఐఐటీలలో అందిస్తున్న ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల పాఠ్యాంశాలను సమూలంగా మార్చాలని ఐఐటీ కౌన్సిల్ నిర్ణయించింది.

వైష్ణోదేవి మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు

న్యూఢిల్లీ, జనవరి 7: కనీస ప్రమాణాలు పాటించడంలో విఫలమైన వైష్ణోదేవి వైద్య కళాశాల గుర్తింపును జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) రద్దు చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 50 సీట్లతో ఎంబీబీఎస్ కోర్సు నిర్వహించడానికి జమ్మూ కశ్మీర్‌లోని రియాసీలో ఉన్న శ్రీ మాతా వైష్ణోదేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎక్సలెన్స్‌కు మంజూరు చేసిన అనుమతి పత్రాన్ని(ఎల్ఓపీ) ఎన్ఎంసీకి చెందిన మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (ఎంఏఆర్‌బీ) తాజాగా ఉపసంహరించుకుంది. ఈ కాలేజీలో తొలి బ్యాచ్ కోసం ఎంపిక చేసిన 50 మందిలో 42మంది ముస్లింలు కాగా ఒకరు సిక్కు విద్యార్థి ఉండటంపై ఆందోళనలు వెల్లువెత్తాయి. వైష్ణోదేవి మందిరానికి వచ్చే విరాళాలతో నడిచే కళాశాలలో హిందూ విద్యార్థులకే ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలు సంఘాలు నిరసనలకు దిగాయి. ఇదే సమయంలో ఈ కళాశాలలో తగిన మౌలిక సదుపాయాలు లేవని, వైద్య పరికరాల కొరత, అర్హత కలిగిన అధ్యాపకుల్లేరంటూ ఎన్ఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో ఈ కళాశాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్లు ఎన్ఎంసీ పేర్కొంది.

హోటల్ గదిలో దంపతుల గోప్యతకు భంగం

» ఉదయ్‌పూర్‌లోని లీలా ప్యాలెస్‌కు 10 లక్షల జరిమానా

ఉదయ్‌పూర్, జనవరి 7: హోటల్ గదిలో దంపతులు ఉండగా, హౌస్‌కీపింగ్ సిబ్బంది ఒకరు మాస్టర్ కీతో వారి గదిలోకి ప్రవేశించడాన్ని వినియోగదారుల కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉదయ్‌పూర్‌లోని లీలా ప్యాలెస్ హోటల్ యాజమాన్యానికి రూ.10 లక్షల జరిమానా విధించింది. వారు చెల్లించిన అద్దె రూ.55 వేలను 9 శాతం వడ్డీతో వాపస్ చేయాలని, లిటిగేషన్ ఖర్చుల నిమిత్తం మరో రూ.10 వేలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ తీర్పు ఇచ్చిన రెండు నెలల్లోపు ఈ మొత్తం బాధితులకు చెల్లించాలని గతనెల 16న ఆదేశించింది. చెన్నైకి చెందిన మహిళా న్యాయవాది 2025 జనవరి 26న తన భర్తతో కలిసి ఈ హోటల్‌లోని లేక్ వ్యూ ఉన్న గ్రాండ్ రూమ్‌లో దిగారు. తామిద్దరం బాత్రూమ్‌లో ఉన్న సమయంలో హోటల్ సిబ్బంది ఒకరు మాస్టర్ కీతో లోపలికి వచ్చేశారని ఆమె ఆరోపించారు. అప్పటికీ 'నో సర్వీస్' అని తాము అరుస్తూనే ఉన్నామని, అయినా పగిలిన బాత్రూమ్ డోర్‌లోంచి లోనికి తొంగి చూశారని ఆమె తెలిపారు. ఇది తమ ప్రైవసీకి తీవ్రంగా భంగం కలిగించడంతోపాటు, మానసికంగా కుంగుబాటుకు గురిచేసిందని పేర్కొన్నారు. ఇది సేవాలోపం కిందకి కూడా వస్తుందని చెన్నై(నార్త్)లోని జిల్లా వినియోగదారుల కోర్టు అభిప్రాయపడింది.


ఇంకెతకాలం రాజకీయాల్లో ఉంటానో: సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాను ఇంకా ఎంతకాలం రాజకీయాల్లో ఉంటానో తెలియదని, రాజకీయాల్లో ఉన్నంతకాలం ప్రజాసేవ చేయడంలో సంతృప్తి చెందానని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. హావేరి జిల్లా పర్యటనలో బుధవారం ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అత్యధిక కాలంపాటు కర్ణాటక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన ఆయనకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాపనుల శాఖ చేపట్టిన వీవీఐపీ సర్క్యూట్ హౌస్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. హావేరి మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదంతో ఇప్పటివరకు రాజకీయాల్లో కొనసాగానని, మరెంత కాలం క్రియాశీలకంగా ఉంటానో తెలియదని అన్నారు. తన పాలన తనకు సంతృప్తినిచ్చిందని వ్యాఖ్యానించారు.

సర్ రెండో విడతలో 6.5 కోట్ల ఓటర్ల తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 7: ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా గత కొన్ని రోజుల్లో విడుదల చేసిన 9రాష్ట్రాలు, 3కేంద్ర పాలిత ప్రాంతాల (యూటీ)లకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా నుంచి 6.5 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. ఎస్ఐఆర్ రెండో విడతకు ముందు ఈ 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 50.90 కోట్ల మంది ఓటర్లు ఉండే వారు. ఎస్ఐఆర్ తర్వాత వేర్వేరుగా ఓటర్ల ముసాయిదా జాబితాలను విడుదల చేశారు. వీటి ప్రకారం ఓటర్ల సంఖ్య 44.40 కోట్లకు తగ్గింది. రెండో విడత ఎస్ఐఆర్. నవంబరు 4న అండమాన్ నికోబార్, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ప్రారంభించారు.

వారసుడి కోసం..



10 మంది ఆడపిల్లల తర్వాత 11వ కాన్పులో మగ బిడ్డ

న్యూఢిల్లీ: ఒకరు లేదా ఇద్దరు చాలు అని నేటి తరం దంపతులు సంతానం విషయంలో ఆచితూచి అడుగులు వేస్తుంటే.. హరియాణాకు చెందిన సంజయ్-సునీత దంపతులు మాత్రం ఏకంగా 11 మందికి జన్మనిచ్చారు. 19 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్న ఈ జంట మగపిల్లాడి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 10 మంది ఆడపిల్లలకు జన్మనిచ్చిన సునీత ఎట్టకేలకు ఇటీవల 11వ కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. కొడుకుతో సహా తమ పిల్లలందరినీ ఒకేరకంగా చూసుకుంటామని ఆ దంపతులు విలేకరులతో అన్నారు.

కొందామా.. కొట్టేద్దామా?

గ్రీన్‌ల్యాండ్‌పై ట్రంప్ 'కు'తంత్రం!.. మంచు ద్వీపాన్ని ఎలాగోలా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు

» అవసరమైతే మిలటరీ బల ప్రయోగానికి కూడా ట్రంప్ సిద్ధం: వైట్‌హౌజ్



వాషింగ్టన్, జనవరి 7: ఎన్నో సహజ వనరులకు నెలవైన గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'కు'తంత్రం మొదలుపెట్టారు. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను ఆ దేశం నుంచి ఎత్తుకొచ్చిన తర్వాత గ్రీన్‌ల్యాండ్‌పైనే దృష్టిపెట్టారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా పరిధిలోకి తెస్తామని ఎప్పటి నుంచో చెబుతున్న ట్రంప్.. దాన్ని కొనుగోలు చేయడం ద్వారా, లేదా మిలటరీ బలప్రయోగంతో స్వాధీనం చేసుకోవడానికి ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నారు. దీనికి సంబంధించి అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌజ్ తాజాగా ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. "అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో భాగంగా చేయడంపై తీవ్ర స్థాయిలో చర్చలు జరుపుతున్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలో అమెరికా శత్రువులను ఎదుర్కొనేందుకు, జాతీయ భద్రత కోసం ఆ ద్వీపాన్ని అమెరికా నియంత్రణలోకి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇందుకోసం గ్రీన్‌ల్యాండ్‌ను మొత్తంగా కొనుగోలు చేయడంతోపాటు మిలటరీ బల ప్రయోగానికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు" అని వైట్‌హౌజ్ పేర్కొంది. అయితే దౌత్యపరమైన మార్గానికే ట్రంప్ తొలి ప్రాధాన్యత అని.. గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేద్దామని భావిస్తున్నారని, ప్రస్తుతానికి బలవంతంగా స్వాధీనం చేసుకునే ఆలోచన ఏదీ లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొనడం గమనార్హం. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా నియంత్రణలోకి తెచ్చుకోవడం అవసరమన్న వైట్‌హౌజ్ ప్రకటన నేపథ్యంలో.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భేటీ అయి చర్చించేందుకు డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ సిద్ధమయ్యాయి. త్వరలో భేటీ అవుదామని మార్కో రూబియోకు డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్క్ రాస్మస్సెన్, గ్రీన్‌ల్యాండ్ మంత్రి వివియన్ మోట్జ్‌ఫెల్ట్ విజ్ఞప్తి చేసినట్టుగా గ్రీన్‌ల్యాండ్ ప్రభుత్వ వెబ్‌సైట్ వెల్లడించింది. ఇంతకుముందు కూడా భేటీకి ప్రయత్నించినా వీలుకుదరలేదని పేర్కొంది. అమెరికా నియంత్రణలోకి వెళ్లే అంశంపై గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్‌తోపాటు యూరప్ దేశాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి.

సహజ వనరులకు నెలవైన మంచు ఖండం

ఖండాలు కాకుండా భూభాగం పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం గ్రీన్‌ల్యాండ్. దీనిలో 80% భూభాగం నిత్యం మంచుతోనే కప్పి ఉంటుంది. ఆర్కిటిక్ ప్రాంతం కావడంతో మిగతా 20% భూభాగంలోనూ ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా ఉంటాయి. ప్రస్తుత జనాభా సుమారు 56 వేలు. అధికార భాష గ్రీన్‌ల్యాండిక్. చేపలు, సముద్రపు ఉత్పత్తులే ప్రధాన ఉపాధి. మొదట్లో డెన్మార్క్ వలస పాలనలో ఉండగా.. 1953లో తమ దేశంలో కలిపేసుకుంది. 2009లో రిఫరెండం ద్వారా గ్రీన్‌ల్యాండ్ స్వతంత్ర ప్రతిపత్తి పొందింది. గ్రీన్‌ల్యాండ్‌లో భారీగా బంగారం, వజ్రాలు, సహజవాయువుతోపాటు సీసం, జింక్, కంప్యూటర్ చిప్‌ల రూపకల్పనలో వాడే అరుదైన లోహాల నిక్షేపాలు కూడా ఉన్నాయి.

అమెరికా లేకుంటే.. నాటోకు ఎవరూ భయపడరు


వాషింగ్టన్, జనవరి 7: అమెరికాకు నిజంగా అవసరమైనప్పుడు నాటో దేశాలు తోడుగా నిలిచేది అనుమానమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా లేకుంటే నాటోకు ఎవరూ భయపడబోరని.. రష్యా, చైనా గౌరవించే, భయపడే ఏకైక దేశం అమెరికానే అని పేర్కొన్నారు. అమెరికా మిలటరీ సామర్థ్యాన్ని తాను పునర్నిర్మిస్తున్నానని తెలిపారు. అమెరికా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటే నాటో ముక్కలైపోయినట్టేనంటూ.. కూటమి భాగస్వామ్య దేశాలైన డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోలాండ్ తదితర దేశాలు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బుధవారం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ దీనిపై పోస్టు పెట్టారు. "నాటో అభిమానులు ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఏదేమైనా నాటో దేశాల వారంతా మా స్నేహితులు. నేను జోక్యం చేసుకోకపోయి ఉంటే రష్యా ఇప్పటికే ఉక్రెయిన్ మొత్తాన్నీ స్వాధీనం చేసుకునేది. నేను ఒంటి చేత్తో 8 యుద్ధాలు ఆపాను. కానీ నాటో దేశం నార్వే నాకు నోబెల్ బహుమతి ఇవ్వకుండా మూర్ఖంగా వ్యవహరించింది. నేను అమెరికా మిలటరీని పునర్నిర్మించి బలోపేతం చేస్తుండటం మన అదృష్టం. అమెరికా లేకుంటే నాటోకు రష్యా, చైనా.. ఎవరూ భయపడరు. అయినా అమెరికాకు అవసరమైనప్పుడు నాటో తోడుగా ఉంటుందా అన్నది నాకు అనుమానమే. వారు తోడుగా లేకున్నా అమెరికా మాత్రం నాటోకు తోడుగా ఉంటుంది. చైనా, రష్యా భయపడేది, గౌరవించేది ఒక్క అమెరికాను మాత్రమే" అని ట్రంప్ పేర్కొన్నారు.

భారత్‌ను ఆపండి ప్లీజ్!

» 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అమెరికాకు అరవైసార్లు మొరపెట్టుకున్న పాకిస్థాన్ సర్కారు

ఇస్లామాబాద్, జనవరి 7: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో.. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడి చేసినప్పుడు మన దాయాది దేశం అగ్రరాజ్యాన్ని శరణుజొచ్చింది! "ఎలాగైనా భారత్‌ను ఆపండి ప్లీజ్" అని వేడుకుంటూ ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 60 భేటీలు నిర్వహించింది. ఈ మేరకు.. అమెరికాలోని పాక్ రాయబారులు, రక్షణ శాఖ అధికారులు అమెరికా చట్టసభల సభ్యులు, విదేశాంగ శాఖ అధికారులు, పెంటగాన్ వర్గాలను పదేపదే వేడుకున్నారు. ఈమెయిళ్లు, ఫోన్ కాల్స్, ప్రత్యక్ష భేటీలు.. ఇలా అన్ని మార్గాల్లోనూ వారిని సంప్రదించి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని ఇండియా దూకుడు నుంచి తమను కాపాడాలంటూ మొరపెట్టుకున్నారు. ప్రధాన మీడియా సంస్థలకు సంబంధించిన పాత్రికేయులను సంప్రదించి ఇంటర్వ్యూలు, బ్యాక్‌గ్రౌండ్ బ్రీఫింగ్స్ ఇస్తామని వెంటపడ్డారు. తాజాగా వెలుగులోకి వచ్చిన 'యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ (ఫారా)' పత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైంది. అప్పుడే కాదు.. ఆ తర్వాత కూడా ట్రంప్ పాలనాయంత్రాంగంతో వేగవంతమైన సంప్రదింపుల కోసం, వాణిజ్య, దౌత్యపరమైన ప్రయోజనాలను సాధించేందుకు.. వాషింగ్టన్‌కు చెందిన ఆరు ప్రముఖ లాబీ సంస్థలతో పాకిస్థాన్ 5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.45 కోట్ల) విలువైన వార్షిక ఒప్పందాలు కుదుర్చుకుందని గత ఏడాది నవంబరులో 'న్యూయార్క్ టైమ్స్' సంస్థ ఒక కథనంలో తెలిపింది. పాక్ ఇలా 'సీడెన్ లా ఎల్ఎల్‌పీ' అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న కొన్ని వారాలకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌కు శ్వేతసౌధంలో ఆతిథ్యం ఇచ్చారని అందులో పేర్కొంది. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. నిరుడు ఏప్రిల్-మే నెలల్లో అమెరికాలో లాబీయింగ్ కోసం భారత్ ఖర్చు చేసిన దానికన్నా పాక్ మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేసింది. దీంతోపాటు.. ట్రంప్‌ను బహిరంగంగా పొగడడం, ఆయన్ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయడం వంటి చర్యల వల్ల పాక్-అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని పేర్కొంది.

లోకం తీరు



రష్యాకు పారిపోవడానికి ఖమేనీ ప్లాన్!

దుబాయ్, జనవరి 7: ఇరాన్‌లో ఆందోళనలు మరింత తీవ్రమైతే ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ దేశాన్ని వీడి వెళ్లిపోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని టైమ్స్ కథనం పేర్కొంది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ నివేదికను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ కథనం ప్రకారం.. ఇరాన్‌లో ఆందోళనలను సైన్యం అదుపులోకి తీసుకురాలేదని, సాధ్యం కాదని భావించిన మరుక్షణమే ఖమేనీ(86) తన కుటుంబంతో పాటు సన్నిహితులైన దాదాపు ఇరవై మందితో దేశాన్ని వీడి వెళ్లడానికి ప్రణాళిక వేసుకున్నారు. ఆయన రష్యాకు వెళ్లే అవకాశం ఉంది. మరోవైపు, ఆందోళనకారులపై హింసాత్మక విధానాలను అవలంబిస్తే జోక్యం చేసుకుంటామన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఆర్మీ చీఫ్ అమిర్ హతామీ తీవ్రంగా స్పందించారు. అవసరమైతే ఇరానే ముందు జాగ్రత్తగా సైనిక చర్య చేపడుతుందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్ సైన్యం గతేడాది జూలైలో ఇజ్రాయెల్‌తో జరిగిన 12రోజుల యుద్ధం నాటికన్నా మరింత సమర్థంగా, సంసిద్ధంగా ఉందని అమిర్ అన్నారు. ఇదిలా ఉండగా, ధరల పెరుగుదల నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం నిత్యావసరాల కొనుగోలు కోసం ఆ దేశ పౌరులకు నెలకు 7డాలర్ల చొప్పున సబ్సిడీని ప్రకటించింది. కుటుంబ పెద్దల బ్యాంకు ఖాతాల్లో ఈ మొత్తాన్ని జమ చేస్తోంది. దీని వల్ల 7.1కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది. ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడికి వెళ్లరాదని, అక్కడ ఉన్న తమ పౌరులు జాగ్రత్తగా ఉండాలని పలు దేశాలు సూచిస్తున్నాయి. తాజాగా ఆస్ట్రేలియా కూడా తమ పౌరులకు అలాంటి సూచనే చేసింది. ఇరాన్‌లో ఉన్న ఆస్ట్రేలియా పౌరులు వెంటనే తిరిగి వచ్చేయాలని కోరింది. భారత్ కూడా ఈ మేరకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది.

మోదీ నన్ను.. 'సర్.. ప్లీజ్' అన్నారు

» అపాచీ హెలికాప్టర్లను త్వరగా పంపాలని విజ్ఞప్తి చేశారు: ట్రంప్

న్యూయార్క్, జనవరి 7: అపాచీ హెలికాప్టర్ల డెలివరీ గురించి భారత ప్రధాని మోదీ తనను నేరుగా సంప్రదించారని.. ఆ సమయంలో తనను 'సర్.. ప్లీజ్ మిమ్మల్ని కలవొచ్చా' అంటూ సంబోధించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. అపాచీ హెలికాప్టర్ల గురించి ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నామని మోదీ చెప్పగా.. తాను ఆ పరిస్థితిని మార్చుతున్నానని చెప్పినట్టు తెలిపారు. అమెరికా ప్రతినిధుల సభలోని రిపబ్లికన్ పార్టీ సభ్యుల వార్షిక సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యథావిధిగా.. మోదీతో తనకు మంచి సంబంధాలున్నాయన్న మాటను ట్రంప్ మరోసారి చెప్పారు. కాకపోతే భారత్‌పై తాను విధించిన సుంకాల కారణంగా మోదీ తనతో సంతోషంగా లేరన్నారు. కాగా.. భారత్ 68 అపాచీ హెలికాప్టర్లు ఆర్డర్ చేసిందంటూ ట్రంప్ అబద్ధం చెప్పారు. ఇండియా ఆర్డర్ చేసింది 28 హెలికాప్టర్లనే. వాటిలో 22 వాయుసేన కోసం కాగా.. ఆరు హెలికాప్టర్లు ఆర్మీ కోసం. ఇప్పటికే ఆ 28 హెలికాప్టర్లూ వచ్చాయి. మరో ఆరు హెలికాప్టర్ల కోసం ఆర్డర్ ఇచ్చే ఆలోచన మాత్రమే ప్రస్తుతానికి ఉంది. మరోవైపు, అమెరికా విధించిన అధిక టారిఫ్‌లతో భారత్ రష్యా నుంచి క్రూడాయిల్ కొనుగోళ్లను పూర్తిగా తగ్గించిందని ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో.. అమెరికా ఒత్తిళ్లకు ప్రధాని మోదీ లొంగిపోతున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. 1971నాటి భారత్-పాక్ యుద్ధ సమయంలో నాటి ప్రధాని ఇందిర అమెరికా ఒత్తిళ్లకు చలించకుండా నిలిచిన తీరును గుర్తు చేశారు.

రష్యా చమురు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా

ఐస్‌ల్యాండ్ సమీపంలో పట్టుకున్న అమెరికా కోస్ట్‌గార్డ్.. కరీబియన్ ప్రాంతంలో మరో చమురు ట్యాంకర్ కూడా..

» వెనెజువెలాపై ఆంక్షలున్నా చమురు సరఫరా చేస్తున్నందుకేన్న అమెరికా

వాషింగ్టన్, జనవరి 7: వెనెజువెలాపై ఆంక్షలున్నా ఆ దేశ చమురు సరఫరా చేస్తున్నాయంటూ రెండు చమురు రవాణా నౌక (ట్యాంకర్)లను అమెరికా స్వాధీనం చేసుకుంది. అందులో రష్యాకు చెందిన భారీ చమురు ట్యాంకర్ 'మరినెరా'తోపాటు సోఫియా పేరిట ఉన్న మరో ట్యాంకర్‌ను అమెరికా తీరప్రాంత గస్తీ దళం బుధవారం తమ నియంత్రణలోకి తీసుకుంది. ఉత్తర అట్లాంటిక్ సముద్ర ప్రాంతంలో ఐస్‌ల్యాండ్, యూకే మధ్య నుంచి ప్రయాణిస్తున్న 'మరినెరా'పై అమెరికా కోస్ట్‌గార్డు దళాలు హెలికాప్టర్లలో దిగి స్వాధీనంలోకి తీసుకున్నాయి. ఖాళీగా ఉన్న ఈ నౌక వెనెజువెలా నుంచి బయలుదేరి రష్యా వైపు ప్రయాణిస్తున్నట్టు గుర్తించారు. ఇక సోఫియా ట్యాంకర్ కరీబియన్ ప్రాంతంలో వెనెజువెలా వైపు ప్రయాణిస్తోంది. రష్యాకు చెందిన ఈ నౌక పేరు బెల్లా-1. వెనెజువెలాపై ఆంక్షలు ఉన్నా కూడా ఆ దేశం నుంచి చమురు రవాణా చేస్తోందని, హెజ్బొల్లా ఉగ్రవాద గ్రూపుతో సంబంధమున్న కంపెనీకి కార్గోను అక్రమంగా రవాణా చేస్తోందని పేర్కొంటూ దానిపై అమెరికా నిషేధం విధించింది. నిషేధాన్ని తప్పించుకొనేందుకు 'మరినెరా'గా పేరు మార్చి చమురు రవాణా కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అమెరికా దళాలు.. 'మరినెరా'ను స్వాధీనం చేసుకునేందుకు కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నాయి. డిసెంబరులోనే ఒకసారి విఫలయత్నం చేశాయి. తాజాగా మరినెరా నౌకపై నిఘా పెట్టిన అమెరికా కోస్టుగార్డ్.. 15 రోజులుగా అమెరికా పీ-8ఏ పొసైడాన్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో నిఘా పెట్టింది. కోస్ట్‌గార్డు షిప్‌లతో వెంటాడుతూ దాన్ని స్వాధీనం చేసుకోవడానికి మంగళవారమే ప్రయత్నాలు మొదలుపెట్టింది. బ్రిటన్‌కు చెందిన రాయల్ ఎయిర్‌ఫోర్స్, కోస్ట్‌గార్డ్ కూడా అమెరికా దళాలకు తోడుగా రంగంలోకి దిగాయి. ఈ విషయం తెలిసిన రష్యా మరినెరా నౌకకు రక్షణగా ఒక జలాంతర్గామిని, కొన్ని నౌకలను పంపింది. అవి సమీపంలోకి చేరుకునే సరికే అమెరికా కోస్టుగార్డు మరినెరాను నియంత్రణలోకి తీసుకున్నాయి.



అమెరికా- రష్యా మధ్య ఉద్రిక్తతలు!

రష్యా పతాకంతో ఉన్న పౌర ట్యాంకర్ నౌకను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయని, ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని రష్యా మండిపడింది. అమెరికా తీరానికి 4 వేల కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న పౌర నౌకను నియంత్రణలోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించింది. మరినెరా ట్యాంకర్‌తో తమకు సంబంధాలు తెగిపోయాయని, అందులోని రష్యా పౌరుల పట్ల గౌరవ ప్రదంగా వ్యవహరించాలని అమెరికాకు స్పష్టం చేసింది. వెనెజువెలాపై ఉన్న ఆంక్షలు, యూఎస్ ఫెడరల్ కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే.. మరినెరాను స్వాధీనం చేసుకున్నట్టు అమెరికా ప్రకటించింది. అయితే మరినెరా స్వాధీనం సమయంలో ఓ వైపు అమెరికా దళాలు, మరోవైపు రష్యా జలాంతర్గామి, నౌకలు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

కుక్కలకు కౌన్సెలింగ్ చేయడమే మిగిలింది!

» అలా చేస్తే వీధి కుక్కలు ఎవరినీ కరవవు!!

» వీధి కుక్కల రక్షణపై దాఖలైన పిటిషన్ల విచారణలో సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 7: వీధి కుక్కలు కరవడం వల్ల మాత్రమే ప్రజలు ప్రాణాలు కోల్పోవడం లేదని, వాటి వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా కూడా చనిపోతున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో స్థానిక సంస్థలు విఫలమవుతున్నాయని పేర్కొంది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. గత ఏడాది నవంబరు 7న తాము ఇచ్చిన ఆదేశాల్లో పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వీధి కుక్కలు లేకుండా చూడాలని.. వాటిని షెల్టర్లకు తరలించాలని చెప్పామని గుర్తు చేసింది. వీధి కుక్కలపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం బుధవారం విచారించింది. "రోడ్లపై కుక్కలు, ఇతర జంతువులు తిరగకుండా చూడాలి. కేవలం కుక్కల వల్లే కాదు కొన్ని జంతువులు రోడ్లపై తిరగడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక సంస్థలు నిబంధనలు, ఆదేశాలను కచ్చితంగా పాటించాలి" అని ధర్మాసనం పేర్కొంది. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? వాటివి ప్రాణాలు కావా?" అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్‌ను ప్రశ్నించింది. సిబాల్ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజ్ చేయడం, షెల్టర్లు నిర్మించడం వంటి పద్ధతులతో వీధి కుక్కల సమస్య తగ్గుతోందని తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. "ఇక కుక్కలకు కౌన్సెలింగ్ చేయడం ఒక్కటే మిగిలింది. కౌన్సెలింగ్ చేస్తే కుక్కలను విడిచిపెట్టిన తర్వాత అవి ఎవరినీ కరవవు" అంటూ సరదాగా వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లపై వాదనలు గురువారం కూడా కొనసాగనున్నాయి.



మహారాష్ట్రలో బీజేపీ-కాంగ్రెస్-ఎంఐఎం జట్టు

ముంబై, జనవరి 7: మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమిలో అవకాశవాద పొత్తుల చిచ్చు రాజుకుంది. మున్సిపల్ కౌన్సిళ్లను కైవసం చేసుకునేందుకు బీజేపీ-కాంగ్రెస్-ఎంఐఎం చేతులు కలిపాయి. థానే జిల్లా అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్‌ను దక్కించుకునేందుకు బీజేపీ-కాంగ్రెస్ జట్టు కట్టాయి. 27మంది కౌన్సిలర్లతో అతిపెద్ద పార్టీగా అవతరించిన శిందే సేనకు అధికారం దక్కకుండా చేసేందుకు బీజేపీ-కాంగ్రెస్-ఎన్సీపీ అంబర్‌నాథ్ వికాస్ అఘాడీ పేరిట కూటమిగా ఏర్పడ్డాయి. 60 స్థానాలున్న కౌన్సిల్‌లో మేయర్ పీఠం దక్కించుకోవడానికి 31మంది కౌన్సిలర్లు అవసరం కాగా బీజేపీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు, 12 మంది కాంగ్రెస్, ఎన్సీపీకి చెందిన నలుగురు, ఇద్దరు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు కలిపి మొత్తం 32 మంది కూటమిలో చేరారు. దీంతో బీజేపీకి చెందిన తేజశ్రీ కరన్‌జులే అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్ మేయర్‌గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటూ పిలుపునిచ్చిన కమలనాథులు అదే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం తమను వెన్నుపోటు పొడవమేనని, అధికారం కోసం ఎంతకైనా దిగజారడం సరికాదని శిందే సేన నేతలు ఆరోపించారు. అయితే తాము పొత్తు కోసం యత్నించినా శిందే సేన ముందుకు రాలేదని స్థానిక బీజేపీ నేతలు స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీకి మద్దతిచ్చిన 12 మంది కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

ఎంఐఎం మద్దతుతో అకోట్ కౌన్సిల్ కైవసం

35 స్థానాలున్న అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో బీజేపీ తరఫున 11 మంది కౌన్సిలర్లు నెగ్గారు. దీంతో ఉద్ధవ్ ఠాకరే యూబీటీ, శిందే సేన, అజిత్ పవార్ ఎన్సీపీ, శరద్ పవార్ ఎన్సీపీలకు చెందిన కౌన్సిలర్లతో పాటు ఏఐఎంఐఎంకు చెందిన నలుగురు కౌన్సిలర్లతో కలిపి కమలనాథులు అకోట్ వికాస్ మంచ్‌గా కూటమి ఏర్పాటు చేశారు. మొత్తం 25 మంది కౌన్సిలర్ల మద్దతుతో బీజేపీకి చెందిన మాయా ధులే మేయర్‌గా ఎన్నికయ్యారు. మరోవైపు కాంగ్రెస్, ఎంఐఎంలతో స్థానిక నేతలు పొత్తులు పెట్టుకోవడాన్ని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ తప్పుబట్టారు. సదరు నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన పొత్తులు వదులుకోవాలని సూచించారు.



శ్రీవారి ఆలయంలో మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

ఏపీని మోడల్‌గా తీసుకుంటాం

» రాష్ట్రం స్ఫూర్తిగా మారిషస్ అభివృద్ధి : ధరమ్ బీర్ గోకుల్

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మారిషస్ స్ఫూర్తిగా తీసుకుంటున్నదని ఆ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ చెప్పారు. తిరుమలలో ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని బుధవారం సందర్శించిన ఆయన అక్కడ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మారిషస్‌లో నిర్మిస్తున్న హరిహర దేవస్థానంలో టీటీడీ సలహాలు, సూచనలతో వేదపాఠశాల ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. వేదవిజ్ఞానపీఠంలో ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని స్వాగతం పలికి వేదవిజ్ఞానపీఠం చరిత్రను వివరించారు.

శ్రీవారిసేవలో ధరమ్ బీర్ గోకుల్

మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ స్వాగతం పలికారు. ధరమ్ బీర్ గోకుల్ ధ్వజస్తంభానికి మొక్కుకున్న తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, క్యాలెండర్, పంచగవ్య ఉత్పత్తులను అందజేశారు.

జిల్లాల్లో రోడ్డు భద్రత కమిటీల పునరుద్ధరణ

» ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాల్లో రోడ్డు భద్రత కమిటీలను పునరుద్ధరిస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి జిల్లాలోనూ కలెక్టర్ ఛైర్మన్‌గా, పోలీస్ కమిషనర్ లేదా ఎస్పీ, జిల్లా రవాణా అధికారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ, జాతీయ రహదారుల ఈఈ, కేంద్ర రవాణా శాఖ ప్రతినిధి, ఎన్‌హెచ్ఏఐ పీడీ, జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కమిషనర్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, రోడ్డు భద్రతపై పనిచేసే ఎన్జీవో, ఏపీఎస్ఆర్టీసీ జిల్లా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆయా జిల్లాల్లో రోడ్డు భద్రతపై సమగ్రంగా చర్చించి ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల గుర్తింపు, ఇంజనీరింగ్ లోపాలు సరిదిద్దడం, ట్రాఫిక్ నియంత్రణ, ఎమర్జెన్సీ వైద్య సేవల సమన్వయం చేస్తుంది.

తుని రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం

» కమ్ముకున్న పొగలు.. పరుగులు తీసిన ప్రయాణికులు

తుని రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ ముఖ ద్వారం పైన ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ఎసెస్‌మెంట్ బోర్డు సమీపంలో మంటలు చెలరేగి పొగలు కమ్ముకున్నాయి. దీంతో ఉలిక్కిపడిన ప్రయాణికులు అక్కడ నుంచి పరుగులు తీశారు. విషయాన్ని గమనించిన స్టేషన్ మాస్టర్ ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌ను అప్రమత్తం చేసి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పి పరిస్థితిని చక్కదిద్దారు. అయితే ఈ అగ్నిప్రమాదానికి గల కారణంపై ఇటు రైల్వే స్టేషన్ అధికారులు, అటు జీఆర్పీ పోలీసులు కానీ స్పష్టత ఇవ్వడం లేదు. ఇదిలా ఉంటే మతిస్థిమితం లేని ఒక వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని స్థానిక తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు.

మంటలు తగ్గుముఖం..!

» బ్లోఔట్ బావి వద్ద తగ్గిన తీవ్రత, శబ్దం

» 3 నుంచి 4 మీటర్లకు పరిమితమైన అగ్నికీలలు

» ప్రత్యేక రోడ్డు ఏర్పాటుతో శకలాల తొలగింపు వేగవంతం

» ఢిల్లీ నుంచి వచ్చిన శ్రీహరి బృందం రంగంలోకి

» బ్లోఔట్ పూర్తి అదుపునకు నేటి నుంచి యాక్షన్ ప్లాన్

» మూడు వైపుల నుంచి వాటర్ అంబ్రెల్లా ద్వారా పంపింగ్

» పునరావాస శిబిరాల నుంచి ఇళ్లకు చేరిన బాధితులు



కోనసీమ జిల్లా ఇరుసుమండలో అదుపులోకి వస్తున్న బ్లోఔట్ మంటలు

అమలాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం కోనసీమలో చెలరేగిన 'బ్లో ఔట్' మంటలు తగ్గుముఖం పడుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో సోమవారం ఓఎన్జీసీ మోరి-5 బావిలో డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న సమయంలో బ్లోఔట్ సంభవించిన సంగతి తెలిసిందే. తొలిరోజు సుమారు వంద అడుగుల వరకూ ఎగసిపడిన మంటల తీవ్రత బుధవారానికి 3 నుంచి 4 మీటర్లకు తగ్గింది. బావి నుంచి వెలువడే శబ్దం కూడా తగ్గడంతో ఇరుసుమండ సహా సమీప గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 460 మందికి పైగా బాధితులు తమ ఇళ్లకు చేరుకున్నారు.

బావి వద్ద నిపుణుల బృందం సమీక్ష

ఢిల్లీ నుంచి వచ్చిన ఓఎన్జీసీకి చెందిన నిపుణుడు శ్రీహరితోపాటు ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు విక్రమ్ సక్సేనా, శాంతనూర్‌దాస్ బ్లోఔట్ బావి వద్ద పరిస్థితులను సమీక్షించారు. గురువారం నుంచి వెల్ క్యాపింగ్ ప్రక్రియకు రంగం సిద్ధం చేస్తామని శ్రీహరి వెల్లడించారు. ప్రస్తుతం పొలాల్లో నుంచి పంచాయతీరాజ్ అధికారులు డ్రిల్లింగ్ సైట్ వద్దకు యుద్ధ ప్రాతిపదికన ఒక రహదారిని నిర్మించారు. కుప్పకూలిన రిగ్ శకలాల (డెబ్రిస్)ను ఆ రోడ్డు నుంచి తొలగించే పనిలో ఓఎన్జీసీ సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రమాదం జరిగిన సైట్ చుట్టూ రెండు భారీ చెరువులను తవ్వి, పంటకాల్వ నుంచి నీటిని అక్కడకు మళ్లించి భారీ ఫైర్ ఫైటింగ్ అంబ్రెల్లాల ద్వారా నీటిని మంటలపైకి వెదజల్లుతున్నారు. ప్రస్తుతం మూడు వైపుల నుంచి నీటితోపాటు కెమికల్స్‌తో కూడిన మడ్ పంపింగ్ చేపట్టారు. దీంతో మంటలు నియంత్రణలోకి వస్తున్నాయి. ఓఎన్జీసీ నిపుణులను సంప్రదించిన అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి సంఘటనా స్థలం వద్ద పరిస్థితిని సమీక్షించారు. చుట్టూ ఉన్న డెబ్రిస్‌ను తొలగించిన తర్వాత నిపుణుల బృందం వెల్ మౌత్‌ను కూడా పరిశీలించనుంది. బావిని మూసివేసే సమయంలో గ్యాస్ ప్రెజర్‌ను కట్టడి చేసేందుకు స్కమ్ బ్లడ్డర్ వాహనాలతో ప్రత్యేక నిపుణుల బృందం సైట్ వద్దే ఉంది. మడ్ పంపింగ్ ద్వారా గ్యాస్ నియంత్రణను అరికట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నరసాపురం సహా వివిధ ప్రాంతాల నుంచి భారీ పరికరాలు ఇరుసుమండకు చేరుకుంటున్నాయి. కాగా, అమలాపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఓఎన్జీసీ డైరెక్టర్లు బ్లోఔట్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నిపుణుల బృందాలు మంటల నియంత్రణ చర్యలు కొనసాగిస్తున్నారని కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇరుసుమండ సహా మూడు గ్రామాల ప్రజలు తమ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యారని అన్నారు. నిపుణుల బృందంతో చర్చించి గురువారం నుంచి యాక్షన్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుంటామన్నారు. కాగా, బ్లోఔట్ సైట్ వద్ద స్థానికులు 'ఓఎన్జీసీ గోబ్యాక్' అంటూ కాసేపు ఆందోళన చేపట్టారు.



ఇరుసుమండ బ్లోఔట్ ప్రాంతం నుంచి శకలాల తొలగింపు కోసం వేసిన రోడ్డు

చంద్రబాబు బీసీల పక్షపాతి

» చరిత్రాత్మక బీసీ రక్షణ చట్టం ఘనత ఆయనదే

» జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

విజయవాడ (గాంధీనగర్) జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రక్షణ చట్టం తెచ్చేందుకు సీఎం చంద్రబాబు చేసిన కృషి ప్రశంసనీయం, చరిత్రాత్మకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. విజయవాడలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలపై ఆత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను అరికట్టేందుకు ఏపీ ప్రభుత్వం తెస్తున్న బీసీ రక్షణ చట్టం దేశానికి ఆదర్శమన్నారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఇటువంటి చట్టాన్ని ఏ ప్రభుత్వం తీసుకురాలేదని, ఈ ఘనత చంద్రబాబుకు దక్కుతుందని పేర్కొన్నారు. దీంతో చంద్రబాబు బీసీల పక్షపాతి అని మరోసారి రుజువైందన్నారు. దీనికి పూర్తిస్థాయిలో చొరవ తీసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఈ సందర్భంగా కృష్ణయ్య అభినందించారు. ఎన్.మారేష్ మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టరూపం దాల్చాలని కోరుతున్నట్టు తెలిపారు. 140 బీసీ సంఘాల ఆధ్వర్యంలో సీఎం చందబాబును ఘనంగా సత్కరిస్తామని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న వైకుంఠద్వార దర్శనాలు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠద్వార దర్శనాలు గురువారంతో ముగియనున్నాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో 6.24 లక్షల మందికి వైకుంఠద్వార దర్శనం లభించింది. రూ.32.17 కోట్లు హుండీ ఆదాయం లభించింది. కాగా, బుధవారం భక్తుల సర్వదర్శనానికి 15 గంటల సమయం పట్టింది.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

» ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల సంఘాల వినతి

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి. బుధవారం రెండు సంఘాలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అర్థం చేసుకుంటున్నామని, కానీ కాలేజీల పరిస్థితి కూడా క్లిష్టంగానే మారిందని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోయి సుబ్బారావు, గ్రంధి సత్యనారాయణ తెలిపారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేసి కొంతవరకైనా కాలేజీలకు ఉపశమనం కలిగించాలని కోరారు. అలాగే 2026-29 బ్లాక్ పీరియడ్‌కు ఫీజుల ఖరారు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. 'బ్యాంకుల నుంచి కాలేజీలు తీసుకునే ఓడీ లోన్లు పరిమితి దాటిపోయాయి. బ్యాంకులు కూడా ఆదుకునే స్థితి లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేయాలి.' అని ప్రైవే టు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సం ఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, జి.రాజ్‌కుమార్ చౌదరి కోరారు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో ఎంఎస్ఎంఈ డైరెక్టర్లు

'ఇంటికో పారిశ్రామిక వేత్త' లక్ష్యం సాధించాలి

» ఎంఎస్ఎంఈడీసీ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి కొండపల్లి

అమరావతి/తాడేపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త' లక్ష్య సాధన దిశగా ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలు పని చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంటికొక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు రాష్ట్రంలో చిన్న పరిశ్రమల స్థాపనకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ఎంఎస్ఎంఈడీసీ బోర్డు డైరెక్టర్లు ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేలా బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. ఎంఎస్ఎంఈడీసీ బోర్డు డైరెక్టర్లుగా బండారు రవికాంత్ (తెనాలి), అంబటి భూలక్ష్మి (పి.గన్నవరం), భూమే వెంకట నారాయణ (రాప్తాడు), డాక్టర్ చిన్నరాజు గుడిపూడి (పెదకూరపాడు), రాపర్ల జగన్నాథరావు (వినుకొండ), వాయుగండ్ల కౌశిక్ (కర్నూలు), మురళీమోహన్ (చంద్రగిరి), నల్లే వీరప్రసన్నకుమార్ (కాకినాడ రూరల్), నీలపు విజయానందరెడ్డి (విశాఖపట్నం), ప్రధాన విజయరామ్ (శ్రీకాకుళం), ముగడ రాజారావు (విశాఖపట్నం తూర్పు), వి.వి.సత్యనారాయణమూర్తి పోతుల (పాలకొల్లు), రావిల్ల వీరేందర్ కుమార్ (కోవూరు)లు మంత్రి సమక్షంలో డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, సీఈవో విశ్వ మనోహర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌లలో తెలుగు విద్యార్థుల సత్తా

» ఏపీ నుంచి 1,345 మంది.. తెలంగాణ నుంచి 538 మంది ఎంపిక

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ఫౌండేషన్ 2025-26 విద్యా సంవత్సరానికి ప్రకటించిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్‌లకు దేశవ్యాప్తంగా 5,100 మంది విద్యార్థులను (యూజీ 5,000, పీజీ 100) ఎంపిక చేయగా వారిలో అత్యధిక సంఖ్యలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే మొత్తం 1,883 (ఏపీ 1,345, తెలంగాణ 538) మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల ప్రతిభ, ఆర్థిక పరిస్థితుల (మెరిట్ కమ్ మీన్స్) ఆధారంగా ఎంపిక చేసిన వారిలో 83 శాతం మంది వార్షికాదాయం రూ. 2.5 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాల నుంచే రావడం విశేషం. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా అందిస్తున్న ఈ స్కాలర్‌షిప్పులలో బాలికలు, దివ్యాంగ విద్యార్థులకు కూడా తగిన ప్రాధాన్యం లభించింది. ఈ స్కాలర్‌షిప్పులకు ఎంపికైన యూజీ విద్యార్థులకు రూ. 2 లక్షల వరకు, పీజీ విద్యార్థులకు రూ. 6 లక్షల వరకు ఆర్థిక సాయం లభిస్తుంది. ఇప్పటివరకు రిలయన్స్ ఫౌండేషన్ వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 33,471 స్కాలర్‌షిప్‌లను అందించి, వారికి అండగా నిలిచింది. ఈ ఆర్థిక సాయంతోపాటు విదార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దేందుకు మెంటారింగ్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ, గ్లోబల్ అలూమ్నీ నెట్‌వర్క్ సహకారం కూడా లభిస్తుంది.

ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులే అడ్డంకి : షాలిని

తెలంగాణ నుంచి ఎంపికైనవారిలో భద్రాచలానికి చెందిన రైతు బిడ్డ యర్ర షాలిని ఒకరు. ప్రస్తుతం పంజాబ్‌లోని ఐఐటీ రోపర్‌లో బీఎస్సీ, బీఈడీ కోర్సు చదువుతున్న షాలిని స్పందిస్తూ.. 'మాలాంటి వ్యవసాయ కుటుంబాల పిల్లలకు ఆర్థిక ఇబ్బందులే మా ఉన్నత విద్యకు అడ్డంకి. ఈ స్కాలర్‌షిప్ వల్ల నేను నా చదువుపై పూర్తి దృష్టి పెట్టగలను. నా లక్ష్యాలను సాధించడానికి ఇది గొప్ప ప్రోత్సాహం. భవిష్యత్తులో కష్టపని పనిచేసి సమాజానికి సేవ చేసేందుకు ఇది నన్ను ప్రేరేపిస్తుంది' అని పేర్కొన్నారు.

వివేకానంద జయంతి సందర్భంగా యూత్ మారథాన్: మాధవ్

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ నెల 11న రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాల్లో 5 కి.మీ. యూత్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10 నుంచి 12 వరకూ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బంగాళాఖాతంలో వాయుగుండం



జి.మాడుగులలో బుధవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో మంచు

» నేడు తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం

» 10,11 తేదీల్లో సీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హిందూమహాసముద్రం, దానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బుధవారం ఉదయానికి వాయుగుండంగా బలపడింది. ఇది ప్రస్తుతం చెన్నైకు 1220 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా ఉంది. రానున్న 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడనున్నది. ఆ తరువాత 48 గంటలు పశ్చిమ వాయవ్యంగా పయనించి శ్రీలంకలో తీరం దాటి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించనున్నది. ఆ తరువాత బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండంగా మారిన తరువాత శ్రీలంకలో తీరం దాటే క్రమంలో తమిళనాడులో వర్షాలు పెరుగుతాయి. దక్షిణ తమిళనాడులో ఈనెల తొమ్మిదో తేదీ నుంచి భారీవర్షాలు కురవనున్నాయి. 10, 11 తేదీల్లో రాయలసీమలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, దక్షిణ కోస్తాలోని నెల్లూరు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. 10వ తేదీ నుంచి దక్షిణ కోస్తాలో గాలుల వేగం పెరుగుతుందని పేర్కొంది. ఇదిలావుండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తూర్పుగాలుల ప్రభావంతోనే వాయుగుండంగా బలపడిందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. చలికాలంలో అందునా జనవరిలో వాయుగుండాలు/తుఫాన్‌లు అరుదుగా వస్తుంటాయన్నారు. చలికాలంలో సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడం, ఇంకా సైబీరియా నుంచి వీచే శీతలగాలుల వల్ల వాయుగుండాలు/తుఫాన్‌లు ఏర్పడానికి అనుకూల వాతావరణం ఉండదన్నారు. వాతావరణ శాఖ వద్ద ఉన్న వివరాల మేరకు గడచిన 160 సంవత్సరాలలో 1926, 1939, 2005 సంవత్సరాల్లో మాత్రమే జనవరి నెలలో బంగాళాఖాతంలో వాయుగుండాలు/తుఫాన్‌లు ఏర్పడ్డాయని, మళ్లీ 2026లో వాయుగుండం ఏర్పడిందని గుర్తుచేశారు.

మళ్లీ పెరిగిన చలి

అల్లూరి జిల్లా జి.మాడుగులలో 2.7 డిగ్రీలు

రాష్ట్రంలో గడచిన రెండు రోజుల నుంచి చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. బంగాళాఖాతంలో వాయుగుండం దిశగా ఉత్తరాది నుంచి గాలులు వీస్తుండడం, దేశంలోని అనేక ప్రాంతాల్లో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంలో చలి తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో చలి మరికొంచెం పెరుగుతుందని చెప్పారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 2.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాదిలో అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే కావడం విశేషం. ముంచంగిపుట్టులో 3.5 డిగ్రీలు నమోదైంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇరాన్‌కు ట్రంప్ గండం!

తన దేశం ప్రజాస్వామ్యం వైపు ప్రయాణిస్తోందని ఇరాన్ చిట్టచివరి షా పెద్దకుమారుడు మహ్మద్ రెజా పహ్లవి అంటున్నారు. మతపెద్దల పాలనలో యాభైయేళ్ళుగా విసిగివేసారిన ఇరానియన్లు తమ ఉజ్వల భవిష్యత్తుకోసం, భావితరాల అభ్యున్నతి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాటాలు చేస్తున్నారని పహ్లవి ప్రశంసించారు. ఒక హంతకుడినో, రేపిస్టునో సంకెళ్ళు వేసి జైలుకు తరలించినట్టుగా ఒకదేశాధ్యక్షుడిని సైనికహెలికాప్టర్‌లో అమెరికా తరలించుకుపోయిన డోనాల్డ్‌ట్రంప్ అదేరీతిలో ఇరాన్‌లోనూ చొరబడి, అక్కడి పాలకులను కూల్చి తనను ప్రతిష్ఠిస్తారని పహ్లవీకి ఆశలు చిగురించి వుంటాయి. మదురోను అమెరికా ముట్టడించిన తీరు చూసిన వారికి తరువాత దెబ్బ ఇరాన్‌కు తగలక తప్పదనిపించడం సహజం. సామాన్యులే కాదు, మహామహ మేధావులు సైతం ట్రంప్ త్వరలోనే ఇరాన్ పాలకులను మట్టుబెట్టి, ఇజ్రాయెల్ ముచ్చట తీర్చడం ఖాయమని అంటున్నారు. మాదకద్రవ్యాల ఉగ్రవాది అన్న ఆరోపణమీద మదురోను సునాయాసంగా ఎత్తుకుపోయి అమెరికా బోనులో నిలబెట్టిన ట్రంప్, ఇజ్రాయెల్ పక్షాన ఇరాన్‌తో యుద్ధం చేసి, శత్రువులను హతమారుస్తాడని నమ్ముతున్నారు. ట్రంప్ దూకుడుని ఎన్నో దేశాలు ఖండించినా, అంతకుమించి ఎవరూ ఏమీ చేయని, చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు, ఇటువంటి నమ్మకాలు కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఇరాన్‌లో కరెన్సీ విలువపడిపోయి నందుకు దుకాణదారులు ఆగ్రహంతో రోడ్డుమీదకు వచ్చే, పదిరోజుల్లోనే అది మహోధృత ప్రజాఉద్యమంగా రూపాంతరం చెందడం వెనుక అమెరికా ప్రోద్బలమూ, ఆశీస్సులూ ఉన్నాయని అంటారు. గతంలో ఇలాంటి ఆందోళనలు రేగినా, ఇరాన్ పాలకులు వాటిని సునాయాసంగా అణచివేశారు. కానీ, ఇప్పుడు దేశంలో సగానికిపైగా ప్రావిన్సులకు విస్తరించిన నిరసనలు ఇటీవలికాలంలో చూడనివని, నియంత్రించడం కష్టమని వార్తలు వస్తున్నాయి. మదురోను అమెరికా ముట్టడించిన మట్టం ఇరానియన్లలో ఉత్సాహాన్ని పెంచిందని, తమను ఎవరూ ఏమీ చేయలేరన్న నమ్మకాన్ని పెంచిందని, మరోపక్క, నిరసనలను కఠినంగా అణచివేసే విషయంలో ఇరాన్ పాలకులు వెనక్కుతగ్గుతున్నారని మీడియా అంటోంది. నిరసనకారులమీద బలప్రయోగం వద్దు అన్న ఇరాన్ అధ్యక్షుడి ఆదేశాల వెనుక, వారి జోలికి వస్తే ఊరుకోనేదిలేదని, బరిలోకి దిగుతానని ట్రంప్ చేసిన హెచ్చరిక పనిచేసిందని కొందరి నమ్మకం. వందలాది అరెస్టులు జరిగి పోయి, ముప్పైఐదుమంది ప్రాణాలు పోయిన నేపథ్యంలో, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ శాంతి యుతంగా నిరసిస్తున్నవారి జోలికి పోకండని తన బలగాలకు ఓ మాట చెప్పడం కూడా ఇప్పుడు ట్రంప్ ఖాతాలోకే పోతోంది.

మందుగుండు దట్టించి, లాక్ బిగించానంటున్న ట్రంప్, మదురో తరహాలో ఇరాన్ పెద్దలతో వ్యవహరించలేరన్నది వాస్తవం. తొలివిడత ఏలుబడిలోనే ఆయన వెనెజువెలాలోకి చొరబడాలని నిర్ణయించుకొని మలి రాకడలో ఆ పనిచేశాడని, ఈ కొత్త సంవత్సరం తొలిరోజున ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ పక్కన ఉండగా 'ఇరాన్.. నెక్స్ట్ నువ్వే' అని హెచ్చరికలు చేశారు కనుక, త్వరలోనే దొరకాటు ఖాయమని అంతా విశ్లేషిస్తున్నారు. కానీ, లాటిన్ అమెరికా, పశ్చిమాసియా మధ్య హస్తిమశకాంతరం ఉన్నదని ట్రంప్‌కు తెలియనిది కాదు. అణ్వస్త్రాలు లేకపోవచ్చు కానీ, క్షిపణి సంపత్తి దండిగా ఉన్న ఇరాన్ గట్టిగానే జవాబు చెబుతుంది. రష్యా, చైనాలు సైతం రంగంలోకి దిగే ప్రమాదమూ ఉంది. ఇరాన్‌లో నిరసనలు కొత్తకాదు. గత పాతికేళ్ళలోనే వందలాది నిరసనలు జరిగాయి, అనేకం వాటంతటవే ఆగిపోయాయి, కొన్నింటిని పాలకులు తమ నిర్ణయాలను సరిదిద్దుకోవడం ద్వారా చల్లారిపోయేట్టు చేశారు. ప్రధానంగా చమురు ఎగుమతులు బాగా తగ్గి ఆర్థికంగా ఇప్పుడు మరింత కఠినమైన పరిస్థితులను ఇరాన్ ఎదుర్కొంటున్నది. కరెన్సీ విలువ సగానికి పడిపోవడం, కొనుగోలు శక్తిసన్నగిల్లడం ప్రజాగ్రహానికి కారణమవుతున్నాయి. గత ఏడాది జూన్‌లో ఇరాన్ మీదకు కాలుదువ్విన ఇజ్రాయెల్ పక్షాన అమెరికా రంగప్రవేశంచేసి మూడు అణుకేంద్రాలను ధ్వంసం చేసింది. పన్నెండురోజుల ఆ యుద్ధంలో పైచేయి ఎవరిదన్న ప్రశ్న అటుంచితే, ఈ కొత్త సంవత్సరంలో ఇరాన్ జోలికి అమెరికా పోయిన పక్షంలో అది సరిహద్దులకే పరిమితం కాబోదని, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తుందన్నది వాస్తవం.

గిగ్ ఎకానమీలో 'న్యాయం' ఎక్కడ?

నేటి డిజిటల్ యుగంలో కూర్చున్న చోటుకే అన్నీ వచ్చేస్తున్నాయి. ఫోన్‌లో ఒక్క క్లిక్‌తో ఆహారం, మరో క్లిక్‌తో నిత్యావసరాలు నిమిషాల్లో ఇంటి తలుపు తడుతున్నాయి. ఈ సౌలభ్యం వెనుక వేల సంఖ్యలో డెలివరీ భాగస్వాముల చెమట చుక్కలు ఉన్నాయి. అయితే, ఈ 'క్విక్ కామర్స్' సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్న శ్రామికుల పరిస్థితి 'దీపం కింద చీకటి'లా మారుతోంది. ఇటీవల జొమాటో, బ్లింకిట్ సంస్థల అధినేత దీపిందర్ గోయల్, తమ ప్లాట్‌ఫామ్ పర్యావరణ వ్యవస్థ అత్యంత 'న్యాయబద్ధంగా' ఉందంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

భారతదేశంలో గిగ్ ఎకానమీ అతిపెద్ద ఉపాధి కల్పన యంత్రాంగమని యాజమాన్యాలు గొప్పగా చెప్పుకుంటాయి. కానీ, ఈ పనులు ఎంతవరకు వ్యవస్థీకృతం అనేదే ప్రశ్న. డెలివరీ భాగస్వాములు కంపెనీ రికార్డుల్లో ఉద్యోగులు కారు; వారు కేవలం 'స్వతంత్ర కాంట్రాక్టర్లు' లేదా 'భాగస్వాములు'. దీంతో వారికి కనీస వేతనం, ప్రావిడెంట్ ఫండ్, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలేవీ అందవు. వీరి ఆదాయం కంపెనీల ఏకపక్ష నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. గత సెప్టెంబరులో ఒక ఆర్డర్‌కు రూ.22–30 వరకు లభించే ప్రాథమిక వేతనం, నవంబర్ నాటికి రూ.15–27కి, ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో రూ.10–15కి పడిపోయింది. పెట్రోల్



ధరలు, జీవన వ్యయం పెరుగుతున్న తరుణంలో, వచ్చే అరకొర ఆదాయం వాహన మరమ్మతులకు, ఇంధనానికే సరిపోతుంటే, ఇక కుటుంబ పోషణ ఎలా సాధ్యం?

కార్మికుల ప్రధాన ఆవేదన '10 నిమిషాల డెలివరీ' విధానం. వినియోగదారులను ఆకర్షించడానికి కంపెనీలు చేస్తున్న ఈ ప్రయోగం డెలివరీ ఏజెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. పక్కనే ఉన్న 'డార్క్ స్టోర్ల' నుంచి వస్తువులు పంపడం సిద్ధాంతపరంగా సులభమే. కానీ దేశంలో ట్రాఫిక్, ఇరుకైన సందులు, అస్థిరమైన వాతావరణ పరిస్థితుల్లో ఈ సమయపాలన అసాధ్యం. ఈ ఒత్తిడి వల్ల డెలివరీ బాయ్స్ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, అతివేగంగా వెళ్లడం వంటివి చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

డిసెంబర్ 31న దేశవ్యాప్తంగా డెలివరీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. పండుగ రోజుల్లో అందరూ సంబరాలు చేసుకుంటుంటే, వీరు మాత్రం తమ కనీస హక్కుల కోసం రోడ్డెక్కారు. సమ్మె పిలుపు ఉన్నా, చాలామంది కార్మికులు విధులకు హాజరు కావాల్సి వచ్చింది. ఇది వారు యాజమాన్యంపై ఉన్న ప్రేమతో చేసిన పని కాదు, కేవలం ఆకలి బాధతో చేసిందే. ఒక్కరోజు ఆదాయం కోల్పోతే ఆ నెల గడవని పరిస్థితి వారిది. దీనిని ఆసరాగా చేసుకున్న సంస్థలు, పండుగ రాత్రి వేళల్లో ఒక్కో ఆర్డర్‌కు రూ.120–150 వరకు ప్రోత్సాహకాలు ప్రకటించాయి. ఇది ఒక రకమైన 'ఆర్థిక వివక్ష'.

ఉద్యోగ అవకాశాలు లేని దేశంలో గిగ్ ఎకానమీ ఒక ఆశాకిరణం లాంటిదే. కానీ, ఆ కిరణం కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి తప్ప, వారిని దహించకూడదు. కంపెనీల వృద్ధి, మార్కెట్ విలువ ముఖ్యం కావొచ్చు, కానీ అది వ్యవస్థను నడిపే మనుషుల సంక్షేమాన్ని బలి తీసుకుని సాధించకూడదు. డెలివరీ ఏజెంట్లను 'ఖర్చు'గా కాకుండా, నిజమైన 'భాగస్వాములు'గా గుర్తించినప్పుడే వ్యవస్థకు గౌరవం ఉంటుంది. కేవలం మాటల్లో 'న్యాయం' అని చెబితే సరిపోదు, గిగ్ కార్మికుడు రోడ్డుపై ప్రతి ఆర్డర్ డెలివరీ చేసేటప్పుడు అనుభవించే 'భద్రత'లో అది కనిపించాలి.

● వెంకగారి భూమయ్య

ఆర్భాటమే కానీ ఆత్మీయత ఏదీ?

నేటి భారతీయ సమాజంలో వేడుకలు క్రమంగా ఆర్భాట ప్రదర్శనలవుతున్నాయి. ఒకప్పుడు ఆత్మీయులను పిలిచి, పరిమితంగా జరుపుకున్న సంబరాలు ఇప్పుడు భారీ శబ్దం, విపరీతమైన వ్యర్థాలతో ముగుస్తున్నాయి. ఇది నిజంగా ఆనంద సంస్కృతేనా? లేక పోటీ భావమా?

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్‌వో) ప్రకారం నివాస ప్రాంతాల్లో రాత్రివేళ శబ్దం 40 డెసిబెల్స్ మించకూడదు. పగలు కూడా 55 డెసిబెల్స్ దాటితే నిద్రలేమి, ఒత్తిడి, రక్తపోటు వంటి సమస్యలు తలెత్తుతాయి. కానీ మన వేడుకల్లో శబ్ద స్థాయి తరచూ 90 నుంచి 100 డెసిబెల్స్‌కు చేరుతోంది. శబ్ద కాలుష్యంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు మరో పెద్ద సమస్యగా మారాయి. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కవర్లు, నీటి సీసాలు వేడుక ముగిసే సరికి చెత్త కుప్పలుగా మారుతున్నాయి. డబ్ల్యూహెచ్‌ఓతో పాటు ఐక్యరాజ్యసమితి పర్యావరణ సంస్థలు హెచ్చరిస్తున్నట్లుగా, ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ సూక్ష్మ కణాలుగా మారి మన ఆహారం, నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తోంది. దీని ప్రభావం తక్షణమే కాదు, తరతరాలకు ప్రమాదకరం.



ఆహారం విషయంలోనూ ఇదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. అధికంగా మసాలాలు, ఫుడ్ కలర్స్, నూనెలతో చేసిన వంటకాలు, పరిశుభ్రత లోపించిన వంటగదులు, వేల మందికి ఒకేసారి వండే విధానం– ఇవన్నీ ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. భారీ సంఖ్యలో వండే ఆహారంలో పరిశుభ్రత పాటించకపోతే ఆహార విషపూరితమయ్యే ప్రమాదం ఎక్కువ. ఇటీవల గ్రామదేవత ఉత్సవాలలోనూ ఆర్భాటం చోటుచేసుకుంటోంది. వంట మనుషులతో వంటలు, భారీ టెంట్లు, వేల మందికి భోజనాలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల జనసమ్మర్దాన్ని నియంత్రించేందుకు పోలీస్ బందోబస్తు అవసరం అవుతోంది. భక్తి, సంప్రదాయం పేరుతో జరుగుతున్న ఈ హడావుడి అసలు ఆధ్యాత్మిక భావనను మసకబార్చుతోంది.

ఇప్పటికే అధిక జనాభా, పరిమిత వనరులతో సతమతమవుతున్న భారతదేశంలో ఈ అతి వేడుకలు శబ్ద, పర్యావరణ కాలుష్యాలను మరింత పెంచుతున్నాయి. సంబరాలు తప్పుకాదు కానీ, అవి సమాజానికి, ప్రకృతికి భారంగా మారడం సంస్కృతి కాదు, అవివేకం. ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రతి పౌరుడూ ఆలోచించాల్సిన సమయం ఇది. వేడుకలను చిన్నవిగా, అర్థవంతంగా, పర్యావరణహితంగా నిర్వహిద్దాం. శబ్ద పరిమితులు పాటిద్దాం. ప్లాస్టిక్‌కు తావివ్వకుండా ప్రత్యామ్నాయాలను ఎంచుకుందాం. అవసరానికి మించిన ఆహార వృథాను ఆపుదాం.

● వసుంధరాదేవి (టీచర్)

అమెరికా అధర్మానికి అంతెక్కడ?

బలప్రయోగం, బెదిరింపుల ద్వారా వెనెజువెలా రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేందుకు లేదా ఆ దేశంపై పెత్తనం చెలాయించేందుకు ఏ సభ్యదేశానికైనా హక్కు ఉందా? అనేదే భద్రతామండలి ముందు ప్రస్తుతం ఉన్న అంశం. ఇది ఐక్యరాజ్యసమితి అధికార పత్రం (చార్టర్)లోని సెక్షన్ 4తో నేరుగా ముడివడి వుంది. ప్రపంచ దేశాల ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా బలప్రయోగం లేదా బెదిరింపులకు పాల్పడడాన్ని ఆ నిబంధన నిషేధించింది. ఆ నియమాన్ని సమర్థించి, స్థిరపరచడమా లేక ఉపేక్షించి వదిలివేయడమా అనే విషయమై భద్రతా మండలి నిక్కచ్చిగా నిర్ణయం తీసుకోవాలి. ఆ నిబంధనను ధ్రువీకరించని పక్షంలో తీవ్రమైన పర్యవసానాలు సంభవిస్తాయి.

1947 నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో తమకు ప్రతికూలంగా ఉన్న ప్రభుత్వాలను మార్చివేసి, సానుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు అమెరికా పదేపదే బలప్రయోగం, రహస్య చర్య, రాజకీయ కౌటిల్యానికి పాల్పడింది. 1947–89 సంవత్సరాల మధ్య వివిధ దేశాలలో ప్రభుత్వాల మార్పునకు అమెరికా 70 సార్లు ప్రయత్నించిందని రాజనీతిశాస్త్ర విదుషీమణి Lindsey O' Rourke 2018లో తన పరిశోధనగ్రంథం 'Covert Regime Change'లో విపులంగా వెల్లడించారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన అనంతరం కూడా ఈ అధర్మ కార్యకలాపాలను అమెరికా కొనసాగించింది. భద్రతా మండలి అనుమతి, ఆమోదం లేకుండానే అమెరికా 1989 నుంచి ఇరాక్ (2003), లిబియా (2011), సిరియా (2011) నుంచి, హోండురాస్ (2009), ఉక్రెయిన్ (2014), వెనెజువెలా (2002 నుంచి)తో సహా వివిధ దేశాలలో వ్యతిరేక ప్రభుత్వాలను కూల్చివేసి, అనుకూల పాలకులను అధికారానికి తీసుకువచ్చేందుకు పూనుకుని చాలా వరకు సఫలమయింది. ఇందుకు అమెరికా సువ్యవస్థిత పద్ధతులను అనుసరించింది. బాహాట యుద్ధం, రహస్య గూఢచార కార్యకలాపాలు, అశాంతిని రగుల్కొల్పడం, సాయుధ బృందాలకు మద్దతు ఇవ్వడం, మాధ్యమాలను ఉపయోగించుకోవడం, సైనిక, పౌర అధికారులకు లంచాలు ఇవ్వడం, ప్రతికూల నేతలను హతమార్చడం, ఫాల్స్‌ఫ్లాగ్ కార్యకలాపాలు (యుద్ధానికి సాకులు సృష్టించడం, ప్రత్యర్థి నేతలను అప్రతిష్ఠ పాలుచేయడం, ప్రజాభిప్రాయాన్ని సానుకూలంగా రూపొందించడం మొదలైనవి), ఆర్థికవ్యవస్థను కుదేలుపరచడం మొదలైనవి ఆ పద్ధతులలో కొన్ని. ఈ అధర్మ చరిత్ర అంతా సవివరంగా లిఖితమై ఉంది.

> పలుదేశాలలో తమకు ప్రతికూలంగా ఉన్న ప్రభుత్వాలను మార్చివేసి, సానుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు అమెరికా పదేపదే బలప్రయోగం, రహస్యచర్య, రాజకీయ కుట్రలకు పాల్పడింది. ఇలా వివిధ దేశాలలో ప్రభుత్వాల మార్పునకు కేవలం నలభైయేళ్ళలో అమెరికా 70 సార్లు ప్రయత్నించింది. గత ఏడాది ఏడు దేశాలపై బాంబు దాడులు నిర్వహించింది. వీటిలో ఏ ఒక్కదానికీ భద్రతామండలి అనుమతి లేదు.

ఐక్యరాజ్యసమితి అధికార పత్రం నిర్దేశాలకు ఇవన్నీ పూర్తిగా విరుద్ధమైనవి. ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలలో కొనసాగుతున్న హింసాకాండలు, సంఘర్షణలు, రాజకీయ అస్థిరత, ప్రజల బతుకులు బుగ్గిపాలు కావడం మొదలైన బాధాకర పరిణామాలన్నీ అమెరికా పాల్పడిన, పాల్పడుతోన్న ఆ అధర్మ చర్యల ఫలితాలే.

వెనెజువెలా విషయంలో ఇటీవల అమెరికా వ్యవహరించిన తీరుతెన్నుల చరిత్ర అందరికీ తెలిసిందే. ఏప్రిల్ 2002లో వెనెజువెలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు గురించి అమెరికాకు ముందుస్తుగా తెలుసు. ఆ చర్యను పూర్తిగా ఆమోదించింది కూడా. 2010 దశకంలో, ముఖ్యంగా 2014లో ప్రభుత్వ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు నిర్వహించిన పౌర సమాజ బృందాలకు ఆర్థిక అండదండలు పుష్కలంగా అందించింది. ఆ నిరసనకారులపై వెనెజువెలా ప్రభుత్వం తీవ్రచర్యలు తీసుకున్నప్పుడు అమెరికా దానిపై అనేక ఆంక్షలు విధించింది.

2017లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశాల సందర్భంగా లాటిన్ అమెరికా నాయకులకు ఇచ్చిన ఒక విందు సందర్భంగా– వెనెజువెలాలో ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకై ఆ దేశాన్ని దురాక్రమించే ప్రతిపాదన గురించి నాటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా చర్చించారు. 2017 నుంచి 2020 వరకు వెనెజువెలా ప్రభుత్వరంగ చమురు సంస్థపై అమెరికా విస్తృత ఆంక్షలు విధించింది. 2016–20 సంవత్సరాల మధ్య వెనెజువెలాలో చమురు ఉత్పత్తి 75 శాతం మేరకు పడిపోయింది. నిజమైన తలసరి జీడీపీ 62 శాతం మేరకు తగ్గిపోయింది. అమెరికా ఏకపక్షంగా వెనెజువెలాకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ చర్యలను ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ పలుమార్లు ఖండించింది. 2019 జనవరి 23న వెనెజువెలా 'తాత్కాలిక అధ్యక్షుడు'గా జువాన్ గువాయిడోను అమెరికా ఏకపక్షంగా గుర్తించింది. ఆ తరువాత అయిదురోజులకు ఆ దేశంలో 700 కోట్ల డాలర్ల సార్వభౌమిక ఆస్తులను అమెరికా స్తంభింప చేసి, తాను గుర్తించిన తాత్కాలిక అధ్యక్షుడికి నిర్దిష్ట ఆస్తులపై అధికారాలు కల్పించింది. వెనెజువెలాకు వ్యతిరేకంగా అమెరికా అటువంటి కార్యకలాపాలకు రెండుదశాబ్దాలకు పైగా నిర్విరామంగా పాల్పడింది.

అమెరికా ప్రపంచవ్యాప్తంగా దుందుడుకు విధానాలనే అనుసరిస్తోంది. గత ఏడాది ఏడు దేశాలపై బాంబు దాడులు నిర్వహించింది. వాటిలో ఏ ఒక్కదానికీ భద్రతా మండలి అనుమతి లేదు. ఐక్యరాజ్యసమితి నియమ





నిబంధనల ప్రకారం అవేవీ ఆత్మరక్షణకు నిర్వహించిన దాడులు కావు. గత నెలలో అధ్యక్షుడు ట్రంప్ ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు అయిన కొలంబియా, డెన్మార్క్, ఇరాన్, మెక్సికో, నైజీరియా మొదలైన దేశాలపై యుద్ధ చర్యలకు పూనుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వెనెజువెలా కూడా ఆ హెచ్చరికల లక్ష్యంగా ఉంది.

వెనెజువెలాపై అమెరికా జరిపిన దాడి, కొనసాగుతున్న నావికా దిగ్బంధనం స్వేచ్ఛకు దోహదం చేస్తుందా లేదా అణచివేతకు దారితీస్తుందా అనే విషయాన్ని మదింపు చేయాలని భద్రతా మండలి సభ్యదేశాలకు విజ్ఞప్తి చేస్తున్నాం. అంతర్జాతీయ చట్టాన్ని కాపాడేందుకు, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సంరక్షించేందుకు పూనుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత అంతర్జాతీయ చట్టం (సార్వభౌమ రాజ్యాలు, అంతర్జాతీయ సంస్థలు, వ్యక్తుల మధ్య సంబంధాలను నియంత్రించే నియమ నిబంధనల, ప్రమాణాల వ్యవస్థ)ను అనువర్తింపచేయడం ద్వారా రాజ్యాల మధ్య ఘర్షణల నివారణకోసం నానాజాతి సమితిని ఏర్పాటు చేశారు. అయితే ఈ సంస్థ అంతర్జాతీయ చట్టాన్ని కాపాడడంలో విఫలమైన పర్యవసానమే ద్వితీయ ప్రపంచయుద్ధం. ఇది సృష్టించిన ఘోర విషాదాలకు శాశ్వత పరిష్కారంగా ఐక్యరాజ్యసమితి ప్రభవించింది. 'భావితరాలకు యుద్ధ విపత్తు అనేది వాటిల్లకుండా చూడడమే' ఈ అంతర్జాతీయ సంస్థ మహోదాత్త లక్ష్యం. ఇప్పుడు మనం అణుయుగంలో ఉన్నామన్న వాస్తవాన్ని గుర్తుపెట్టుకుని ఇరవయో శతాబ్ది వైఫల్యాలు మరోసారి పునరావృతమవకుండా జాగ్రత్త వహించాలి. ఈ విషయంలో ఏ మాత్రం విఫలమైనా మానవాళి మనుగడ సమసిపోతుంది. మరో ప్రత్యామ్నాయ పరిస్థితి ఉండదు, ఉండబోదు.

ఐక్యరాజ్యసమితి చార్టర్ నిర్దేశించిన ఈ బాధ్యతలను నిర్వర్తించేందుకు తక్షణమే భద్రతా మండలి పూచీ వహించాలి. తక్షణ కర్తవ్యాలను పాటించేలా సంబంధిత దేశాలపై ఒత్తిడి చేయాలి; వెనెజువెలాకు వ్యతిరేకంగా ఎలాంటి బెదిరింపులు, దాడులకు పాల్పడకుండా అమెరికాను తక్షణమే నిలువరించాలి; భద్రతా మండలి అనుమతి లేకుండా వెనెజువెలాకు వ్యతిరేకంగా ప్రారంభించిన నావికా దిగ్బంధానికి అమెరికా తక్షణమే ముగింపు చెప్పాలి. ఇతర సైనిక చర్యలను కూడా నిలిపివేయాలి. వెనెజువెలా, దాని పరిసర ప్రాంతాల నుంచి తన సమస్త సైనిక దళాలను అమెరికా తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఉద్రిక్త పరిస్థితుల ఉపశమన బాధ్యత వెనెజువెలాపై కూడా ఉన్నది. ఐక్యరాజ్యసమితి నియమ నిబంధనలకు సంపూర్ణంగా నిబద్ధమవడంతో పాటు విశ్వమానవ హక్కుల ప్రకటన హామీ పడిన హక్కులు అన్నిటినీ కాపాడాలి; వెనెజువెలా ప్రభుత్వంతోను, సంక్షోభంతో ప్రమేయమున్న సమస్త దేశాల ప్రతినిధులతోను చర్చలు, సమాలోచనలు జరిపి ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు అనుగుణమైన సిఫారసులను 14 రోజులలో నివేదించేందుకు ఒక ప్రత్యేక ప్రతినిధిని నియమించాలి. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలన్నీ భద్రతామండలి ఆమోదం లేకుండా ఏకపక్షంగా హెచ్చరికలు జారీ చేయడం, సాయుధ చర్యలకు పూనుకోవడం మొదలైన వాటికి స్వస్తి చెప్పి తీరాలి.

అంతర్జాతీయ చట్టం సువ్యవస్థితంగా అమలయ్యేందుకు ఒక స్ఫూర్తిదాయక సాధనంగా ఐక్యరాజ్యసమితి చార్టర్ ఉంటుందా? అన్న దానిపైనే శాంతిసాధన, మానవాళి మనుగడ ఆధారపడి ఉన్నవి. ధన్యవాదాలు.

> ఇప్పుడు మనం అణుయుగంలో ఉన్నామన్న వాస్తవాన్ని గుర్తుపెట్టుకుని ఇరవయో శతాబ్ది వైఫల్యాలు పునరావృతమవకుండా జాగ్రత్త వహించాలి. ఈ విషయంలో ఏ మాత్రం విఫలమైనా మానవాళి మనుగడ సమసిపోతుంది.

◆ జెఫ్రీ డి సాచ్స్

(వెనెజువెలాకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన చర్యను నిరసిస్తూ జనవరి 5న భద్రతామండలి అత్యవసర సమావేశంలో ప్రముఖ ఆర్థికవేత్త, యుఎన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ జెఫ్రీ డి సాచ్స్ వెలువరించిన ప్రసంగ పాఠం సంక్షిప్తరూపం.)

కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్దశ

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు, గ్రామ స్వరాజ్యమే దేశ ప్రగతికి మార్గం అన్న మహాత్ముడి మాటలను స్ఫూర్తిగా తీసుకుని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పంచాయతీలను బలోపేతం చేస్తోంది. గ్రామాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించడం, గ్రామీణుల అవసరాలూ వారి సమస్యలను గుర్తించడం, వాటిని సహేతుకంగా పరిష్కరించడం అనే పంచాయతీ పాలన ప్రాథమిక లక్ష్యాలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోంది. ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను సర్పంచులకు కూడా తెలియకుండా దారి మళ్లించే నయవంచక పోకడలు గత ప్రభుత్వంలో జరిగాయి. స్థానిక ప్రభుత్వాల పీక నులిమే ఇటువంటి పెడ పోకడలకు స్వస్తి పలుకుతూ రాజ్యాంగబద్ధమైన విధులు, అధికారాలతో పంచాయతీలను పరిపుష్టం చేసే మౌలిక సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 35 సంవత్సరాల క్రితం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిపేందుకు ఇచ్చిన జీవోను మార్చేసి, నిధులు భారీగా పెంచుతూ కొత్తగా జీవో విడుదల చేసింది. 5 వేల జనాభా కంటే తక్కువగా ఉన్న పంచాయతీలకు రూ.100 నుంచి రూ.10వేలకు, 5 వేల జనాభా దాటిన పంచాయతీలకు రూ.250 నుంచి రూ.25 వేలకు నిధులు పెంచింది.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఒకేరోజు 13,326 పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రపంచ రికార్డ్స్ యూనియన్ తన రికార్డ్స్‌లో నమోదు చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గత ఏడాది చేపట్టిన పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో 4 వేల కిలో మీటర్ల మేర సిమెంటు రోడ్లు నిర్ణీత సమయానికి పూర్తిచేశారు. రైతులకు అండగా 22,500 మినీ గోకులాలు, 15 వేల నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్ నిర్మించారు. 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు చేయూతనిచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఈ ఏడాది చేపట్టిన 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో రూ.6,500 కోట్లతో వివిధ పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 1,107 పంచాయతీల్లో 55 కి.మీ మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. కొన్ని పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన డ్రెయిన్లు మిగతా పంచాయతీలకూ విస్తరిస్తున్నారు. పీఎం జన్మన్ పథకం, నరేగా నిధుల సాయంతో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించే కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ పథకం సాస్కీ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 12,999 రోడ్లను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. రూ.2,123 కోట్లతో 4,007 కి.మీ మేర పల్లె రోడ్లను నిర్మించనున్నారు. 157 నియోజకవర్గాల్లోని 484 మండలాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను తీర్చేందుకు రూ.1,000 కోట్లతో 'అడవి తల్లి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డోలీమోతల రహిత మన్యం ప్రాంతాన్ని లక్ష్యంగా పెట్టుకొని సుదూర గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి గ్రామానికీ రక్షిత నీరు లక్ష్యంగా జలజీవన్ మిషన్ పనులు రాష్ట్రంలో ఊపందుకునేలా కార్యక్రమాలు చేపట్టారు. గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించి జలజీవన్ లక్ష్యాలను దెబ్బతీసి, నిధులు మురిగిపోయే పరిస్థితి తలెత్తితే... కూటమి ప్రభుత్వ అభ్యర్థనతో జలజీవన్ మిషన్ నిర్దేశిత గడువును కేంద్రం నాలుగేళ్లు పొడిగించింది. పథకం విస్తరణలో భాగంగా ఏడాదిలో ఐదు జిల్లాలలో రూ.7,910 కోట్ల విలువైన పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇవి పూర్తయితే కోటి మందికి దాహార్తి తీరుతుంది. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం అమరుడైన పొట్టి శ్రీరాములును సదా స్మరించుకోవాలనే ఉద్దేశంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు 'అమరజీవి జలధార'గా నామకరణం చేశారు. రూ.3,050 కోట్లతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సురక్షిత తాగు నీరందించే అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ పనులకు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలిలో శంకుస్థాపన చేశారు.

గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు వేగవంతం చేయడంతో పాటు, ప్రజలలో సంతృప్తస్థాయి పెంచే విధంగా మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేయడం ఆహ్వానించదగ్గది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఆయన చేస్తున్న కృషి ఫలితమే. ఉద్యోగుల శిక్షణకు సంబంధించి అత్యధిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో శక్తి, సామర్థ్యాలు పెంచడంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. గతంలో ఈ శాఖల విషయంలో 24వ స్థానంలో ఉన్న ఏపీ... డిప్యూటీ సీఎం చొరవతో అగ్రస్థానానికి ఎదిగింది. స్వాతంత్ర్యానంతరం ఎప్పుడూ చేపట్టని సంస్కరణలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ శాఖలో డీపీవో, జడ్పీ, గ్రామ పంచాయతీలు... ఇలా మూడు రకాలుగా ఉన్న వ్యవస్థలను ఏకం చేయడం ద్వారా పాలనను సులువు చేశారు. దీంతో పాటు గ్రామ సచివాలయాల్లో పంచాయతీరాజ్ సిబ్బంది కీలకం కావడంతో మరిన్ని అవకాశాలు ఈ శాఖ ఉద్యోగులకు దక్కాయి. గత ప్రభుత్వం వారి సేవలను వినియోగించుకోవడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం వారి సేవలను విస్తృతంగా ఉపయోగించుకునేందుకు చర్యలు తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియారిటీకి, సిన్సియారిటీకి ప్రాధాన్యమిస్తూ ఈ శాఖలో 10వేల మందికి పైగా పదోన్నతులు లభించాయి. గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ, గ్రామ సచివాలయాల్లో భారీ సంఖ్యలో సిబ్బందిని నియమించడంతో పదోన్నతులకు అవకాశం ఏర్పడింది. తొలిసారిగా ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించడంతో పాటు 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించారు. పంచాయతీల్లో క్లస్టర్ విధానాలను రద్దు చేసి, గ్రేడ్లుగా విభజించి ప్రతీ పంచాయతీల్లోనూ కార్యదర్శులను నియమించారు. జడ్పీ సీఈవోలకు తొలిసారి పదోన్నతులు కల్పించారు.


> స్వాతంత్ర్యానంతరం ఎప్పుడూ చేపట్టని సంస్కరణలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. స్థానిక ప్రభుత్వాల్లో గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తోంది. పుష్కలంగా ఉన్న ఈ వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే ఎటువంటి సత్ఫలితాలు సాధించవచ్చో కూటమి ప్రభుత్వం నిరూపిస్తోంది.



వీధి దీపాలు, పారిశుధ్యం, రక్షిత మంచినీరు, విద్య, ఆరోగ్యం, స్థానిక వనరుల నిర్వహణ వంటి పనులన్నీ స్థానికంగా సంస్థలే నిర్వహించుకుంటే, రాష్ట్ర ప్రభుత్వాలు పైస్థాయిలో చేయాల్సిన పెద్ద పనుల మీద దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించి స్థానిక ప్రభుత్వాల్లో గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తోంది. ప్రతీ సమస్యకు సులభ పరిష్కారాలు ఉంటాయి. ఆ పరిష్కారాలకు కావలసిన వనరులు, శక్తి సామర్థ్యాలు మనకున్నాయి. కావలసిందల్లా చిత్తశుద్ధి, సంకల్పబలం, మంచిపాలన, నిజాయితీతో కూడిన రాజకీయం, సేవ చేసే యంత్రాంగం. రాష్ట్రంలో పుష్కలంగా ఉన్న ఈ వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే ఎటువంటి సత్ఫలితాలు సాధించవచ్చో కూటమి ప్రభుత్వం నిరూపిస్తోంది.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా | ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





వడ్డమానులో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్

రెండో విడత సమీకరణ ప్రారంభం

- వడ్డమానులో సీఆర్డీఏ కార్యాలయం ప్రారంభించిన మంత్రి
- కౌలు పెంపు, రైతులకు రుణమాఫీపై సీఎం చంద్రబాబు సానుకూలం

తుళ్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి రెండో దశలో చేపట్టిన భూసమీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా వడ్డమానులో సీఆర్డీఏ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. కౌలు పెంపు, రుణ మాఫీ అంశాల్ని ఆలోచించాలని ఎమ్మెల్యే సమావేశంలో మంత్రికి సూచన చేశారు. అప్పుడే సీఎం చంద్రబాబు నుంచి మంత్రి నారాయణకు ఫోన్ రావడంతో వాటిపై చర్చించారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించి రెండు అంశాలను ఒప్పుకున్నారని సభలోనే మంత్రి రైతులకు వివరించారు. భూములిచ్చే రైతులకు లక్షన్నర రుణ మాఫీ చేస్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు రైల్వేట్రాక్ కోసం అమరావతి, తుళ్లూరు మండలాల్లోని ఏడు గ్రామాల్లో 16,666 ఎకరాలను సమీకరణ ద్వారా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం అమరావతిలో రూ.55 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. మూడేళ్లలోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఒక వేళ అలా జరగకపోతే ఏడాదికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని అలాగైతేనే భూములు తీసుకోవాలని రైతులు తెలిపారు. కాగా సత్యనారాయణ, సాయితరుణ్, శ్రీలక్ష్మి తదితరులు తమ భూములు రాజధానికి ఇచ్చేందుకు సిద్ధమని సభలో మంత్రికి అంగీకార పత్రాలు అందజేశారు. కార్యక్రమలో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవతేజ, డీసీ శేషురెడ్డి పాల్గొన్నారు. పెదపరిమిలో రెండు కార్యాలయాలను అధికార పార్టీ నాయకులు ప్రారంభించారు.

సంక్రాంతికి.. సై



చెరుకుపల్లి మండల పరిధిలో భారీ ఏర్పాట్లతో సిద్ధమవుతున్న బరులు

సంక్రాంతి సరదా.. సంతోషాల పండుగ. పల్లె పండుగ. కానీ సంక్రాంతి సంప్రదాయం ముసుగులో దోపిడీకి తెరలేపారు. ఒకప్పుడు తమాషాగా.. సరదాగా జరిగే కోడి పందేలను రూ.కోట్లాటగా మార్చేశారు. గతంలో రహస్యంగా, పోలీసులకు చిక్కకుండా జరిగే ఆ కోడి పందేలు ప్రస్తుతం బహిరంగమయ్యాయి. క్రికెట్ లాంటి పోటీలకు జరిగే ఏర్పాట్ల తరహాలో ప్రచారాలతో హోరెత్తిస్తూ బరితెగిస్తున్నారు. పదుల ఎకరాల్లో బరులు ఏర్పాట్లు చేసి మందు సహా కావాల్సినవి అన్నీ ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు.

- సంప్రదాయం మాటున కోఢీ
- పందేల నిర్వహణకు బరులు సిద్ధం
- మినీ క్యాసినోలను మరిపించేలా ఏర్పాట్లు
- కీలక నేతల అండ.. ఆ వైపు చూడని పోలీసులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదుల సంఖ్యలో బరులు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఐపీఎల్ తరహాలో హంగూ ఆర్భాటం ఇప్పుడు కోడి పందాలకు విస్తరించింది. చారిత్రక నేపథ్యం ఉన్న సంప్రదాయ పందాలు ఇప్పుడు కమర్షియల్ హంగులు అద్దుకుంటున్నాయి. చిన్నచిన్న బరులతో కొద్ది మంది జూదరులకు మాత్రమే పరిమితమయ్యే కోడి పందాలు.. ఇప్పుడు భారీగా నిర్వహిస్తున్నారు. కోడి పందాలు కొందరికి (మిగతా 8వ పేజీలో)

అమృత్ 2.0 టెండర్ ఖరారు



- అమృత్ పథకంలో ప్రతిపాదించిన నరసరావుపేట లోని కత్తవ చెరువు

రూ.975.56 కోట్లతో నీటి పథకాల విస్తరణ

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పురాల్లో అమృత్ 2.0 పథకం పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి. తాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. నీటి పథకాల విస్తరణ, భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెరువులను అభివృద్ధికి రూ.975.56 కోట్ల టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మెగా ఇంజనీరింగ్ సంస్థ పనులు దక్కించుకుంది. అంచనా వ్యయం కన్నా 3.8 శాతానికి అధికంగా దాఖలైన టెండరును పబ్లిక్ హెల్త్ శాఖ ఆమోదించింది. గుంటూరు కార్పొరేషన్‌తో పాటు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో అమృత్ 2.0 పథకం కింద 54 పనులకు ఒకే ప్యాకేజీ కింద టెండరు నిర్వహించారు.

పురపాలక సంఘాలు.. గుంటూరు కార్పొరేషన్‌లో నీటి పథకాల విస్తరణ, చెరువుల ఆధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు అమృత్ పథకంలో చేపడతారు. పురపాలక సంఘాల్లో తాగునీటి పథకాలను రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా విస్తరిస్తారు. పైపులైన్లు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి.. 24/7 నీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాలను అభివృద్ధి చేస్తారు. చెరువుల్లో పూడిక తీత, కట్టలు పటిష్టం, వీటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మిస్తారు. పట్టణాల్లో ఎన్‌టీఆర్ హౌసింగ్ కాలనీలకు తాగు నీటి సరఫరా. ఆయా కాలనీలకు పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, గృహాలకు కొళాయి కనెక్షన్‌లు ఇస్తారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. 15, 16 ఆర్థిక సంఘం నిధులు కూడా అమృత్ పనులకు ఖర్చు చేస్తారు. మునిసిపాల్టీలు కూడా నిర్ణయించిన నిధులను వినియోగించాల్సి ఉంది.

మునిసిపాల్టీల వారీగా అమృత్ 2.0 నిధులు (రూ.కోట్లలో)

మునిసిపాల్టీ	నిధులు
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	161.30
దాచేపల్లి	49.62
పిడుగురాళ్ల	36.26
గురజాల	18.62
సత్తెనపల్లి	0.72
మాచర్ల	37.53
గుంటూరు	381.03
మంగళగిరి..తాడేపల్లి	68.21
తెనాలి	61.61
పొన్నూరు	22.10
చీరాల	32.98
బాపట్ల	25.32
రేపల్లె	45.74
అద్దంకి	5.10

క్వింటాల్‌కు రూ.500 కోత

- అదనంగా కోల్డ్‌స్టోరేజ్‌లు చార్జీల వసూళ్లు
- మంత్రి అచ్చెన్నాయుడికి మిర్చి రైతుల నివేదన

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చి విక్రయం జరిగాక కమీషన్ వ్యాపారులు ధరలో కోత పెడుతున్నారు.. క్వింటాల్ రూ.16,500 బేరం జరిగితే తీరా నగదు చెల్లింపు సమయంలో రూ.500 తగ్గించి ఇస్తున్నారు.. అని పలువురు రైతులు మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేశారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)లో సీజన్ ప్రారంభమైన దృష్ట్యా బుధవారం మంత్రి అచ్చెన్నాయుడు చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో రైతులు, ట్రేడర్లు, కమీషన్ వ్యాపారులు, రవాణా ఆపరేటర్లు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు, పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి నివేదించారు. కమీషన్ వ్యాపారులు ధర కోత పెట్టకుండా చూడాలన్నారు. మిర్చి గోనెసంచికి రూ.20 మాత్రమే చెల్లిస్తోన్నారని, తాము దానిని రూ.80 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తున్నదన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు అయితే మిర్చి బస్తాలు నిల్వ చేసే సమయంలో ఒక చార్జీ చెప్పి బయటకు తీసేటప్పుడు ఒక్కో టిక్కీపై అదనంగా రూ.50కి పైగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. యార్డులో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. రైతు విశ్రాంతి భవనంలో సౌకర్యాలు లేవని, అపరి శుభ్రత తాండవిస్తోన్నదని చెప్పారు. తాగునీటి సదుపాయాన్ని మెరుగుపరచాలని కోరారు. కిరాయి విషయంపై మిర్చి ఎక్స్‌పోర్టర్లు, లారీ యూనియన్ నాయకులు మంత్రి ఎదుటే వాదులాడుకున్నారు.

మిర్చికి ఈ ఏడాది పండగే

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మిర్చికి ఈ ఏడాది పండగేనన్నారు. ధరలు గణనీయంగా పెరిగి రైతుకు గిట్టుబాటు ధర లభిస్తోన్నదన్నారు. గత ఏడాది 1.96 లక్షల హెక్టార్లలో మిర్చి సాగు అయితే ఈ సంవత్సరం 1.06 లక్షల హెక్టార్లకు తగ్గిందన్నారు. ప్రస్తుతం దేశవాళీ రకాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. తేజ, ఆర్మూరు ఎక్స్‌పోర్టు వెరైటీ మిర్చి రకాల ధర తక్కువగా ఉందని, అయితే వాటిని పండించిన రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రవాణాలో సిండికేట్ లేకుండా చూస్తామని, దీనిపై ఎమ్మెల్యే మాధవి ఇరు వర్గాలతో చర్చలు జరుపుతారన్నారు. సమావేశంలో మార్కెటింగ్ కమిషనర్ ఎం విజయసునీత, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, ఉద్యానశాఖ అదనపు కమిషనర్ హరినాథ్‌రెడ్డి, మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ సత్యనారాయణ చౌదరి, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరి చంద్రిక, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు పాల్గొన్నారు.



కమిషనరేట్‌లో రైతులు, ట్రేడర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెలేలు మాధవి, నసీర్ తదితరులు

రేపటి నుంచి గుంటూరు కళాపరిషత్ నాటకోత్సవాలు

22 నుంచి విజ్ఞాన్‌లో స్పేస్ టెక్ సమ్మిట్

నాగార్జునుడి పరిశోధనలు మానవాళికి దోహదం

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కే మధుమూర్తి
- ఏఎన్‌యూలో రసాయన శాస్త్ర విభాగం జాతీయ సదస్సు

అరిసెల బెల్లం.. కేరాఫ్ శృంగారపురం



- చినఅనకాపల్లిగా పేరు..
- రంగుల్లేని, రసాయన రహిత బెల్లానికి ప్రసిద్ధి
- సంక్రాంతికి భారీగా డిమాండ్

8

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

6

సారస్.. సందడి

- ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభం
- వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డ్వాక్రా సంఘాలు
- నేటి సాయంత్రం సీఎం చంద్రబాబు రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డ్వాక్రా సంఘాలను సారస్ ఒక వేదిక పైకి తీసుకొచ్చింది. కశ్మీర్ మొదలు కన్యాకుమారి వరకు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలు, ముంబై నుంచి మిజోరం వరకు తూర్పు, పశ్చిమ రాష్ట్రాల స్వయం సహాయక బృందాలు తమ ఉత్పత్తులతో తరలివచ్చాయి. వారు స్టాల్స్‌లో ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించారు. స్థానిక నల్లపాడు రోడ్డులోని మిర్చియార్డు సమీపంలో 12 ఎకరాల్లో 300 స్టాల్స్‌తో సారస్ మేళా ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చెక్క, బ్రాస్, మెటల్, పేపర్, మట్టితో చేసిన హ్యాండీక్రాఫ్ట్స్ అలంకరణ, ఉత్పత్తులు, చేనేత, ప్రింటెడ్ చీరలు, ఇతర వస్త్రాలు, నేచురల్ ఫుడ్స్, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన ఉత్పత్తుల స్టాల్స్ ఉన్నాయి. బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సాయంత్రం సారస్ ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రదర్శనశాలలను పరిశీలించి వారితో మాట్లాడారు.

హెలిప్యాడ్ మార్పు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సాయంత్రం సారస్ - అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో తొలుత హెలిప్యాడ్‌కు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. అయితే అక్కడి నుంచి సారస్ ప్రాంగణానికి వచ్చే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని భావించిన అధికారులు యుద్ధప్రాతిపదికన నల్లపాడు రోడ్డులోని రెడ్డి కళాశాలలో హెలిప్యాడ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సీఎం ఎగ్జిబిషన్ ప్రాంగణానికి చేరుకుని స్టాల్స్‌ని సందర్శిస్తారు. వివిధ రాష్ట్రాల స్వయం సహాయక బృందాల మహిళలతో ముచ్చటిస్తారు. అనంతరం జరిగే సభలో ప్రసంగిస్తారు.

జీటీ రోడ్డుకు మహర్దశ

నరసరావుపేట రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదుట ప్రాంగణంలో జరుగుతున్న సారస్ మేళా కార్యక్రమానికి గురువారం సీఎం చంద్రబాబు హాజరవుతున్న నేపథ్యంలో జీటీ రోడ్డుకు మహర్దశ పట్టింది. మెడికల్ క్లబ్ సెంటర్ నుంచి సారస్ మేళా వేదిక వరకు రోడ్డులో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చకాచకా జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. రోడ్డును విస్తరించి చదును చేశారు. పచ్చ దనం పెంపొందించేలా మొక్కలు ఏర్పాటు చేశారు.

కార్డెన్ సెర్చ్‌తో.. ఉక్కుపాదం

- కాలనీలను జల్లెడ పడుతున్న పోలీసులు
- గంజాయి.. డ్రగ్స్ సహా, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ఆరా

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రౌడీషీటర్లు, నేరస్తులు, గంజాయి విక్రేతలు, స్మగ్లర్లే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి కాలనీలను చుట్టుముట్టి తనిఖీలు చేపడుతున్నారు. దొరికితేనే దొంగ కాదు... దొరకబుచ్చుకునే వాడే పోలీస్ అన్నట్లుగా పోలీస్ శాఖ జూలు విధులుస్తోంది. శాంతిభద్రతల (మిగతా 6వ పేజీలో)



ఐపీడీ కాలనీలో కార్డెన్ సెర్చ్‌లో డగ్స్, గంజాయిపై అవగాహన కలిపిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

తెల్లవారుజాము నుంచే..

జనం గాఢ నిద్ర నుంచి మేల్కొనక ముందే.. పోలీసులు కాలనీలను చుట్టుముడుతున్నారు. ప్రజలు నిద్రలేచేసరికి తనిఖీలతో జల్లెడ పడుతున్నారు. ఏమి జరుగుతుందో ప్రజలు తెలుసుకునే అవకాశం కూడా లేనివిధంగా అత్యంత పగడ్బందీగా తనిఖీలు చేపడుతున్నారు. గతంలో ఆరు నెలలకో... సంవత్సరానికి ఒకసారో... లేదంటే ఏదైనా ఘటన జరిగినప్పుడో చేపట్టే కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లను ఇప్పుడు నిత్యకృత్యం చేస్తున్నారు. రౌడీషీటర్లు, కేడి షీటర్లు, గంజాయి కేసు నిందితులు, పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అంతేగాక కాలనీలో ప్రతి వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 14 కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించి సరైన పత్రాలు లేని ఐదు వందల ద్విచక్ర వాహనాలు సహా 600 వాహనాలను సీజ్ చేశారు.

నడిపించి..సత్ప్రవర్తనతో మెలగాలని..

● రౌడీషీటర్, అతని అనుచరులకు పోలీసుల కౌన్సెలింగ్



నిందితులను కోర్టుకు తీసుకు వెళుతున్న పోలీసులు

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్, అతని అనుచరులకు లాలాపేట పోలీసులు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు దాడికి పాల్పడిన ప్రదేశంలో నడిరోడ్డుపై నడిపించి.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. కేసు వివరాలలోకి వెళితే.. రౌడీషీటర్ గణపతి రాజేష్, అతని అనుచరులు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సమయంలో బాధితుడు ఉమర్ బుడే సాహెబ్ బైక్ తగలడంతో ఇరువర్గాల మధ్య వాదన జరిగింది. ఈ విషయంపై కోపం పెంచుకున్న రౌడీషీటర్ గణపతి రాజేష్, అతని అనుచరులు గత నెల 21న సాయంత్రం కొబ్బరి కాయల సాంబయ్య కాలనీలో బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి.. అతన్ని చంపాలనే ఉద్దేశంతో ఇనుప రాడ్లు, కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఇందిరా కాలనీ 8వ లైనులో ఉంటున్న ఐపీడీ కాలనీ 11వ లైనుకు చెందిన రౌడీషీటర్ గణపతి రాజేష్, గణపతి ఆనంద్, ఎల్ఆర్ కాలనీ 8వ లైనుకు చెందిన బత్తుల హరీష్, సాయికృష్ణ నగర్ 2వ లైన్‌కు చెందిన మైనర్‌ను లాలాపేట పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. సీఐ శివప్రసాద్ తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇవ్వడమే గాక రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రజా స్వేచ్ఛకు, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందన

ఏఎన్‌యూ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 26 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసీఫ్ అహ్మద్ బుధవారం తెలిపారు. సివిల్ బ్రాంచ్ 16 మంది, మెకానికల్ బ్రాంచ్ 10 మంది విద్యార్థులు ఇందులో ఉన్నట్లు చెప్పారు. తన చాంబర్‌లో వీసీ గంగాధరరావు, రెక్టార్ రామినేని శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి. చంద్రమౌళి, మెకానికల్ విభాగం సమన్వయకర్త డాక్టర్ బోయపాటి పూర్ణచంద్రశేఖర్ పాల్గొన్నారు.

22, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22, 25 తేదీల్లో గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07140 చర్లపల్లి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 22న ఉదయం 9.30 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 12.20కి గుంటూరు చేరుకుంటుంది. 07141 తిరుపతి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 25న రాత్రి 11.30కి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. బయలుదేరిన స్టేషన్ నుంచి గమ్యస్థానానికి 29 గంటల సమయం పడుతుంది.

ఏపీ సెట్‌పై అవగాహన రేపు

ఏఎన్‌యూ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు స్థాపించిన ధర్మపీఠం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు శెట్టిపల్లి శశికిరణ్ బుధవారం తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టేట్ ఎలిజిబిలిటీ ప్రకటనను విడుదలలింది. ఈ నెల 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. మార్చి 28, 29తేదీల్లో పరీక్ష నిర్వహించే అవకాశం ఉంటుంది. అభ్యర్థులకు వెబ్ నార్ ద్వారా అవగాహన కార్యక్రమం జరుగుతుందని, ఆసక్తిగలవారు ధర్మపీఠం ప్రతినిధి ఫోన్ నంబరు నంబర్లు 94403 74778, 9493037766కు సంప్రదించాలని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షురాలు ప్రహర్షిత, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి అచ్చెన్నాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న యాజమానులు

గుంటూరు(తూర్పు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గుంటూరు డిస్ట్రిక్ట్ కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం గుంటూరు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడికి వినతిపత్రం సమర్పించారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు మాట్లాడుతూ కోట్లది రూపాయల బ్యాంకు రుణాలతో నిర్మించుకున్న కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యాలు పదేళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్డ్ స్టోరేజ్‌లను వ్యవసాయ పరిశ్రమగా గుర్తించగలిగితే కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. దీనిపై పాలకులు దృష్టి సారించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సురేంద్ర బాబు తెలిపారు. టీడీపీ నాయకుడు వేములపల్లి శ్రీరామ్ ప్రసాదు, అసోసియేషన్ కార్యదర్శి కేఎస్ రాఘవయ్య, కోశాధికారి ఆర్.రమణ, ఈసీ సభ్యుడు జుగ్రాజ్ బండారి పాల్గొన్నారు.

రాజధానిలో ఐఓబీ ప్రాంతీయ కార్యాలయం



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న హర్జిత్ సింగ్

తుళ్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐఓబీ) ప్రాంతీయ కార్యాలయం నిర్మించనుంది. ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి గ్రామాల పరిధిలో ఈ కార్యాలయం నిర్మించడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి రాయపూడి సీఆర్డీఏ ప్రధాని కార్యాలయంలో బుధవారం ఒప్పంద పత్రాలను ఏపీ సీఆర్డీఏ జాయింట్ డైరెక్టర్(ఎస్టేట్) వి.డేవిడ్‌రాజు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు విజయవాడ ప్రాంతీయ కార్యాలయ చీఫ్ రీజినల్ మేనేజర్ హర్జిత్ సింగ్‌కు అందజేశారు. అమరావతిలో రూ.10కోట్లతో కార్యాల యాన్ని నిర్మిస్తామని హర్జిత్‌సింగ్ తెలిపారు. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుతో 100 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

డ్రగ్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరయ్య చౌదరి

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్ విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పెదకూరపాడుకు చెందిన మహేష్, వెంకటేష్ నుంచి 3.3 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరయ్య చౌదరి నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. సీఐ కతనం మేరకు.. పెదకూరపాడుకు చెందిన మహేష్, వెంకటేష్ వివిధ శుభ కార్యాలకు ఫ్లవర్ డెకరేషన్ చేస్తుంటారు. అయితే అందులో నష్టాలు రావడంతో..పూడ్చుకునేందుకు డ్రగ్స్ విక్రయానికి దిగారు. డెకరేషన్ సందర్భంగా బెంగళూరు వెళ్ళినప్పుడు అక్కడ పరిచయం అయిన వారి సలహా మేరకు డ్రగ్స్ విక్రేతలను పరిచయం చేసుకున్నారు. ఈ విధంగా వారు బెంగళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకు వచ్చి గుంటూరులో విక్రయించేందుకు యత్నించారు. కొత్తపేట స్టేషన్ పరిధిలోని కుగ్లర్ ఆసుపత్రి కాంపౌండ్ వద్ద డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నా యనే సమాచారం మేరకు సీఐ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి మహేష్, వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

కార్డెన్ సెర్చ్‌తో.. ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

విషయంలో రాజకీయలకు అతీతంగా కఠినంగా వ్యవహరించాలంటూ ఇటీవల జరిగిన ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి కార్యాచరణ రూపొందించారు. అందుకనుగుణంగా ఎస్పీ వకుల్ జిందాల్ నడుం బిగించారు. ఫలితంగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. గంజాయి విక్రేతలు, అక్రమ రవాణాదారులతోపాటు సేవించే వారి పైనా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తోంది. గంజాయి కార్యకలాపాలకు హాట్‌స్పాట్‌గా గుర్తించిన కాలనీలు, మురికివాడలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అక్రమార్కుల భరతం పట్టేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా మారుమూల ప్రదేశాల్లో, శివారు ప్రాంతాల్లో, పొలాలు... గుట్టల్లో పేకాట, గంజాయి, బహిరంగ మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలను పసిగట్టి కట్టడి చేస్తోంది. క్రికెట్ బెట్టింగ్, రేషన్ మాఫియా, వ్యభిచారం, పేకాట, గంజాయి విక్రయం లాంటి కార్యకలాపాలను కట్టడికి మెరుపు దాడులు చేస్తూ అక్రమార్కులను హడలెత్తిస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల టాస్క్‌ఫోర్స్ బృందం చేసిన దాడుల్లో ముగ్గురు పోలీసులు కూడా పట్టుబడిన విషయం కలకలం సంగతి తెలిసిందే.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రౌడీషీటర్లకు ప్రతివారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇటీవల గుంటూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అందరికీ కలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. అంతేగాకుండా మార్చ్ ఫాస్ట్ తరహాలో రోడ్డుపై నడిపించి హెచ్చరికలు జారీ చేశారు. ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, దాడులు, దౌర్జన్యాలకు దిగినా వారికి పోలీస్ తరహా లాఠీ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇటీవల బాలికపై అత్యాచారం కేసులో నిందితులకు మంగళగిరి పోలీసులు ఇచ్చిన కౌన్సెలింగ్.. నడిరోడ్డుపై నడిపించిన తీరు...తాజాగా లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో స్వల్ప వివాదంలో హత్యాయత్నానికి పాల్పడిన రౌడీషీటర్లకు పోలీసులిచ్చిన ట్రీట్మెంట్‌తో నడిరోడ్డుపై నడవలేక వారు పడిన ఇబ్బందులు రౌడీషీటర్లకు పోలీస్ మార్కు హెచ్చరికలుగా చెప్పవచ్చు.

గంజాయి ఆనవాళ్లు లేకుండా..

జిల్లాలో ఎక్కడా గంజాయి పేరు వినపడటానికే వీల్లేదు అన్నట్లుగా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. గడిచిన మూడు నెలల్లో పోలీస్ శాఖ సాధించిన పురోగతే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. గడిచిన మూడు నెలల్లో 43 గంజాయి కేసులు నమోదు చేసి 70 కిలోలకు పైగా డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 0.190 లీటర్ల లిక్విడ్ గంజాయిని, 0.506 కిలోల హైడ్రో గంజాయిని, 12 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్ ను, 17 గ్రాముల ఎండిఎం డ్రగ్ సీజ్ చేశారు. గంజాయికి సంబంధించిన 41 కేసుల్లో 240 మంది నిందితులను గుర్తించి 188 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. మరోవైపు డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం పేరుతో విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఈగల్ ఐజీ రవికృష్ణ జేకేసీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఓ విద్యార్థిని తన సోదరుడు గంజాయికి బానిసైన విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేయడంతో అతడ్ని ఎన్నారై హాస్పిటల్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు జిల్లాలో గంజాయి ప్రధాన ఆదాయ వనరుగా స్మగ్లింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న ఏడుగురుపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. మరో 14 మందిపై కూడా పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. అంతేగాక గంజాయి కేసుల్లో వరుస నిందితులుగా ఉంటున్న వారిపై రౌడీషీట్‌లు కూడా తెరుస్తున్నారు.

నేరస్తులు, ఆకతాయిల ఆటకట్టు

రాత్రి 10.30 గంటల తర్వాత రోడ్లపై తిరిగే నేరస్తులు, ఆకతాయిల ఆటకట్టేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గతంలో నైట్‌బీట్‌లుగానీ, కనీసం రాత్రివేళ రోడ్లపై పోలీసులు గానీ కనిపించే వారు కాదు. రాత్రివేళ దొంగలు, మందుబాబులు, ఆకతాయిలను కట్టడి చేసేందుకు పోలీసులు తీసుకున్న చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 11 గంటల తరువాత రోడ్ల మీద తిరిగేవారిని పోలీసులు క్షుణ్ణంగా విచారిస్తున్నారు. సరైన కారణం లేకుండా రోడ్లపై తిరిగేవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో పోలీసులపై పడిన ముద్ర చెరిపేసుకుని ప్రజల కోసమే పోలీస్ అనేలా పనితీరు కనబరుస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	58,964
అమ్మకాలు	56,130
నిల్వ	14,737

రకం		
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	19000
నెంబరు. 5	13500	18000
273	---	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	13500	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11500	15000
షార్క్-1	-----	----
బ్యాడిగి	13000	18000
దేవనూరు డీలక్స్	13500	20500
ఆర్మూరు	11500	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	12000	18000
నెంబరు. 5	13000	17500
273	----	----
341	13000	18500
4884	-----	-----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	12000	17500
దేవనూరు డీలక్స్	-----	-----
తాలుకాయలు	5500	8700

జరీబు సమస్యలపై జేసీ విచారణ



విచారిస్తున్న జేసీ శ్రీవాస్తవ

తుళ్లూరు, జనవరి 7(ఆంధ్ర జ్యోతి): జరీబు, నాన్ జరీబుపై తుళ్లూరు తహసీల్దారు కార్యాలయంలో గుంటూరు జేసీ అసుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో ఆర్డీవో కె. శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారులు, హార్టికల్చర్ డీఈ, తహసీల్దారు బాబుతో కూడిన కమిటీ బుధవారం విచారణ చేపట్టింది. రైతులతో ముఖాముఖీ కమిటీ సభ్యులు మాట్లాడి.. జరీబు భూమి అర్హతపై ఉన్న ఆధారాలను స్వీకరించారు. సంవత్సరానికి మూడు పంటలు పండి, గ్రౌండ్ లెవెల్ వాటర్‌తో మోటార్ల ద్వారా వ్యవసాయం చేస్తున్న నదీ పరివాహక గ్రామాలలో భూములను జరీబులుగా పరిగణించి.. ఎకరాకు ప్యాకేజీ 1450 గజాలు సీఆర్డీఏ గత టీడీపీ ప్రభుత్వంలో కేటాయింపులు చేసింది. అయితే నాన్ జరీబును కూడా జరీబుగా చేసి అవినీతికి పాల్పడారని, జరీబుగా ఉన్న భూములను మెట్టగా పరిగణించి ప్యాకేజీ తగించారని పలువు రైతులు సీఎం చంద్రబాబు, సీఆర్డీఏ కమీషనర్లు, పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల సమస్యలపై ఇద్దరు మంత్రులు స్థానిక ఎమ్మెల్యేతో త్రిమెన్ కమిటీని సీఎం ఏర్పాటు చేసి రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశంతో ఈ విచారణ చేపట్టారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 558.70 అడుగులు

విజయపురిసౌత్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 558.70 అడుగులు ఉంది. ఇది 229.36 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 8541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,688, ఎస్ఎల్‌బిసి ద్వారా 2200, ఎల్ఎల్‌సి ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 51,229 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 51,229 క్యూసెక్కులు ఉంది.

18 నుంచి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

చిలకలూరిపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గోల్కొండ గార్డెన్స్‌లో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీల నిర్వహణ పనులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ప్రారంభించారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజు ఈ నెల 18 నుంచి మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు 23వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. సాంబశివరావు పర్యవేక్షణలో పాలపళ్ల సైజు నుంచి సీనియర్ విభాగం వరకు ఎడ్ల పోటీలు జరుగుతాయని చెప్పారు.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం.1) మెస్సర్స్ శ్రీ చక్ర చిల్లీస్ ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహించు దీని యజమానురాలు జి. రాజ్యలక్ష్మి, నివాసం డి. నం. 24-2-78/సి, 1వ అంతస్తు, శ్రీ రామచంద్ర భవన్, చేపలవారి వీధి, పట్నం బజార్, గుంటూరు-522002, నం.2) శ్రీమతి గొలమరి రాజ్యలక్ష్మి, భర్త గొలమరి వీరారెడ్డి, ఇంటి నం. 1-111/ఎ, కొత్తపల్లి గ్రామం, కొప్పునూరు, మాచర్ల, గుంటూరు-522426, నం.3) శ్రీ గొలమరి వీరారెడ్డి, తండ్రి గొలమరి మల్లారెడ్డి, ఇంటి నం. 1-111/ఎ, కొత్తపల్లి గ్రామం, కొప్పునూరు, మాచర్ల, గుంటూరు-522426, నం.4) శ్రీమతి జంగా వెంకట లక్ష్మి, భర్త జంగా నర్సిరెడ్డి, డి.నం. 19-15-317/29, 10వ లేన్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, సంగడి గుంట, గుంటూరు, నం.5) శ్రీ జంగా నర్సిరెడ్డి, డి.నం. 19-15-317/29, 10వ లేన్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, సంగడి గుంట, గుంటూరు, నం.6) శ్రీమతి గొలమరి కోటేశ్వరమ్మ, భర్త గొలమరి శ్రీనివాసరెడ్డి, ఫ్లాట్ నం. 404, ఎమ్.జి.ఎస్ కాలనీ, 2వ లేన్, గుంటూరు, నం.7) శ్రీ గొలమరి శ్రీనివాసరెడ్డి, తండ్రి గొలమరి మల్లారెడ్డి, ఫ్లాట్ నం. 404, ఎమ్.జి.ఎస్ కాలనీ, 2వ లేన్, గుంటూరు నుండి 04.01.2026 నాటికి రూ.35,70,339/- (రూపాయలు ముప్పై ఐదు లక్షల డెబ్బై వేల మూడు వందల ముప్పై తొమ్మిది మాత్రమే) మరియు 05.01.2026 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే టెండరు-సహిత- బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖాపెట్టిన స్థిరాస్తులు

షెడ్యూల్-సి: (శ్రీ జంగా నర్సి రెడ్డికి చెందిన ఆస్తి)

గుంటూరు జిల్లా, గుంటూరు ఉప-జిల్లా, గుంటూరు నగరం, గుంటూరు నగరపాలక సంస్థ కొత్త పరిధిలలో గల గుంటూరు గ్రామ, డి.నం.928/బి వద్ద భూమి మరియు ప్రస్తుతం ఉన్న భవనం మరియు భవిష్యత్తులో నిర్మించబోయే నిర్మాణం యావత్తు. **కొలతలు:** దక్షిణం వైపు 327.50 చ.గ.లు (655 చ.గ.లలో) విస్తీర్ణం. **సరిహద్దులు:** తూర్పు: 25 అ.ల వెడల్పు రోడ్- 55.1 1/4 అ.లు, దక్షిణం: ఆలపాటి వీరాంజనేయులు స్థలం- 53.6 అ.లు, పశ్చిమం: గుళ్ళపల్లి కొండయ్య ఇతరులకు అమ్మిన స్థలం- 55.1 1/4 అ.లు, ఉత్తరం: జంగా వెంకట లక్ష్మీ స్థలం- 53.6 అ.లు.

రిజర్వు ధర: రూ. 26,00,000/-
(రూపాయలు ఇరవై ఆరు లక్షలు మాత్రమే)

షెడ్యూల్-డి: (శ్రీమతి జంగా వెంకట లక్ష్మి, భర్త శ్రీ జంగా నర్సి రెడ్డికి చెందిన ఆస్తి)

గుంటూరు జిల్లా, గుంటూరు ఉప-జిల్లా, గుంటూరు నగరం, గుంటూరు నగరపాలక సంస్థ కొత్త పరిధిలలో గల గుంటూరు గ్రామ, డి.నం.928/బి వద్ద భూమి మరియు ప్రస్తుతం ఉన్న భవనం మరియు భవిష్యత్తులో నిర్మించబోయే నిర్మాణం యావత్తు. **కొలతలు:** ఉత్తరం వైపు 327.50 చ.గ.లు (655 చ.గ.లలో) విస్తీర్ణం. **సరిహద్దులు:** తూర్పు: 25 అ.ల వెడల్పు రోడ్- 55.1 1/4 అ.లు, దక్షిణం: జంగా నర్సి రెడ్డి గారి స్థలం- 53.6 అ.లు, పశ్చిమం: గుళ్ళపల్లి కొండయ్య ఇతరులకు అమ్మిన స్థలం- 55.1 1/4 అ.లు, ఉత్తరం: కొమ్మురి భాస్కర రావు స్థలం- 53.6 అ.లు.

రిజర్వు ధర: రూ. 26,00,000/-
(రూపాయలు ఇరవై ఆరు లక్షలు మాత్రమే)

వేలం వివరాలు

టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీ :	ప్రదేశం
13-02-2026	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - పట్నం బజార్ శాఖ, డి.నం.23-6-122, రామా ఎన్క్లేవ్, పట్నం బజార్, గుంటూరు-522003, టెలిఫోన్ నం. 08632-222005, సెల్ నం. 9390735612, 8925876329

టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :

1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - పట్నంబజార్ శాఖ, డి.నం.23-6-122, రామా ఎన్క్లేవ్, పట్నం బజార్, గుంటూరు-522003 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం. 08632-222005, సెల్ నం. 9390735612, 8925876329 లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 06.01.2026 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

1వ అంతస్తు, యూనిట్ నం.103, పి.పి.ట్రేడ్ సెంటర్, ప్లాట్ నం.1, నేతాజీ సుభాష్ ప్లేస్, పితంపుర, న్యూఢిల్లీ - 110034

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("SARFESI ACT") క్రింద స్థిరాస్తి అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

మెసర్స్ శ్రీ లక్ష్మీ నరసింహా స్పిన్నింగ్ మిల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ & ఇతరులు మరియు దాని హామీదారుల నుండి KMBL కు రావాల్సిన బకాయి 27.09.2024 నాటికి మొత్తం రూ.4,19,31,435.64/- (నాలుగు కోట్ల పందొమ్మిది లక్షల ముప్పైఒక్క వేల నాలుగు వందల ముప్పైఐదు రూపాయల అరవైనాలుగు పైసలు మాత్రమే)తో పాటు 28.09.2024 నుండి రాబట్టుకునే తేదీ వరకు కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీతో పాటు అన్ని అనుషంగిక వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులను రికవరీ చేయడానికి కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్/KMBL)కు తనఖాపెట్టబడినట్టి/ చార్జ్‌చేయబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తి KMBL అధీకృత అధికారిచే 04.04.2025న వాస్తవిక స్వాధీనం చేసుకోబడినది మరియు సదరు ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అదే" మరియు "ఏది అక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన 17.02.2026న నిర్వహించబడే ఇ-వేలం ద్వారా విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతకు, హామీదారు(ల)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. రిజర్వు ధర, బయానా వివరాలు, ఆస్తి వివరాలు మరియు వేలం తేది దిగువ తెలియజేయబడినవి.

క్ర.సం.	ఆస్తి వివరాలు	రిజర్వు ధర	బయానా	తాకట్టు రుణభారాలు
1	గుంటూరు జిల్లా, గుంటూరు ఉప జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు పట్టణం, ఏరియా ఆర్.అగ్రహారంలోని ప్రస్తుతం మహాలక్ష్మీపురం వద్దగల ఏటుకూరి రోడ్, సర్వే నం.62/1 మరియు 62/6, మునిసిపల్ డోర్ నం.25-18-91, బ్లాక్ నం. 9, అసెస్‌మెంట్ నం.1021105820, H.S.C.No.11131001042914 కలిగిన ACC రేకుల ఇల్లు కలిగిన ఆస్తి యావత్తు. దీని సరిహద్దులలో 2023 చ.గజాల విస్తీర్ణ సైట్‌తో పాటు ACC రేకుల ఇల్లుతో పాటు 9900 చ.అడుగుల ప్లింత్ ఏరియాతో పాటు అందులోని ప్రస్తుత భవనాలు మరియు కట్టడాలతో పాటు సంబంధిత తనఖాల తేదీ నుండి/ తరువాత ఏ సమయంలోనైనా నిర్మించబడిన/ నిర్మించబోయే భవనాలు మరియు కట్టడాలు. **సరిహద్దులు:** తూర్పు: 30 అ. వెడల్పు అంతర్గత రోడ్డు మరియు కొత్తూరు రాజశేఖర రెడ్డి జిన్నింగ్ మిల్‌కు చెందిన సైట్, పశ్చిమం: పూనూరు నాగిరెడ్డికి చెందిన సైట్, ఉత్తరం: 30 అ. వెడల్పు అంతర్గత రోడ్డు, దక్షిణం: చొప్పర్ల సాంబశివరావుచే విక్రయించబడిన సైట్. తనఖాదారు పేరు: శ్రీ రాజశేఖర రెడ్డి కొత్తూరు	రూ.5,98,00,000/-	రూ.59,80,000/-	తెలియదు

బయానా డిపాజిట్ మరియు బిడ్ డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ కొరకు చివరి తేది: 16.02.2026 సా.4 గం. వరకు https://kotakbnak.auctiontiger.net లో
ఇ-వేలం తేది మరియు సమయం: 17.02.2026 ఉ.11 గం. నుండి మ.12:00 గం. మధ్య ఇ-వేలంలో చివరి 5 నిమిషాలలో బిడ్ వేస్తే, వేలం ముగింపు సమయం ప్రతీసారి 5 నిమిషాలు పొడిగించబడుతుంది.
బిడ్ పెరుగుదల మొత్తం: రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు మాత్రమే) లేదా దాని గుణాంకాలలో
సైట్ తనిఖీ తేది: సోమవారం నుండి శుక్రవారం ఏదైనా పనిరోజున ఉ.11 గం. నుండి సా.04:00 గం. మధ్య

ఉత్తమ పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు వేలముకు ఉంచబడిన ఆస్తికి సంబంధించి ఏవేని ఇతర తాకట్టు రుణభారాలు లేదా చట్టబద్ధమైన బకాయిలు, ఆస్తి బకాయిలు, భూమి రెవెన్యూ నిమిత్తం చెల్లించవలసిన బకాయిలు లేదా ఏవైనా ఇతర బకాయిల గురించి బ్యాంక్‌కు తెలియదు. అన్ని చట్టబద్ధమైన బకాయిలు అనగా ఆస్తి పన్నులు, భూమి రెవెన్యూ బకాయిలు, మునిసిపల్ పన్నులు చార్జీలు / బకాయిలు, విద్యుత్తు బకాయిలు మొ.వి. గెలుపొందిన బిడ్డరు / కాగోరు కొనుగోలుదారు(లు)లే రూఢీపరుచుకోవలెను మరియు భరించవలెను. తనఖాపెట్టబడిన ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అదే" మరియు "ఏది అక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన వేలం వేయబడును. ఇందులో పైన నిర్దేశించబడిన సెక్యూర్డ్ ఆస్తులకు సంబంధించిన వివరాలు దిగువ సంతకందారు వద్ద ఉన్న ఉత్తమ సమాచారం మరియు రికార్డుల ప్రకారం పేర్కొనబడినవి. సదరు వివరాలలో ఏదైనా పొరపాటు, తప్పుడు నివేదిక లేదా వదిలివేయబడిన వాటికి దిగువ సంతకందారు బాధ్యత వహించరు.

ముఖ్యమైన నియమనిబంధనలు:

1. అమ్మకం నియమనిబంధనలు వెబ్‌సైట్/పోర్టల్ https://kotakbank.auctiontiger.net లేదా https://www.kotak.com/en/bank-auctions.html లో లభించును.
2. ఒక్కోదానికి 5 నిమిషాల అపరిమిత విస్తరణలతో 17.02.2026న ఉ.11.00 గం.నుండి మ.12.00 గం.వరకు వెబ్‌సైట్ https://kotakbank.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ద్వారా వేలం నిర్వహించబడుతుంది. **వేలానికి ఉంచిన ఆస్తి వాస్తవిక స్వాధీనంలో ఉన్నది.**
3. మెసర్స్/ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్-ఆక్షన్ టైగర్ బి-704 వాల్ స్ట్రీట్-II ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజ్ దగ్గర ఎల్లిస్ బ్రిడ్జి - అహ్మదాబాద్-380006 గుజరాత్ (ఇండియా) ఫోన్ నెం. రామ్‌శర్మ-8000023297 మరియు మెయిల్ ఐడి: ramprasad@auctiontiger.net & support@auctiontiger.net
4. కాగోరు బిడ్డర్లు కొటక్ బ్యాంక్ వెబ్‌సైట్ https://www.kotak.com/en/bank-auctions.htmlను వేలం వివరాల కొరకు దర్శించగలరు.
5. వేలం అమ్మకం సవివరమైన నియమనిబంధనల కొరకు బిడ్డర్లు పోర్టల్ https://kotakbank.auctiontiger.netను దర్శించవలసిందిగా సూచించబడుతున్నారు. బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనాలనుకునే బిడ్డర్లు సదరు నియమనిబంధనలు కట్టుబడి ఉండవలసి ఉంటుంది. తదుపరి బిడ్లను 16.02.2026న లేదా ఆలోగా పోర్టల్ https://kotakbank.auctiontiger.net లో కెవైసి డాక్యుమెంట్లతో పాటు పూర్తి చేయవలసి ఉంటుంది మరియు దాఖలు చేయవలసి ఉంటుంది. మరియు దాని కాపీ ఒకదానిని singh.prabhjot@kotak.com మరియు ashwin.sharma@kotak.comకు మెయిల్ ద్వారా పంపవలసి ఉంటుంది.
6. కాగోరు బిడ్డర్లు పైన తెలిపిన సంప్రదించాల్సిన నంబర్లపై మెసర్స్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్) నుండి ఆన్‌లైన్ శిక్షణను పొందవచ్చును.
7. బయానా(ఇఎండి)ని RTGS/NEFT/ఫండ్ బదిలీ ద్వారా **అకౌంట్ నం.8411307138,కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, ఇ-వేలం ఖాతా, మలాడ్ (ఈస్ట్) బ్రాంచ్, ముంబై, IFSC Code:KKBK0000646** కు 16.02.2026న లేదా ఆలోగా సా.4.00 గం.వరకు డిపాజిట్ చేయవలెను. బయానా డిపాజిట్ చేయకుండా దాఖలు చేయబడిన ఏవేని బిడ్లు వెంటనే తిరస్కరించబడతాయి. ప్రతిపాదిత బిడ్డరు ద్వారా డిపాజిట్ చేయబడిన బయానాకు ఎటువంటి వడ్డీ ఇవ్వబడదు.
8. రిజర్వు ధరకు తక్కువగా బిడ్ ధర దాఖలు చేయరాదు. బిడ్డింగ్ ప్రక్రియ జరుగుసమయంలో బిడ్లు దాఖలు చేసిన బిడ్డర్లు వారి తదుపరి ఆఫర్లను రూ.1,00,000/- (రూపాయలు ఒక లక్ష మాత్రమే) గుణాంకాలలో పెంచుకొనవచ్చును.
9. గెలుపొందిన బిడ్డరు అత్యధిక బిడ్ మొత్తంలో (చెల్లించిన బయానా మొత్తమును కలుపుకుని) 25%ను ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్ ముగిసిన వెంటనే లేదా పైన క్లాజ్ 5లో నిర్ణీతపరిచిన విధానంలో వేలం తేదీన పని వేళలు ముగిసినచో మరుసటి పని రోజున చెల్లించవలెను. అత్యధిక బిడ్ మొత్తంలో మిగిలిన 75% ఒప్పందం చేసుకున్న విధంగా లేదా అమ్మకం అంగీకార/నిరారణ తేదీ నుండి 15 రోజుల్లోగా డిపాజిట్ చేయవలసి ఉంటుంది.
10. పైన తెలిపిన విధంగా నిర్ణీత సమయంలోగా అమ్మకం ప్రతిఫలాన్ని స్వీకరించిన మీదట, అధీకృత అధికారి అమ్మకం సర్టిఫికెట్ జారీ చేస్తారు మరియు అమ్మకం ముగుస్తుంది, తదుపరి ఎటువంటి క్లెయిమ్‌లను కొటక్ బ్యాంక్ అనుమతించదు.
11. ఎటువంటి కారణాలు తెలియజేయకుండా మరియు ఎటువంటి ముందస్తు నోటీస్ లేకుండా అమ్మకం నియమనిబంధనలలో దేనినైనా మార్పు చేయు/ఏదేని బిడ్‌ను తిరస్కరించు/ అమ్మకాన్ని నిలిపి వేయు/రద్దు చేయు పూర్తి హక్కులు మరియు విచక్షణ అధీకృత అధికారి కలిగియున్నారు.
12.గెలుపొందిన బిడ్డరు/కొనుగోలుదారు పేరున యాజమాన్య బదిలీ కొరకు చెల్లించాల్సిన అన్ని చార్జీలు/బకాయిలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ, పన్నులు వగైరా కలుపుకుని కొనుగోలుదారుడే భరించాల్సి ఉంటుంది.
13. గెలుపొందని బిడ్డర్ల బయానా ఏడు పని రోజుల్లోగా కొటక్ బ్యాంక్ ద్వారా తిరిగి ఇవ్వబడుతుంది.
14. ఆదాయపన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-ఎ ప్రకారం, వర్తించు విధంగా రేట్ వంతున పన్ను మొత్తం అమ్మకం ప్రతిఫలంపై చెల్లించాలి మరియు వేలానికి తీసుకురాబడిన ఆస్తి యొక్క యజమాని మరియు తనఖాదారు నుండి, కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ పేరున టిడిఎస్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుంది.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్‌లోని రూల్ 8(6) క్రింద చట్టబద్ధమైన ప్రకటన

వేలం తేదీలోగా అప్పటి వరకు వర్తించు వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులతో పాటు పైన తెలిపిన విధంగా మొత్తమును చెల్లించవలసిందిగా ప్రిన్సిపల్ రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. లేనిచో సదరు ఆస్తి వేలం వేయబడుతుంది/విక్రయించబడుతుంది మరియు మిగిలిన బకాయిలు ఏవైనా ఉంటే, వడ్డీ మరియు వ్యయాలతో రాబట్టుకొనబడుతుంది. ఈ ప్రకటనను పైన ఇందులో తెలిపిన రుణగ్రహీత/హామీదారు మరియు తనఖాదారుకు అమ్మకం ప్రకటనగా కూడా భావించవచ్చును. ఆస్తికి సంబంధించి ఏవేని ఇతర వివరాల కొరకు, శ్రీ అశ్విన్ శర్మ- 8655762148/ శ్రీ ప్రభ్‌జోత్ సింగ్- 8860603853 వారిని సంప్రదించగలరు. ఇ-వేలం తేదీనకు ముందు సదరు బకాయిలు పూర్తిగా చెల్లించనిచో వేలం కొనసాగుతుందని రుణగ్రహీత/హామీదారులకు తెలియజేయుటకు కూడా ఈ ప్రకటన ఇవ్వబడినది. ఇంగ్లీష్ మరియు ఇతర స్థానిక భాషలలో ప్రచురించబడిన వేలం ప్రకటనల మధ్యన ఏదేని వ్యత్యాసం/ తేడా ఉన్నచో, అప్పుడు ఇంగ్లీష్‌లో ప్రచురించబడిన నోటీస్ లోని అంశాలను పాటించవలసిందిగా గమనించగలరు.

ప్రదేశం: గుంటూరు, తేది: 08 జనవరి 2026 — కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్, అధీకృత అధికారి తరఫున.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నెహ్రూనగర్ ఒకటో లైను నుంచి 11వ లైను వరకు, వెంకటాద్రిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న రఫీ, పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లును ఉపసంహరించుకోవాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్నత విద్యపై మరింత నియంత్రణను పెంచి రాష్ట్రాల హక్కులను కాలరాసే వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్-25 బిల్లును మోదీ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ఏర్పడిన యూజీసీ, సాంకేతిక విద్యకు సంబంధించిన ఏఐసీటీఈ, పాఠశాల విద్యకు సంబంధించిన ఎన్‌సీటీఈలను రద్దుచేసి భారత ఉన్నత విద్యా కమిషన్‌గా తెచ్చి విద్యపై మరింత కేంద్రీకరణ పెంచుతుందని విమర్శించారు. సమావేశంలో సంఘ నాయకులు గనిరాజు, కే నాగరాజు, షహీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నాయకులపై అక్రమకేసులను ఎత్తివేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కొత్తపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు జిల్లాలలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై రౌడీషీట్ తెరవడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కేసులను ఉపసంహరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో పలు విద్యార్థి సంఘాల నాయకులు కరీం, జంగాల చైతన్య, వలీ, వినోద్, ఉత్తేజ్, జవహర్, యశ్వంత్, రాజు, అజయ్, పవన్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి 179వ ఆరాధన సంగీత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అనిరుథ్ సుబ్రహ్మణ్యం శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ వీనుల విందుగా జరిగింది. తొలుత జరిగిన లఘు కచేరీలలో పలు కళాకారులు తమ గానంతో త్యాగరాజస్వామిని ఆరాధించుకున్నారు. ఈ కార్యక్రమాల్ని సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్ గిరిజాశంకర్, కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ కార్యక్రమాల్ని పర్యవేక్షించారు .

శతాబ్ది ఉత్సావాలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ నగరంలో 11న జనసేవా దళ్ శిక్షణ శిబిరం, 12న మోటారు బైక్ ర్యాలీ ద్వారా కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో అకిటి అరుణ్‌కుమార్, నూతలపాటి చిన్న, జి సురేష్ బాబు, దేవానాయక్, విరిగినేని వెంకటేశ్వర్లు, మంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌యూఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జేసీ అషుతోస్ శ్రీవాత్సవ

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ(టీఎన్‌యూఎస్) డైరీని జేసీ అషుతోస్ శ్రీవాత్సవ బుధవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఓ జయరాజు, జగదీష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు పసల బాలస్వామి, కార్యదర్శి పాలెటి జగదీష్ బాబు, గౌరవ సలహాదారులు ఓ ఫణిదత్తు, శ్రీధర్, పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోని కలిసిన ఏపీ ఎంసీఏ ప్రతినిధులు

గుంటూరు సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మిని ఏపీ ఎంసీఏ జిల్లా ప్రతినిధులు బుధవారం కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య అధికారి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు సంధ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, జ్యోత్స్నా, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఐపీడీ కాలనీలో తనిఖీలు

● పర్యవేక్షించిన ఎస్పీ వకుల్‌జిందాల్


ఐపీడీ కాలనీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐపీడీ కాలనీలో బుధవారం వేకువజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో సీఐలు ఏవీ శివప్రసాద్, వీరయ్యచౌదరి, వెంకటప్రసాద్ తదితరులు సిబ్బందితో కాలనీని చుట్టుముట్టి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. గంజాయి కేసుల్లో పదేపదే పట్టుబడితే రౌడీషీట్ తెరుస్తామన్నారు. నిరంతరం నిఘా ఉంచడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపిస్తామని తెలిపారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి


కార్యకర్తల సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆమె కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ డివిజన్ల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలు వారి ప్రాంతాల్లోని సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని విని తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో పాటు కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవి భరోసా ఇచ్చారు.

గుంటూరు టీ- 10 క్రికెట్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు జిల్లాలో యువతలో క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించనున్న గుంటూరు టీ- 10 క్రికెట్ లీగ్‌పోస్టర్‌ను బుధవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆవిష్కరించారు. పవనిజం అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ గోపికృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జనవరి 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. పోటీలు జేకేసీ కాలేజ్ క్రికెట్ గ్రౌండ్ జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.

వేడుకగా ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని శ్రీ హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా 134వ ఉరుసు మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాబా వారి గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం బాబా వారి సమాధి వద్ద దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ బాబా వారిని దర్శించి చద్దరును సమర్పించారు.


బాబా వారికి చద్దరును సమర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

చిన్న మౌలా పంజాలో..

లాలాపేటలోని చిన్న మౌలా పంజా అషుర్‌ఖానాలో మూడు రోజులుగా జరుగుతున్న ఉరుసు మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉరుసు మహోత్సవాల్లో భాగంగా ముతవల్లి షేక్ ఖాదర్‌బాబా తనయుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం భక్తులకు విందు ఏర్పాటు చేశారు.


బాబా వారికి గంధం తీసుకువస్తున్న రావి రామ్మోహనరావు కుటుంబ సభ్యులు

సీఎం పర్యటనకు జీఎంసీ ముందస్తు చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు


డ్రైన్ లో తీస్తున్న పూడికను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం నల్లపాడు రోడ్‌లో ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి డ్వాక్రా బజార్ (సరస్)కి ఈ నెల 8వ తేదీ ముఖ్యమంత్రి రానున్నందున పర్యటన మార్గంలో జీఎంసీ ముందస్తు చర్యలు ఇప్పటికే పూర్తి చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ బంగ్లా రోడ్, జీటీ రోడ్, చుట్టగుంట నుండి నల్లపాడు రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నల్లపాడు రోడ్‌లోని సరస్ వేదిక ప్రాంతం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, సరస్‌లో వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మనారాయణ, ఎస్ఎస్‌లు, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలు మృతి

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టౌవ్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు వరగాని అన్నపూర్ణమ్మ(60) మృతి చెందారు. కొండయ్యా కాలనీకి చెందిన అన్నపూర్ణమ్మ ఒంటరిగా ఉంటుంది. గ్యాస్ ఉదయం స్టవ్ ఆన్ చేసి వెలిగించడం మర్చిపోయింది. కొద్దిసేపటి తర్వాత టీ పెట్టుకోవడానికి గ్యాస్ పొయ్యి వెలిగించగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆమె గాయపడింది. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడైన వరగాని వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

● ఆలయ ఈవో సుభద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థా నం పున:నిర్మాణం దృష్ట్యా విరాళం అందించేందుకు దాతలు ముందుకు వచ్చారని ఆలయ ఈవో టి.సు భద్ర బుధవారం తెలిపా రు. గుంటూరుకు చెందిన కర్పూరపు ఆంజనేయప్ర సాద్ రూ.1,01,116 అందజేసినట్లు తెలిపారు.


ఆలయ ఈవో సుభద్రకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

ట్రంప్ నియంత పోకడలను ఖండించాలి

● మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వెనిజువెలాపై దాడిచేసి, ఆ దేశ అధ్యక్షుడు మదురోను అక్రమంగా నిర్బంధించి, అమెరికా న్యాయస్థానంలో దోషిగా నిలబెట్టడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ట్రంప్ నియంతపోకడలను ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరులో జేవీవీ ఆధ్వర్యంలో ట్రంప్ నియంత పోకడలు.. వెనిజువెలా సార్వభౌమాధికారం రక్షింపబడాలి అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతరెడ్డి ప్రసంగిస్తూ 21వ శతాబ్దపు వలస వాదానికి ప్రతీకగా అమెరికా చర్యలు కనబడుతున్నాయన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ వెనిజువెలాపై అమెరికా దాడిని ప్రజాస్వామ్యవాదులు, వామపక్ష వాదులు తీవ్రంగా నిరసిస్తున్నాయన్నారు. ఈ చర్చా గోష్టిలో విద్యావేత్త ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, జేవీవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, కేవీ చలపతిరావు, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, ఓరుగంటి నారాయణరెడ్డి, సురేష్, పటాన్ అల్లాబక్ష, అవధానుల హరి, సాంబశివరావు ప్రసంగించారు.

నూతన ఆవిష్కరణల కోసం యువత కృషి చేయాలి

● ఆర్వీఆర్ జేసీ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో నూతన ఆవిష్కరణలకు భారత్ అగ్రస్థానానికి చేరడానికి పరిశోధనల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం "రూపజ్ఞా-2026" పేరుతో నిర్వహించిన జాతీయస్థాయి ప్రోటోటైప్ ప్రదర్శన ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రదర్శనల సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ రాయపాటి మాట్లాడుతూ ఆవిష్కరణల రంగంలో శక్తివంతమైన దేశంగా రూపొందేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల సమిష్టి సహకారం కీలకమన్నారు. కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ పోటీలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో దరఖాస్తులు రాగా, ప్రతిభ ఆధారంగా ఎంపికైన 46 టీమ్‌లకు చెందిన 180 మంది విద్యార్థుల ప్రదర్శనలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మూడు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో బయోమెడికల్ విభాగంలో ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల, ఐటీ విభాగంలో అనురాగ్ యూనివర్సిటీ(హైదరాబాద్),అగ్రిటెక్ విభాగంలో క్విస్ ఇంజనీరింగ్ కాలేజీ (ఒంగోలు) ప్రథమ స్థానాలలో నిలిచాయి. విజేతలకు నగదు, మెమోంటో, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపల్ జాస్తి ఉషారాణి తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గుజ్జనగుళ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జాస్తి ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఫార్మసీ కంపెనీ మెడ్ ప్లస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 16 మంది విద్యార్థినిలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులను అభినందించారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల వితరణ

● రూ.లక్ష విరాళం

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గుజ్జనగుళ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించినట్లు ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రస్తుతం ఆల్ ఇండియా రేడియో ఇస్రో పోస్టల్ ఎస్ఆర్ఎస్ఐ విభాగాల్లో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ హాకీ పోటీలకు టీజేపీఎస్ విద్యార్థి

గుంటూరు(విద్య), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో బీకాం(కంప్యూటర్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న వై ప్రభుదేవ్ రాజ్ ఈ నెల 13న తమిళనాడు సత్యభామ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ హాకీ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ కామేశ్వర శాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల కార్యదర్శి బ్రహ్మం తదితరులు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న కేవీ బ్రహ్మం


ఎమ్మెల్యే నసీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూర్‌భాషా సంఘ నేతలు

నూర్ బాషాలకు అండగా నిలుస్తా

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నూర్ బాషాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో బుధవారం నూర్ బాషా సంఘ నాయకులు ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నూర్ బాషాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో నూర్ బాషాల సంఘ నాయకులు మహ్మద్ ఖాజావలి, షేక్ ఖాజావలి, షేక్ మస్తాన్ తదితరులు ఉన్నారు.

● **సారస్ మేళాను సద్వినియోగం చేసుకోండి**

దేశంలో మహిళా ఆర్థిక సాధికారత కోసం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతున్న సారస్ మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. దేశ వ్యాప్తంగా 21 రాష్ట్రాల నుంచి సుమారు 320 స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు మహిళలు తరలివస్తున్నారని చెప్పారు. సరస్ మేళా గ్రామీణ మహిళలు, స్వయం సహాయ సంఘాల జీవితాల్లో ఎన్నో సానుకూల మార్పులు తెస్తుందన్నారు.

కోర్టు తీర్పు.. కార్మికుల విజయం

● సీఐటీయూ నగర కన్వీనర్ ముత్యాలరావు

ఏఎన్‌యూ జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దినసరి ఉద్యోగులు, కార్మికుల బకాయి పీఎఫ్ చెల్లించాలని కోర్టు తీర్పు ఇవ్వడం ఉద్యోగుల విజయమని సీఐటీయూ నగర కన్వీనర్ బి.ముత్యాలరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం అభినందనలు తెలిపారు. వర్సిటీలో జరిగినన దినసరి వేతన ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశంలో ముత్యాలరావు మాట్లాడుతూ 2012లో కార్మికులకు చట్ట ప్రకారం ప్రావిడెంట్ ఫండ్ చెల్లించాలని కోరుతూ వర్సిటీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో పీఎఫ్ కార్యాలయ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం, ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. దీంతో అధికారులు విచారణ చేపట్టి.. పీఎఫ్ బకాయితో సహా చెల్లించాలని వర్సిటీ అధికారులను ఆదేశించగా వారు కోర్టు వెళ్లారని గుర్తుచేశారు. కోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇవ్వకగా, పీఎఫ్ అధికారులు కూడా వర్సిటీ బ్యాంక్ ఖాతాలను నిలుపుదల చేసి.. మొత్తం బకాయిలను రికవరీ చేశారన్నారు. అయితే దీనంతటికి ఒక ఉద్యోగి కారణమంటూ.. చర్యలు తీసుకోవాలని కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. ఇది సరైనది కాదన్నారు. ఈ సమావేశంలో డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ) కార్యదర్శి సీహెచ్ గోపాలకృష్ణ, టి.రమణ, కె.ప్రభాకర్, చంద్రశేఖర్, కిరణ్, పాల్, గోపి పాల్గొన్నారు.

ఏబీఆర్ఎస్ఎం క్యాలెండర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ జనవరి 7(ఆంధ్రజ్యోతి): అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్-2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఏఎన్‌యూలో బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, ఏఎన్‌యూ వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న దాదాపు 5 వేల అధ్యాపకుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వై.వి. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రమణ్యం కోరారు. ప్రొఫెసర్ మధుమూర్తి స్పందిస్తూ.. కొన్ని న్యాయపరమైన అడ్డంకులు ఉన్నందు వల్ల భర్తీ ఆలస్యం అవుతోందని, వీలైనంత తొందరలో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంతా లక్ష్మణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ రామచంద్రన్, డాక్టర్ వాణి, డాక్టర్ గంగరాజు, డాక్టర్ బాల మురళి తదితరులు పాల్గొన్నారు.


అరిసెల బెల్లం కేరాఫ్ శృంగారపురం

చినఅనకాపల్లిగా పేరు..

రంగుల్లేని, రసాయన రహిత బెల్లానికి ప్రసిద్ధి

సంక్రాంతికి భారీగా డిమాండ్

దుగ్గిరాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే అరిసెలు, బూరెలు, కజ్జకాయలు, జిలేబీ, పూర్ణాలు వంటి సంప్రదాయ వంటకాలు గుర్తుకొస్తాయి. వీటన్నింటినీ రుచిగా వండేందుకు బెల్లం కొనాలంటే దుగ్గిరాల మండలం శృంగారపురం వెళ్లాల్సిందే. తాతల కాలం నుంచి చెరకు ద్వారా బెల్లం తయారు చేసే క్రషర్లు శృంగారపురం గ్రామంలో నిర్వహిస్తున్నారు. రంగువేయని, రసాయన రహిత బెల్లం.. 40 రోజుల పరిమిత కాలంలో తయారు చేస్తారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి పరిసరాల నుంచి నేరుగా క్రషర్ల వద్దకే వచ్చి బెల్లం కొనుగోలు చేస్తుంటారు. విదేశాలకు పిండి వంటలు తయారు చేసి పంపేవారు, హైదరాబాద్ విశాఖపట్నం, బెంగళూరులోని బంధువులకు పార్శిల్ పంపేందుకు.. ఇక్కడి బెల్లాన్ని ఇష్టపడతారు. మార్కెట్‌లో లభించే బెల్లం ఖరీదు కేజీ రూ.70 నుంచి రూ.80 వరకు ఉంది. శృంగారపురం బెల్లం కేజీ రూ.140 వరకు ఉన్నప్పటికీ డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. యాలుకలు, మిరియాలు వేసిన బెల్లం కూడా ప్రత్యేకంగా ఇక్కడ తయారు చేసి విక్రయిస్తున్నారు. ఆరోగ్యకరమైన బెల్లం కోసం వచ్చే వారు ధర గురించి ఏమాత్రం పట్టించుకోకుండా పది, 20 కేజీల బాక్సులు, వ్యాపారులు 33 కేజీల బుట్టల్లోని బెల్లాన్ని తీసుకెళ్తున్నారు.



ప్రత్యేకంగా తయారీ..

గ్రామంలో పండించే చెరకును క్రషర్‌లో వేసి రసం తీస్తారు. భారీ కళాయిలలో వేసి పాకం పెడతారు. మడులుగా అరబెట్టి.. చతురస్రాకార అచ్చులుగా కోసి విక్రయిస్తుంటారు. గోదావరి జిల్లా నుంచే ప్రత్యేకంగా రప్పించిన 100 మందికి పైగా శ్రామికుల సాయంతో బెల్లం తయారు చేస్తున్నారు. ఇక సీసాల ద్వారా విక్రయించే బెల్లం పాకం వయో భేదం లేకుండా ఎలాంటి వారికైన ఔషధంలా పనిచేస్తుందని క్రషర్ నిర్వహిస్తున్న రైతులు చెబుతున్నారు.



శృంగారపురంలో క్రషర్ల వద్ద అచ్చులుగా పోసిన బెల్లం



శృంగారపురంలో భారీకళాయిలో తయారు చేసిన బెల్లం పాకం

కనుమరుగవుతున్న క్రషర్లు

సుమారు 60 ఏళ్లుగా శృంగారపురంలో బెల్లం తయారు చేస్తున్నారు. గ్రామంలో 40 క్రషర్ల నుంచి గతంలో నిత్యం 10 టన్నుల వరకు లారీల ద్వారా అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు తరలిస్తున్నారు. చిన అనకాపల్లిగా పేరొంది నప్పటికీ.. కాలక్రమంలో రైతులకు గిట్టుబాటు కాక క్రషర్లు కనుమరుగవుతూ వస్తున్నాయి. మండలంలో శృంగారపురంతోపాటు పెదపాలెం, రేవేంద్రపాడు పరిసరాల్లోనూ చెరకు పంట 600 ఎకరాల వరకు సాగు చేసేవారు. ఉయ్యూరు, జంపని పంచదార ఫ్యాక్టరీలకు పరిసర గ్రామాల నుంచి వందలాది టన్నుల చెరకు తరలి వెళ్తుండేది. శృంగారపురంలో మాత్రం బెల్లం కోసమే ప్రత్యేకంగా చెరకు పండిస్తారు. కూలి ఖర్చులు, కౌలు ధరలు గడిచిన ఐదేళ్లలో మూడింతలు పెరగడంతో చెరకు సాగు గిట్టుబాటు కావడం లేదని, ఇతర ప్రాంతాల్లో పండించే చెరకు బెల్లం తయారీకి పెద్దగా ఉపయోగపడటం లేదని క్రషర్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఖర్చులు పెరిగి, సంప్రదాయ వంటకాలకు ఆదరణ తగ్గి క్రషర్ల సంఖ్య 40 నుంచి ముడుకి తగ్గింది. గతంలో 150 ఎకరాల వరకు గ్రామంలో చెరకు సాగు చేయగా, ప్రస్తుతం 30 ఎకరాల్లోపు మాత్రమే సాగు చేస్తున్నారు. ఆనవాయితీగా వస్తున్న బెల్లం క్రషర్లను గ్రామానికి చెందిన రైతులు అంకమయ్య, సాంబశివరావు, రవికాంత్ లాభాపేక్ష లేకుండా కొనసాగిస్తున్నారు.

రేపటి నుంచి గుంటూరు కళాపరిషత్ నాటకోత్సవాలు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న పెద్దబ్బయ్య, నాయుడు గోపి తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వ విజ్ఞాన మందిరం వేదికగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు గుంటూరు కళాపరిషత్ 28వ వార్షిక నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు, గౌరవ సలహాదారుడు అలోకం పెద్దబ్బయ్య. ఉపాధ్యక్షుడు నాయుడు గోపి తెలిపారు. విజ్ఞాన మందిరం ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వివరాలను వెల్లడించారు. 9న సాయంత్రం 6 గంటలకు మాయాజాలం (శ్రీకాకుళం), 7.45గంటలకు స్త్రీమాత్రేనమః (హైదరాబాదు), 9గంటలకు మమ్మల్నీ బ్రతకనియ్యండి(విజయవాడ),10న దీపం కింద చీకటి(వీరన్నపాలెం), కన్నీటికి విలువెంత (కాకినాడ), అన్నదాత (హైదరాబాదు), 11న ఒక రాక్షసుడి కథ(విశాఖపట్నం), వాస్తవం (విజయవాడ), పేగు రాసిన శాసనం(పెదకాకాని) సాంఘిక నాటక ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి బండ్ల పూర్ణచంద్రరావు, కార్యవర్గవర్గ సభ్యులు పోపూరి శివరామకృష్ణ, షేక్ సైదా, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

నాగార్జునుడి పరిశోధనలు మానవాళికి దోహదం

● రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కే మధుమూర్తి

● ఏఎన్‌యూలో రసాయనశాస్త్ర విభాగం జాతీయ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి

ఏఎన్‌యూ జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలో ఆచార్య నాగార్జునుడి ఆల్కెమి కల్ వారసత్వం శాస్త్రం లాభాల కోసమే కాకుండా.. మానవాళి, ప్రకృతి సమతుల్యతకు దోహదపడుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి అన్నారు. వర్సిటీ రసాయనశాస్త్ర విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జునడి ఆల్కెమికల్ వారసత్వం సాంప్రదాయిక, ఆధునిక దృక్ప థాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం వర్సిటీ డైక్‌మెన్ ఆడిటో రియంలో ప్రారంభమైంది. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ దిట్టకవి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. భారతీయ తత్వశాస్త్రం, బౌద్ధ దర్శనం, ప్రాచీన శాస్త్రీయ ఆలోచనలలో నాగార్జునుడు అగ్రగణ్యుడని ప్రొఫెసర్ మధుమూర్తి పేర్కొన్నారు. ఆల్కెమీ అనేది కేవలం లోహాలను బంగారంగా మార్చే కళ మాత్రమే కాదని, అది శరీరం, మనస్సు, పదార్థాల శుద్ధి, ఆరోగ్య పరిరక్షణ, దీర్ఘాయుష్షు సాధన వంటి లక్ష్యాలతో కూడిన సమగ్ర విజ్ఞానమని పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మంత శ్రీనివాసు మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడు జ్ఞానం, శాస్త్రం, నైతిక సమ్మేళానికి ఆధునిక ప్రతిరూపమన్నారు. తత్వవేత్తగానే కాకుండా, ఆల్కెమీ రంగంలో కూడా ఆయనకు అపార మైన వారసత్వం ఉందని చెప్పారు. జబల్పూర్ మంగళాయతన్ విశ్వవిద్యాలయం ఉపకుల పతి ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ.. సాంప్రదాయ ఔషధ ఆవిష్కరణలో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. పెన్సిలిన్, ఇన్సులిన్ తదితర ఔషధాల ప్రాముఖ్యతను వివరించారు. నిజమైన బంగారం అనేది మన ఆలోచనల శుద్ధిలోనే ఉందని చెప్పారు. ఏఎన్‌యూ ఉపకులపతి కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ.. ఈ సదస్సు ప్రపంచ శాస్త్రీయ వేదికపై భారతీయ జ్ఞాన వ్యవస్థకు ఉన్న ప్రాముఖ్యతను వెలికితీసే కార్యక్రమమని పేర్కొన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ జి. సింహాచలం, గుంత లక్ష్మణ్, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.వీరయ్య, ఓ ఎస్డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు బ్రహ్మాజీ, త్రిమూర్తిరావు, సుబ్బారావు, పి. సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బిహెచ్.మల్లికార్జునరావు, ట్రెజరర్ డాక్టర్ పి. భరత్ పాల్గొన్నారు.

ఏడాదికి ఆరు సారస్ మేళాలు

● సీఎం చంద్రబాబు ఆదేశించారు ● విజయనగరం, విశాఖపట్నం మేళాలు విజయవంతం ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



చీరలను చూస్తున్న మహిళలు

గుంటూరు సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామీణ స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శన, విక్రయానికి సారస్ మేళా -2026.. అఖిల భారత డ్వాక్రా బజారును నిర్వహిస్తు న్నామని చిన్నతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం నల్లపాడు రోడ్డులోని రెడ్డి కాలేజీ ఎదుట ప్రదర్శన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వివిధ ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను పరిశీలించి, వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించి, పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. దేశంలోని స్వయం సహాయక సంఘాలు త యారు చేసిన ఉత్పత్తులన్నీ ఒకే ప్రాంతంలో, గుంటూరు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు అఖిల భారత డ్వాక్రా బజారును ఈ నెల 18 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించనున్నారని వెల్లడించారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు.. ఇలాంటి మేళాలు సంవత్సరానికి ఆరు నిర్వహించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో విజయనగరం, విశాఖపట్నంలో నిర్వహించామని, అక్కడ అత్యద్భుతంగా ప్రజలు ఆదరించారని తెలిపారు. విజయనగరంలో రూ.12 కోట్లు, విశాఖపట్నంలో రూ.20 కోట్ల గణనీయమైన టర్నోవర్ జరిగిందన్నారు. గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. మేళాను 12 ఎకరాల విస్తీర్ణంలో 300 షాపులతో భారీ ఎత్తున ఏర్పాటు చేశామని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆలోచన మేరకు సంక్రాంతి సమయంలో ఈ మేళాను నిర్వహించడం.. దేశ విదేశాల నుం చి వచ్చే వారికి ఒక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి వివరించారు. కశ్మీర్ నుంచి కేరళ వరకు, తూర్పు నుంచి పశ్చిమ తీరం వరకు వివిధ రాష్ట్రాల నుంచి గ్రామీణ ఉత్పత్తులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి చేతి వృత్తు ల కళాఖండాలు, వ్యవసాయ ఉత్పత్తుల, చేనేత వస్త్రాలు, అలంకార వస్తువులు, సాంప్ర దాయ ఆహార పదార్థాలు ప్రదర్శించ నున్న ట్లు చెప్పారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేశామని, ఇవి సందర్శకులకు విభిన్న అనుభవాలను కలిగిస్తాయని మంత్రి చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే ఉం డే కొండపల్లి బొమ్మలు, కలంకారీ, కశ్మీర్ వస్త్రాలు ఇక్కడ లభిస్తాయని వెల్లడించారు. ఎస్‌హెచ్‌జీ మహిళల సూక్ష్మ పరిశ్రమలు, జీవనోపాధి కార్యకలాపాలను మరింతగా ప్రోత్సహించి, వారికి ఆర్థిక స్థిరత్వం అందిం చడానికి నేషనల్ లైవ్లీవుడ్ మిషన్ నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. మహిళల ఆర్థిక సాధికారతకు మరింతగా ఊతమిచ్చే అఖిల భారత డ్వాక్రా బజార్‌కు స్థానిక పరిసర ప్రాం తాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి, మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించి విజయవంతం చేయాలని మంత్రి కొండపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, సెర్ప్ డైరెక్టర్లు పద్మావతి, సుధాకర్, డీఎస్పీ భానోదయ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులు

సంక్రాంతికి.. సై

(5వ పేజీ తరువాయి)

అతి పెద్ద ఆదాయ వనరుగా మార్చాయి. విపరీతమైన ప్రచారం కల్పిస్తూ, జనాల్లో ఆసక్తి పెంచుతూ ప్రవేశ రుసుం పేరుతో భారీగా దండుకోవడం మామూలైపోయింది. ఈ బరుల వద్ద పేకాట, గుండాట, మట్కా తదితరాలను నిర్వహిస్తూ ఆ ప్రదేశాన్ని ఓ మినీ క్యాసినోగా మార్చేస్తున్నారు. ఏం కొనాలన్నా ఏం తాగాలన్నా ఏం తినాలన్నా మద్యం సహా అక్కడే అన్నీ అందుబాటులోకి తెచ్చేస్తున్నారు. ఓ వైపు మద్యం ఏరులు, మరో వైపు జూద క్రీడలతో నిర్వాహకులు బరితెగిస్తున్నారు. తీర ప్రాతంలో భారీగా ఇప్పటికే పలువురు పోటాపోటీగా భారీగా బరులు సిద్ధం చేస్తున్నారు. చెరుకుపల్లి మండలం శివారు ప్రాంతాల్లో వేగంగా జరుగుతున్నాయి. వేమూరు, పిట్టలవానిపాలెం మండలాల్లో కూడా కార్పొరేట్ హంగులతో జూద క్రీడలు నిర్వహించడానికి నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పెద్ద బరుల సంఖ్య ఆరు వరకు ఉంటుండగా, చిన్నా చితక కలుపుకుంటే పదుల సంఖ్యల్లో బరుల్లో కోడి పందేలు జరగనున్నాయి.

కీలక నేతల అండతో బహిరంగంగా...

బరుల విషయంలో ఎక్కడా దాపరికం లేదు. పోలీసులు వచ్చి తనిఖీలు చేస్తారన్నా భయం లేదు. సంక్రాంతి సంప్రదాయం ముసుగులో జూదాలకు కార్పొరేట్ హంగులద్దీ మూడు రోజుల వ్యవధిలో రూ.కోట్లు కొట్టేసేలా పోటీల తంతుకు సిద్ధమయ్యారు. ఎక్కడో పొలాల్లోనో లేక ఇళ్లల్లోనో చాటు మాటుగా జరిగే పందేలు ఇప్పుడు సినీ సెట్టింగులను తలదన్నే రీతిలో పదు ల ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నా అటు వైపు కన్నెత్తి చూసే సాహసం పోలీసులు చేయడం లేదు. చూసీ చూడనట్లు వదిలేయమనే రాష్ట్ర స్థా యి ఆదేశాలతో గతేడాది మొక్కుబడిగా కేసులు నమోదు చేసి యథేచ్ఛగా బరులను సాగనిం చారు. ఈ ఏడాది కూడా పై స్థాయిలో తీసుకునే నిర్ణయం ఆధారంగానే వీటి నిర్వహణపై తుది నిర్ణయం జరగనుంది.



పండుగ రోజుల్లో జేబులు గుల్ల

గతంలో పందాల అలవాటు ఉండే వారే అటు వైపు ఆసక్తి చూపే వారే తప్ప మిగిలిన వారు పెద్దగా పట్టించుకునే వారు కాదు. కానీ బరుల విషయంలో పెద్దఎత్తున ప్రచారం కల్పించడం మొదలుకుని, హంగు ఆర్భాటాలు సమకూర్చడంతో సామాన్యుల చూపు కూడా అటు వైపు పడింది. దీంతో వారు కూడా జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సంబరంలా జరగాల్సిన కోడి పందాల స్థానంలో మరికొన్ని జూదక్రీడలను అదనంగా చేర్చి సంక్రాంతి పండుగ మూలాలనే ప్రశ్నార్థకం చేసే విధంగా జరుగుతున్న ఈ అడ్డగోలు తంతులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూడంచెల తనిఖీలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీగా ఏర్పాటు చేస్తున్న బరుల దగ్గర ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. మూడంచెల తనిఖీ తర్వాతనే బరుల్లోకి జూదరులను అనుమతించేలా పక్కా ప్రణాళికతో కార్పొరేట్ తరహాలో ఏర్పాట్లు చేస్తున్నారు. బరుల వద్ద కేటగిరీల వారీగా గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీలు, వీవీఐపీలు ప్రత్యేకంగా ఆశీనులై వీక్షించేలా గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. బరుల వద్ద ప్రత్యేకంగా బౌన్సర్లను కూడా పెద్ద సంఖ్యలో మోహరిస్తున్నారు.

22 నుంచి విజ్ఞాన్‌లో స్పేస్ టెక్ సమ్మిట్

● ప్రత్యేక ఆకర్షణగా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026

గుంటూరు(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్‌స్పేస్ టెక్ సమ్మిట్ -2026 నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ వెల్లడించారు. ఈమేరకు బుధవారం సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అమరావతిలోని సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా "సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026 కూడా మూడు రోజుల పాటు ఇదే సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కళాశాల విద్యార్థులకు కెమికల్ రాకెట్రీ, పాఠశాల విద్యార్థులకు హైడ్రో రాకెట్రీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్‌ను 'లివరేజింగ్‌స్పేస్ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్ 2047' అనే ఇతివృత్తంతో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతరిక్ష సాంకేతిక రంగంలో పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలు, అకాడమీ కలయికలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సమ్మిట్ కోసం విశాలమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భారత అంతరిక్ష కార్యక్రమం 1960లో ప్రారంభమై, దేశ అభివృద్ధికి అంతరిక్ష సాంకేతికతను వినియోగించడం ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

రాకెట్రీ చాలెంజ్ ప్రధాన ఆకర్షణ

సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్ 2026లో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, స్కూల్, పాలిటెక్నిక్ విద్యార్థి బృందాలు పాల్గొననున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు స్వయంగా చిన్న రాకెట్ల నమూనాలను రూపకల్పన చేసి, లాంచ్ చేయడం ద్వారా రాకెట్ డిజైన్, ఏరో డైనమిక్స్, ప్రొపల్షన్, ఫ్లైట్ స్టెబిలిటీ వంటి అంశాలపై ప్రయోగిక అవగాహన పెంపొందించుకోగలరన్నారు. రాకెట్ రేంజ్, ఎత్తు, స్థిరత్వం, డిజైన్ ఇన్నోవేషన్, సేఫ్టీ ప్రొటోకాల్ వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రత్యేక ట్రోఫీలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

గురువారం • 8 జనవరి 2026



బ్లేజర్స్ భేష్

ఉద్యోగినులు సౌకర్యంగా, హుందాగా కనిపించే బ్లేజర్స్‌ను ఆఫీస్ వేర్‌గా ఎంచుకుంటున్నారు. వాటి ఎంపికలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే, బ్లేజర్స్‌లో మరింత భేషుగ్గా కనిపించవచ్చు.

ఇలా ధరించాలి

- బ్లేజర్స్‌ను టీ షర్ట్‌తో కలిపి ధరించవచ్చు. సాదా రంగు టీ షర్ట్స్ బ్లేజర్లకు సూటవుతాయి
- బ్లేజర్స్‌తో స్కర్ట్‌ను కూడా మ్యాచ్ చేయవచ్చు. అయితే రెండింటి రంగులూ ఇంచుమించు ఒకేలా ఉండేలా చూసుకోవాలి అలాగే ఫిట్టింగ్ పర్‌ఫెక్ట్‌గా ఉండేలా చూసుకోవాలి
- జీన్స్, టీ షర్ట్‌లతో కలిపి బ్లేజర్‌ను ధరించవచ్చు
- అదనపు ఆకర్షణ కోసం మెడలో స్కార్ఫ్ కూడా వేసుకోవచ్చు
- క్రాప్ టాప్‌తో కూడా బ్లేజర్‌ను మ్యాచ్ చేయవచ్చు.

యాక్సెసరీస్

- బ్లేజర్‌తో పెన్సిల్ హీల్, ఫార్మల్ షూస్ వేసుకోవచ్చు
- చెవులకు స్టడ్స్, చేతికి వాచ్ తప్పనిసరి
- ఆభరణాలు అవసరం లేదు
- స్కర్ట్‌తో మ్యాచ్ చేసినప్పుడు, మెడలో సన్నని చైన్ వేసుకోవచ్చు

మేకప్ ఇలా

- లేత రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి
- బ్రష్, ఐ షాడో వీలైనంత తగ్గించాలి
- న్యాచురల్ మేకప్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- చేతి వేళ్ల గోళ్ల గ్రూమింగ్ చేసుకుని ఉండాలి.



కౌన్సెలింగ్

ఈ వింత పరిస్థితి ఎందుకు?

Q A

డాక్టర్! నాకు సర్జరీ ద్వారా మూత్రపిండాల్లో రాళ్లు తొలగించారు. ఆ తర్వాత మూడు నెలల పాటు 'యూరిమాక్స్' అనే మందులు వాడమన్నారు. అయితే సెక్స్‌లో పాల్గొన్నప్పుడు భావప్రాప్తి కలుగుతున్నా, వీర్యస్కలనం జరగడం లేదు. పిల్లల కోసం ప్రయత్నిస్తున్న మాకు ఈ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్య సర్జరీ ఫలితమా?

- ఓ సోదరుడు, ఖమ్మం.

మీకున్న సమస్య 'రిట్రోగ్రేడ్ ఇజాక్యులేషన్'! స్కలనం ద్వారా వెలుపలికి రావలసిన వీర్యం మూత్రాశయం లోకి చేరుకుని, మూత్రవిసర్జన ద్వారా బయటకు వెళ్లిపోతూ ఉంటుంది. ఈ పరిస్థితికి కారణం సర్జరీ తదనంతరం వాడుతున్న యూరిమాక్స్ మందుల దుష్ప్రభావం కావచ్చు. అలాగే మధుమేహం ఎక్కువగా ఉన్నా కూడా ఈ సమస్య తలెత్తుతుంది. కాబట్టి వైద్యులను సంప్రతించి, ప్రత్యామ్నాయ మందులు వాడడం లేదా, కొంతకాలం పాటు మందుల ఆపడం చేయండి. ఆ తర్వాత వీర్యస్కలనం యధాతథంగా జరుగుతూ ఉంటే, భయపడవలసిన అవసరం లేదు. మధుమేహం నిర్ధారణ కోసం షుగర్ టెస్ట్ కూడా చేయించుకోండి.

డాక్టర్ రాహుల్ రెడ్డి, ఆండ్రాలజిస్ట్, ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.



వెనెజువెలా వ్యూహాల రాణి

దక్షిణ అమెరికా రాజకీయ యవనికపై ఇప్పుడు కొత్తశకం ప్రారంభమైంది. వెనెజువెలా అధ్యక్ష భవనం 'మిరాఫ్లోరెస్' గోడలు ఒక సరికొత్త చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిన్నటి వరకు తెరవెనక ఉండి చక్రం తిప్పిన డెల్సీ రోడ్రిగ్జ్ ఇప్పుడు దేశ పగ్గాలను తన చేతుల్లోకి తీసుకున్నారు. వ్యవస్థలపై పట్టు సాధించి, రాజకీయ వ్యూహాలతో అధికార పీఠాన్ని దక్కించుకున్న డెల్సీ ప్రస్థానం ఒక థ్రిల్లర్ సినిమాను తలపిస్తుంది.

న్యూస్‌మేకర్



డెల్సీ రోడ్రిగ్జ్.. ఇది ఒక పేరు మాత్రమే కాదు, నిశ్శబ్ద తుపాను. ఆమె తండ్రి జార్జ్ ఆంటోనియో రోడ్రిగ్జ్ వెనిజులాలో పేరున్న విప్లవనాయకుడు. ఆయన హత్యకు గురైనప్పుడు డెల్సీ చిన్నపిల్ల. ఆ చేదు జ్ఞాపకమే ఆమెను రాజకీయాలవైపు నడిపించింది. న్యాయశాస్త్రంలో పట్టాపొంది, పారిస్‌లో ఉన్నత చదువులు చదివిన డెల్సీ చట్టాలను ఎంతబాగా చదివారో, రాజకీయ వ్యూహాలను అంతకంటే బాగా వంటబట్టించుకున్నారు.

మదురోకు రక్షణ కవచం

వెనెజువెలా ఆర్థికంగా చితికిపోయినప్పుడు, ప్రపంచ దేశాలు ఆంక్షలు విధించినప్పుడు మదురో ప్రభుత్వానికి ఆమె కొండంత అండగా నిలిచారు. విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు రష్యా, చైనాలతో ఆమె జరిపిన రాయబారాలు దేశాన్ని గట్టెక్కించాయి. తాజాగా మదురోను అమెరికా అరెస్ట్ చేసినప్పుడు దేశంలో కల్లోలం చెలరేగుతుందని అందరూ అనుకున్నారు. కానీ డెల్సీ అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. సైన్యాన్ని తనవైపు తిప్పుకుని కొన్ని గంటల వ్యవధిలోనే పరిస్థితులను చక్కదిద్ది 'లీడర్'నని అనిపించుకున్నారు.

ట్రంప్ మద్దతూ ఆమెకే

వెనెజువెలాలోని చమురు నిల్వలు సురక్షితంగా ఉండాలన్నా, దేశంలో అంతర్యుద్ధం రాకుండా ఉండాలన్నా డెల్సీ వంటి గట్టి నాయకురాలు అవసరమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావించారు. ఈ అంతర్జాతీయ మద్దతు డెల్సీకి కొండంత బలాన్ని ఇచ్చింది. దీంతో డెల్సీకే అధ్యక్షపీఠం దక్కింది.

ప్రజల మనిషి మచాడో




వెనెజువెలా కథలో డెల్సీ ఒక ధృవమైతే, మరియా మచాడో మరో ధృవం. ప్రతిపక్ష నేత అయిన మచాడో అధ్యక్షురాలవుతారని భావిస్తున్న తరుణంలో ట్రంప్ డెల్సీ వైపు మొగ్గు చూపడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. 2012లో పార్లమెంటులో అప్పటి అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ను నేరుగా నిలదీసిన మచాడో ధైర్యాన్ని చూసి దేశం అవాక్కయింది. ఆ రోజు మొదలైన ఆమె పోరాటం నేటికీ ఆగలేదు. ప్రభుత్వం ఆమెపై దాడులు చేయించింది. ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకుంది. అయినప్పటికీ ఆమె దేశం విడిచి వెళ్లలేదు. ప్రజల మధ్యనే ఉంటూ పోరాడారు. ఈ అలుపెరుగని పట్టుదలే ఆమెకు 2025 నోబెల్ శాంతి బహుమతిని తెచ్చిపెట్టింది. అధికారం డెల్సీ చేతుల్లో ఉంటే మచాడో ప్రజల గుండెల్లో ఉన్నారు. ఒకరికి సైన్యం, అధికారం తోడుంటే, మరొకరికి ప్రజల నైతిక మద్దతు తోడుంది. ఈ ఇద్దరు మహిళల పోరాటం వెనెజువెలా చరిత్రలో ఒక అసాధారణ అధ్యాయం.

సెలెబ్ టాక్

సినీతారలు కఠినమైన ఆహార నియమాలు పాటిస్తారనీ, వ్యాయామాలతో శరీరాన్ని అందంగా మలుచుకుంటారనీ భావిస్తూ ఉంటాం. కానీ నిండైన ఆరోగ్యానికి ఆహార నియమాల్లో, వ్యాయామాల్లో పట్టువిడుపు ధోరణి అవలంబించాలని సూచిస్తోంది బాలీవుడ్ అగ్ర తార దీపికా పదుకొనె. ఇటీవల తన 40వ పుట్టినరోజును జరుపుకున్న సందర్భంగా దీపిక 40లో 20లా కనిపించేలా చేసే తన ఫిట్‌నెస్, డైట్ రహస్యాలను అభిమానులతో పంచుకుంది.

దీపిక... దేదీప్యంగా

"అందంగా కనిపించడానికి వ్యాయామం చేయను, ఫిట్‌గా ఉండడం కోసం వ్యాయామం చేస్తాను. నాకు గుర్తున్నంతవరకూ వ్యాయామం నా జీవనశైలిలో భాగంగా మారిపోయింది. వ్యాయామంలో భాగంగా పిలాటిస్, యోగా, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ సాధన చేస్తాను. ఎంత బిజీగా ఉన్నా, వ్యాయామం కోసం ఐదు నిమిషాల సమయాన్ని తప్పనిసరిగా కేటాయిస్తాను. గంటల తరబడి విమాన ప్రయాణ బడలికను వదిలించుకోడానికీ, లేదా విపరీతమైన ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని పొందడానికీ ఈ ఐదు నిమిషాల వ్యాయామం ఎంతో బాగా సహాయపడుతుంది. ఈ వ్యాయామంలో భాగంగా 'విపరీతకారిణి' యోగాసనాన్ని సాధన చేస్తాను" అంటూ తన వ్యాయామాల గురించి వివరించింది దీపిక. గెహరాయియా సినిమా కోసం దీపిక, యోగా శిక్షకురాలు, అనుష్క మీద ఆధారపడింది. ఆ సినిమాలో యోగా శిక్షకురాలిగా నటించిన దీపిక, చక్రాసనం, మాలాసనం మొదలైన పలు రకాల ఆసనాల్లో అద్భుతమైన సంతులనాన్ని ప్రదర్శించినట్టు ఆమెకు శిక్షణనిచ్చిన అనుష్క ఒక సందర్భంలో మీడియాకు వివరించింది.



పార్ట్‌నర్ వర్కవుట్స్

దీపిక, యోగాతో పాటు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కూడా సాధన చేస్తూ ఉంటుంది. తాళ్ల మీద వేలాడే రోప్ వ్యాయామాలు కూడా చేస్తూ ఉంటుంది. అత్యంత శ్రమతో కూడిన ఈ వ్యాయామం శరీర దారుఢ్యంతో పాటు నమ్యత, చురుకుదనాలను కూడా పెంచుతుందనీ, ఈ వ్యాయామంతో క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయనీ ఒక సందర్భంలో దీపిక వివరించింది. దీపిక వ్యాయామాల్లో పార్ట్‌నర్ వర్కవుట్స్ కూడా ఉంటాయి. సంయమనం కోసం, కోర్ స్ట్రెంగ్త్‌ను పెంచుకోవడం కోసం ఇలాంటి వ్యాయామాలు కూడా అవసరమని అంటున్న దీపిక, అనన్య పాండేతో కలిసి వైవిధ్యమైన ఏరోబిక్స్ సాధన చేసింది.

నచ్చినవి... మితంగానే...

దీపిక కచ్చితంగా భోజన ప్రియురాలే! క్రీమ్‌తో కూడిన ప్యాన్‌కేక్స్, వార్మ్ బ్రౌనీస్, కరకరలాడే సమోసాలు ఒక పట్టుపడుతున్న ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన దీపిక, నచ్చిన పదార్థాలను ఆస్వాదించడానికి వెనకడుగు వేయొద్దని అభిమానులను కోరింది. "నా ఫీడ్‌లో ఈ ఫొటోలు చూసి ఆశ్చర్యపోయారా? నిజం చెప్పాలంటే నేను నచ్చినవన్నీ తింటాను. కావాలంటే నా గురించి తెలిసినవాళ్లెవరినైనా అడగండి. నా గురించి ఎక్కడో విన్నవీ, చదివినవీ నమ్మకండి. మరి అన్నీ తింటూ ఇలా ఎలా ఉన్నారని అనుకుంటున్నారా? దీనికొక చిట్కా ఉంది. సమతుల్యత, స్థిరత్వం, శరీరం చెప్తున్నది వినడం... ఈ మూడు సూత్రాలు పాటించాలి. డైట్ అనే పదం చుట్టూరా పలురకాల అవాస్తవాలు, అపార్థాలు అలుముకుని ఉన్నాయి. సాధారణంగా మనం డైట్ అనగానే కడుపు మాడ్చుకోవడమేనని అనుకుంటాం. తక్కువ తినడంతో పాటు, మనకు నచ్చని పదార్థాలన్నిటినీ తినడమే డైట్ అయితే, అలాంటి డైట్ చేయకపోవడమే మంచిదన్నది నా ఉద్దేశం. ఒక వ్యక్తి తినే, తాగే ద్రవ, ఘన పదార్థాలన్నిటినీ కలిపి డైట్ అనాలి. నిజానికి డైట్ అనే పదం, డయాయిటా అనే గ్రీకు పదం నుంచి పుట్టింది. ఈ పదానికి, జీవన విధానం అని అర్థం. నాకు గుర్తున్నంతవరకూ, ఇప్పటివరకూ సంతులన ఆహారశైలినే అనుసరించాను. ఇదే నా జీవన విధానం. నిలకడగా పాటించలేని, తాత్కాలికంగా ప్రాచుర్యం పొందిన ఏ ఒక్క ఆహార నియమాన్నీ నేను పాటించలేదు. మరి నేను నచ్చినవన్నీ తినేస్తూ ఉంటానా? అంటే.. అవుననే అంటాను. కానీ అది నా జీవనవిధానం మాత్రం కాదు. తినాలని అనిపించినప్పుడు కోరికను కట్టడి చేసుకోకుండా, మితంగా తినడంలో తప్పు లేదు". అంటూ తన ఆహారశైలిని వివరిస్తోంది దీపిక.

నిద్ర - విశ్రాంతి

"వ్యాయామం చేసే వీలు దొరకని రోజు, సెలవు రోజు, కచ్చితంగా కంటి నిండా నిద్రపోతాను. నిద్రకూ, విశ్రాంతికీ సమయం కేటాయించడం వల్ల శరీరం సేద తీరి, శక్తిని పుంజుకుని తర్వాతి రోజుకు సరిపడా నూతనోత్తేజాన్ని పొందుతుంది" అంటూ ఎన్ని పనులున్నా, నిద్రకూ విశ్రాంతికీ సమయం కేటాయిస్తానని వివరిస్తోంది దీపిక.

ఓట్స్ తిందాం..!

అల్పాహారంగా ఓట్స్‌ను తీసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరగడంతోపాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.



- ఓట్స్‌లో పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను క్రమబద్ధీకరించి మలబద్ధకాన్ని నివారిస్తాయి. ఎప్పటికప్పుడు పేగులను శుభ్రం చేస్తాయి. కొద్దిగా తినగానే కడుపు నిండిన భావనను కలిగించి ఆకలిని తగ్గిస్తాయి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నియంత్రిస్తాయి. రక్తపోటును దరిచేరనివ్వవు.
- మహిళలు తరచూ ఓట్స్ తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన కాల్షియం లభిస్తుంది. మెనోపాజ్ తరువాత ఆస్టియోపోరోసిస్ సమస్యలు రావు.
- ఓట్స్‌లో ఉండే అమైనో యాసిడ్లు, ఇతర న్యూట్రియెంట్లు కలిసి శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో రాత్రిపూట హాయిగా నిద్ర పడుతుంది. ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయి.

మెడ నల్లగా ఉందా?

కొంతమందికి మెడ నల్లగా మారి ఇబ్బంది కలిగిస్తుంటుంది. చిన్న చిట్కాలతో దాన్ని సులువుగా పోగొట్టుకోవచ్చు.

- బయటికి వెళ్లేటప్పుడు ముఖం, చేతులతోపాటు మెడకు కూడా సన్‌స్క్రీన్‌ను అప్లయ్ చేయడం మంచిది.
- రాత్రి పడుకునే ముందు మెడకు కొద్దిగా అలోవెరా జెల్ రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



- చిన్న గిన్నెలో చెంచా యాపిల్ సైడర్ వెనిగర్, చెంచా నీళ్లు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడకు పట్టించి పావు గంట తరువాత శుభ్రం చేసుకోవాలి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బాదం నూనె లేదా కొబ్బరి నూనెను తీసుకుని కొద్దిగా వేడిచేసి దానితో మెడభాగంలో సున్నితంగా మర్దన చేయాలి. ఇలా రోజూ చేస్తుంటే పది రోజుల్లో మెడ నలుపు విరుగుతుంది.

భవిష్యత్తుకు చేయూత

"ఆదుకోవడం అంటే దానం చేయడం కాదు... బతికే దారి చూపించడం" అంటారు డాక్టర్ కల్పనా శంకర్. వెట్టి చాకిరితో బాల్యాన్ని, భవిష్యత్తును కోల్పోతున్న పిల్లల కోసం ఈ సైంటిస్ట్ ఇరవయ్యేళ్ల క్రితం ప్రారంభించిన సంస్థ... విదేశాల్లోనూ లక్షలాది ప్రజల జీవితాల్లో మార్పుకి దోహదం చేస్తోంది. ఆ కథ డాక్టర్ కల్పన మాటల్లోనే...



"నేను మద్రాస్ యూనివర్సిటీలో న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేశాక... క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఉద్యోగం వచ్చింది. నా భర్త జిల్లా కలెక్టర్. ఎలాంటి లోటూ లేని జీవితం. కానీ ఉద్యోగం విషయంలో ఏదో వెలితి. దాంతో మహిళా అభివృద్ధి సంస్థకు మారాను. తరువాత ప్రపంచ బ్యాంక్ దారిద్ర్య నిర్మూలన ప్రాజెక్ట్‌లో చేరాను. ఆ సమయంలో కాంచీపురంలో మేము చేపట్టిన ఒక అధ్యయనం నన్ను కొత్త మార్గంలోకి నడిపించింది. పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన కాంచీపురంలో 60 వేలకు పైగా మగ్గాలు, 45 వేలమంది చేనేత కళాకారులు ఉన్నారు. చీరలకు ఉపయోగించే జరీ, పట్టుదారం వడికే పనిలో ఎక్కువమంది పిల్లలే. వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లేకపోవడంతో... పిల్లల్ని పనికి పంపిస్తున్నారు. పిల్లలతో, వారి కుటుంబాలతో మాట్లాడినప్పుడు ఎన్నో విషయాలు తెలిశాయి. అదే సమయంలో... ఆ పిల్లల కోసం ఏదైనా చేయాలనుకుంటున్న స్వీడన్‌కు చెందిన పెర్సీ బార్నెవిక్ కలిశారు. 2002లో కాంచీపురంలో మా కార్యక్రమాలను ప్రారంభించాం. ఆ తరువాత 2004లో 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశాం.

బహుముఖ వ్యూహంతో...

తొలి రోజుల్లో పిల్లలకోసం సాయంత్రం బడులు నిర్వహించాం. వారికి చాకిరీ నుంచి విముక్తి కలిగించాలంటే... వారి కుటుంబాలు వారి సంపాదనమీద ఆధారపడకూడదు. దీనికోసం కుటుంబాలకు స్థిరమైన ఆదాయం కల్పించడానికి స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశాం. మైక్రో ఫైనాన్స్ ద్వారా పెట్టుబడులు సమకూర్చాం. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, వ్యర్థాల నిర్వహణ, సహజవనరుల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి పనులు.. ఇలా ఎన్నో చేపట్టాం. మహిళా సాధికారత, ఉద్యోగాల సృష్టి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వారికి విద్యా కల్పన, ఆరోగ్య సేవల అందుబాటు, పర్యావరణ పరిరక్షణలను ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నాం. గత ఇరవయ్యేళ్లలో మా 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' దేశంలోని 20 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు ఎనిమిది దేశాలకు విస్తరించింది. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారకతల కోసం మేము రూపొందించిన నమూనాను ఆఫ్ఘనిస్తాన్, కెన్యా, శ్రీలంక, బ్రెజిల్, కంబోడియా, మయన్మార్ దేశాలు అనుసరిస్తున్నాయి.



కలలా ఉంది...

మా సంస్థ ద్వారా ఇప్పటివరకూ ఆరు లక్షలకు పైగా స్వయంసహాయక బృందాలను ఏర్పాటు చేశాం. దాదాపు నాలుగు లక్షల మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాం. 545 గ్రామాల రూపురేఖలు మార్చాం. కిరాణా, టైలరింగ్, ఆహార విక్రయం, మొబైల్ రిపేరింగ్... ఇలా కుటుంబాలే నిర్వహించుకొనే వ్యాపారాలు లక్షల సంఖ్యలో ఏర్పాటు చేయించాం. పదిహేడున్నర వేలకు పైగా మహిళా పారిశ్రామికవేత్తలను సృష్టించాం. 15 లక్షల మందికి పైగా మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా కోటి మందికి పైగా మహిళలు, పిల్లలు మా సంస్థ ద్వారా ప్రయోజనం పొందారు. 'బెల్‌స్టార్ మైక్రో ఫైనాన్స్' అనే సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా నేను వ్యవహరిస్తున్నాను. కాంచీపురంలో సాధారణంగా మొదలైన నా సేవా ప్రస్థానం... ఇరవయ్యేళ్ళకు పైగా కొనసాగుతూ ఉండడం, రాష్ట్రపతుల చేతుల మీదుగా 'నారీశక్తి', 'బాల కళ్యాణ పురస్కార్'తో సహా దేశవిదేశాల్లో పలు ప్రతిష్ఠాత్మ సంస్థల నుంచి అవార్డులు, ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందడం కలలా ఉంది. కొందరికైనా స్ఫూర్తినిస్తుందనే ఆలోచనతో 'ది సైంటిస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్' అనే పేరుతో నా జీవితంపై పుస్తకం రాశాను."

ముత్యాల ముగ్గు



15 చుక్కలు 8 వచ్చే వరకు సందుచుక్క



బొడ్డేడ సూర్యప్రభ
సింహాచలం

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

స్పోర్ట్స్

గుంటూరు ● గురువారం 8 జనవరి 2026

సింధు, సాత్విక్ జోడీ శుభారంభం

మలేసియా ఓపెన్



కౌలాలంపూర్ : గాయంతో కొంతకాలంగా పోటీలకు దూరంగా ఉన్న ఏస్ షట్లర్ పీవీ సింధు తాజా సీజన్‌ను విజయంతో ప్రారంభించింది. సింధుతోపాటు స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ కూడా మలేసియా ఓపెన్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-14, 22-20తో తైపీకి చెందిన సుంగ్ షు యున్‌పై గెలుపొందింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ 21-13, ద్వయం 21-15తో యాంగ్/లీ (తైపీ) జంటపై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జోడీ 9-21, 23-21, 19-21తో ఫెబ్రీనా/మెలీసా (ఇండోనేసియా) ద్వయం చేతిలో పోరాడి ఓడి నిష్క్రమించింది. అలాగే రుతుపర్ణ/ శ్వేత పర్ణ జంట కూడా పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ రుత్వికా శివానీ/రోహన్ కపూర్, ధ్రువ్ కపిల/తనీషా, అమృత/సూర్య జోడీలు కూడా మొదటి రౌండ్‌లో ఓడిపోయారు.

విజేత ప్రణీత్

రోక్వెటాస్ చెస్



అల్మేరియా (స్పెయిన్): రోక్వెటాస్ చెస్ ఫెస్టివల్ టైటిల్‌ను హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ ఉప్పాల ప్రణీత్ కైవసం చేసుకున్నాడు. మొత్తం 151 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రణీత్ 7.5 పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుని విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్లలో ప్రణీత్ ఏడు విజయాలు, ఒక డ్రా, మరో పరాజయంతో ముగించాడు. మారిన్ పెరాగౌట్ (స్పెయిన్) రన్నరప్, కుకోరోవ్స్కీ ఫిలిప్ (పోలెండ్) తృతీయ స్థానాల్లో నిలిచారు. మరో తెలుగు జీఎం రాజా రిత్విక్‌కు 10వ స్థానం దక్కింది.

అల్టిమేటమ్ వార్తలు అబద్ధం

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు

ఢాకా: టీ20 వరల్డ్‌కప్ భారత్‌లో ఆడి తీరాల్సిందేనంటూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తమకు అల్టిమేటమ్ జారీచేసిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. బంగ్లా జట్టు భద్రత అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఐసీసీ తమకు హామీ ఇచ్చిందని పేర్కొంది. టీ20 ప్రపంచ కప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక వేదికలుగా జరగనుంది. నిర్ణీత షెడ్యూల్ మేరకే టోర్నమెంట్ జరుగుతుందని, ఒకవేళ భారత్‌లో ఆడలేకపోతే ఆ మ్యాచ్‌లను బంగ్లాదేశ్ వదులుకోవాలని ఐసీసీ తమను హెచ్చరించినట్టు వస్తున్న వార్తలు నిరాధారమని బీసీబీ తెలిపింది. 'టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ పూర్తి స్థాయిలో పాల్గొనేందుకు చర్యలు తీసుకుంటామని ఐసీసీ తెలియజేసింది' అని వెల్లడించింది. భారత్‌లో తాము ఆడే పరిస్థితులు లేవని ఐసీసీకి వివరించామని బీసీసీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్, క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్ తెలిపారు. తమ వివరణను ఐసీసీ అర్థం చేసుకొంటుందని భావిస్తున్నామన్నారు.



క్వార్టర్స్‌లో నిఖత్

న్యూఢిల్లీ: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. బుధవారం గ్రేటర్ నోయిడాలోని గౌతమ బుద్ధ విశ్వవిద్యాలయంలో జరిగిన 48-51 కిలోల విభాగం ప్రీక్వార్టర్స్‌లో లద్దాఖ్‌కు చెందిన కుల్సోమ బానోపై నిఖత్ ఏకపక్ష విజయం సాధించింది. తొలి రౌండ్‌లోనే నిఖత్ పంచ్‌ల దాటికి ప్రత్యర్థి బానో తట్టుకోలేకపోవడంతో రెఫరీ బౌట్‌ను నిలిపివేసి విజేతగా ప్రకటించాడు. ఇతర విభాగాల్లో 50-55 కిలోల కేటగిరీలో పవన్, 70-75 కిలోల విభాగంలో సుమిత్ కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. వరల్డ్ చాంపియన్ మీనాక్షి (45-48 కిలోలు), కామన్వెల్త్ మెడలిస్ట్ అమిత్ పంఘల్ (52 కిలోలు) కూడా ముందంజ వేశారు.

మార్చిలో అర్జున్ టెండూల్కర్ పెళ్లి?



న్యూఢిల్లీ: దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ పెళ్లి ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. ప్రముఖ పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనుమరాలు సానియా చందోక్‌తో అర్జున్ నిశ్చితార్థం గతేడాది ఆగస్టులో జరిగింది. ఈ ఏడాది మార్చి నెల 3 నుంచి 5 వరకు మూడు రోజులపాటు వివాహ వేడుకలు జరగనున్నట్టు సమాచారం. వేదిక ఎక్కడన్నది మాత్రం తెలియరాలేదు.

వైభవ్, ఆరోన్ శతకమోత

3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

● యువ భారత్ ఘన విజయం ● మూడో వన్డేలోనూ దక్షిణాఫ్రికా చిత్తు



వైభవ్ (127)

యూత్ వన్డేల్లో సెంచరీ సాధించిన పిన్న వయసు కెప్టెన్‌గా 14 ఏళ్ల వైభవ్ ప్రపంచ రికార్డు సృష్టించాడు

బెనోని: సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీ (74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సలతో 127), ఆరోన్ జార్జ్ (106 బంతుల్లో 16 ఫోర్లతో 118) శతకాలతో మోతెక్కించడంతో.. దక్షిణాఫ్రికా అండర్-19తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను యువ భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన మూడో, ఆఖరి మ్యాచ్‌లో భారత్ 233 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 393/7 స్కోరు చేసింది. ఎన్‌టాన్‌డన్ సోనీ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో సౌతాఫ్రికా 35 ఓవర్లలో 160 పరుగులకే కుప్పకూలింది. పేసర్ కిషన్ సింగ్ (3/15) దెబ్బకు.. 50/5తో టాపార్డర్‌ను కోల్పోయిన దక్షిణాఫ్రికా ఏదశలోనూ ఛేదించే విధంగా కనిపించలేదు. డేనియల్ బోస్‌మన్ (40), పాల్ జేమ్స్ (41), కోర్నీ బోతా (36 నాటౌట్) కొంతసేపు పోరాడారు.

చెలరేగిన వైభవ్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ఆరోన్, కెప్టెన్ వైభవ్ అదిరే ఆరంభాన్నిచ్చారు. సూర్యవంశీ ఎడాపెడా షాట్లతో విరుచుకుపడగా.. మరో ఎండ్‌లో జార్జ్ సమన్వయంతో ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. ఈ క్రమంలో ఇద్దరూ శతకాలు పూర్తి చేశారు. అయితే, 26వ ఓవర్‌లో వైభవ్‌ను సోనీ అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 227 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆరోన్‌ను రౌల్స్ పెవిలియన్ చేర్చాడు. వేదాంత్ త్రివేది (34), అభిజ్ఞాన్ కుండూ (21), మహ్మద్ ఎనాన్ (28 నాటౌట్), హనిల్ పటేల్ (19 నాటౌట్)లు టీమ్ స్కోరును 400కు చేరువ చేశారు.

సెంచరీలే సెంచరీలు

చిచ్చరపిడుగు వైభవ్ పరుగుల వరద పారిస్తున్నాడు. క్రమం తప్పకుండా భారీ స్కోర్లు సాధిస్తూ సెలెక్టర్ల దృష్టిని తనవైపు తిప్పుకొంటున్నాడు. మూడు ఫార్మాట్లలో కలిపి అతడు ఇప్పటికి 9 శతకాలు బాదాడు. యూత్ టెస్ట్‌ల్లో రెండు, యూత్ వన్డేల్లో మూడు సెంచరీలు నమోదు చేశాడు. గతేడాది ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై శతకం సాధించాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 393/7 (వైభవ్ 127, ఆరోన్ 118; సోనీ 3/61, రౌల్స్ 2/59); **దక్షిణాఫ్రికా:** 35 ఓవర్లలో 160 ఆలౌట్ (జేమ్స్ 41, బోస్‌మన్ 40; కిషన్ 3/15, ఎనాన్ 2/36).

బెతెల్ బాదినా...

కష్టాల్లో ఇంగ్లండ్.. రెండో ఇన్నింగ్స్ 302/8



బెతెల్ (142 బ్యాటింగ్)

సిడ్నీ : ఊహించినట్టుగానే యాషెస్ ఐదో టెస్ట్ ఐదో రోజుకు చేరింది. జాకబ్ బెతెల్ (142 బ్యాటింగ్) తొలి టెస్ట్ శతకం సాధించడంతో..ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆఖరికి 302/8 స్కోరు చేసింది. దాంతో 183 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటును పూడ్చుకున్న పర్యాటక జట్టు కేవలం 119 పరుగుల ఆధిక్యంలో నిలిచి కష్టాల్లో పడింది. పార్ట్‌టైమ్ స్పిన్నర్ బ్యూ వెబ్‌స్టర్ మూడు, బోలాండ్ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్ నైట్ 518/7 స్కోరుతో బుధవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 567 పరుగులకు ఆలౌటైంది. లోయరార్డర్ బ్యాటర్ బ్యూ వెబ్‌స్టర్ (71 నాటౌట్) హాఫ్ సెంచరీ చేశాడు. టంగ్, కార్స్ చెరో మూడు, స్టోక్స్ రెండు వికెట్లు తీశారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులు సాధించింది.

ఆనంద్ హవా

టాటా స్టీల్ చెస్



కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో వెటరన్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ అదరగొడుతున్నాడు. బుధవారం కోల్‌కతాలో ప్రారంభమైన ఈ పోటీల్లో ఆనంద్ రెండు రౌండ్లలో నెగ్గి, ఒక రౌండ్ డ్రా చేసుకున్నాడు. తొలి రౌండ్‌లో అమెరికా జీఎం వెస్లీపై నెగ్గగా, రెండో రౌండ్‌లో చైనా జీఎం వీ యితో గేమ్‌ను ఆనంద్ డ్రా చేసుకున్నాడు. మూడో రౌండ్‌లో భారత జీఎం అరవింద్ చిదంబరంపై గెలిచిన ఆనంద్ 2.5 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తెలుగు జీఎం ఇరిగేసి అర్జున్ ఆడిన మూడు రౌండ్లలో ఒక రౌండ్‌లో గెలిచి, రెండింట్లో ఓడి నిరాశపర్చాడు. తొలి గేమ్‌లో విదిత్ గుజరాతి, రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద చేతిలో ఓడిన అర్జున్, మూడో గేమ్‌లో నిహాల్‌పై నెగ్గి, ఒక పాయింట్‌తో ఎనిమిదో స్థానంలో ఉన్నాడు.

న్యూజిలాండ్ వరల్డ్‌కప్ జట్టులో డఫీ

వెల్లింగ్టన్: పేసర్ జాకబ్ డఫీకి న్యూజిలాండ్ టీ20 వరల్డ్‌కప్ టీమ్‌లో తొలిసారి చోటుదక్కింది. మిచెల్ శాంట్నర్ నేతృత్వంలోని 15 మంది సభ్యుల బృందాన్ని బుధవారం ప్రకటించారు. డఫీతోపాటు హెన్రీ, ఫెర్గూసన్, మిల్నే, నీషమ్ పేస్ భారాన్ని మోయనున్నారు. ఆల్‌రౌండర్లు బ్రేస్‌వెల్, ఫిలిప్స్, రచిన్ జట్టుకు అదనపు బలం.

జట్టు: మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మిచెల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారెల్ మిచెల్, ఆడమ్ మిల్నే, నీషమ్, ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, సీఫెర్ట్ (వికెట్ కీపర్), ఇష్ సోధీ.

తొలి టీ20లో పాక్ గెలుపు

దంబుల్లా : శ్రీలంకతో బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆరు వికెట్లతో నెగ్గింది. తొలుత శ్రీలంక 19.2 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో 16.4 ఓవర్లలో 129/4 స్కోరు చేసి పాకిస్థాన్ గెలుపొందింది.

జట్టు మారింది.. వ్యథ తీరేనా?

యూపీ వారియర్స్

మహిళల ప్రీమియర్ లీగ్ రేపటి నుంచే



దీప్తి శర్మ

కెప్టెన్ లానింగ్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అత్యంత పేలవ ప్రదర్శనతో యూపీ వారియర్స్ నిరాశపరుస్తోంది. గతేడాది దీప్తి శర్మ నేతృత్వంలో బరిలోకి దిగిన ఈ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. దీంతో ఈసారి దేశవాళీ యువ క్రికెటర్ శ్వేతా సెహ్రావత్ మినహా అందరినీ వేలంలోకి వదిలేసింది. ఏకంగా రూ.14.5 కోట్ల పర్స్‌తో వేలంలోకి అడుగుపెట్టిన యూపీ తమ జట్టును పవర్ హిట్టర్లు, ఆల్‌రౌండర్లు, అనుభవజ్ఞులైన బౌలర్లతో పునర్ నిర్మించుకుంది. ఇక మెగ్ లానింగ్‌ను కొనుగోలు చేసి జట్టు పగ్గాలు అప్పజెప్పడం కీలక మలుపుగా చెప్పవచ్చు. అంతేకాకుండా మాజీ కెప్టెన్ దీప్తి శర్మను అత్యధికంగా రూ.3.20 కోట్లు వెచ్చించి ఆర్‌టీఎం ద్వారా తిరిగి దక్కించుకుంది.

లానింగ్ కెప్టెన్సీ బలంతో..: మెగ్ లానింగ్ గత మూడు పర్యాయాలు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా జట్టును ఫైనల్స్‌కు చేర్చగలిగింది. ఇక దీప్తి శర్మ తన స్థాయికి తగ్గ ఆటతీరు కనబరిస్తే జట్టుకు తిరుగుండదు. దీనికి తోడు సోఫీ ఎకెల్‌స్టోన్, ఆశా శోభన, దీప్తిలతో కూడిన స్పిన్ విభాగం వడోదర పిచ్‌పై ఇబ్బంది పెట్టగలదు. ఓపెనర్ కిరణ్ నవ్‌గిరె, హర్లీన్, డాటిన్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు.

పేస్‌లో ఇబ్బంది: యూపీ జట్టులో నైపుణ్యం కలిగిన స్పిన్నర్లకు కొదవ లేకపోయినా.. పేస్ విభాగం కాస్త బలహీనంగా కనిపిస్తోంది. పేసర్ క్రాంతి గౌడ్‌పై అధికంగా ఆధారపడనుంది. ఇక పేస్ ఆల్‌రౌండర్ డియాండ్రా డాటిన్‌పై మధ్య ఓవర్లలో ఆశలు పెట్టుకుంది. ఓపెనర్ ప్రతీక గాయంతో బాధపడుతోంది.

జట్టు: స్వదేశీ: దీప్తి శర్మ, కిరణ్, క్రాంతి గౌడ్, సిమ్రన్, శ్వేత సెహ్రావత్, ఆశా శోభన, హర్లీన్, ప్రతీకా రావల్, శిఖా పాండే, శిప్రా గిరి, సుమన్ మీనా, జి. త్రిష.

విదేశీ: మెగ్ లానింగ్, లిచ్‌ఫీల్డ్, చార్లి నాట్, క్లో ట్రియోన్, డాటిన్, ఎకెల్‌స్టోన్.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

బిజినెస్




బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,38,270 ▼	1,26,750 ▼	2,83,000 ▲
విజయవాడ	1,40,500 ▼	1,29,000 ▲	2,52,000 ▲
విశాఖపట్నం	1,40,497 ▼	1,26,750 ▼	2,77,000 ▲
రాజమండ్రి	1,38,270 ▼	1,26,750 ▼	2,52,000 ▲
ప్రొద్దుటూరు	1,41,100 ▼	1,22,810 ▼	2,52,000 ▲
ముంబై	1,36,680 ▲	1,25,190 ▲	2,48,000 ▲

ఈ ఏడాది జీడీపీ వృద్ధి 7.4%

2025-26పై కేంద్ర ప్రభుత్వం ముందస్తు అంచనా



న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతానికి ఎగబాకవచ్చని కేంద్రప్రభుత్వం అంచనా వేసింది. వృద్ధిరేటు 7.3 శాతంగా నమోదు కావచ్చన్న ఆర్‌బీఐ అంచనాల కంటే ఇది అధికం. తయారీ, సేవల రంగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడవచ్చని కేంద్ర గణాంకాల శాఖ బుధవారం విడుదల చేసిన ప్రథమ ముందస్తు అంచనాల్లో తెలిపింది. తద్వారా భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థల్లో తన అగ్రస్థానాన్ని కొనసాగించనుంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ) 7.3 శాతంగా నమోదు కావచ్చు. తయారీ, నిర్మాణ రంగాలు 7% చొప్పున వృద్ధి చెందవచ్చని అంచనా. సేవల రంగం జీవీఏ 9.1% వృద్ధి చెందవచ్చని మంత్రిత్వ శాఖ నివేదిక పేర్కొంది. మనకు ప్రధాన పోటీ దేశమైన చైనా 2025లో 4.9%, 2026లో 4.4% వృద్ధిని నమోదు చేయవచ్చని ప్రపంచబ్యాంక్ ఈ మధ్యనే అంచనా వేసింది.

వ్యవసాయం డీలా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, సంబంధిత రంగాల జీవీఏ 3.1 శాతానికి తగ్గనుందని.. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవల రంగాల్లోనూ పరిమిత వృద్ధి నమోదు కావచ్చని కేంద్రం అభిప్రాయపడింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ లేదా నామినల్ జీడీపీ వృద్ధి రేటు 8% ఉండవచ్చని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) బడ్జెట్ రూపకల్పనలో కేంద్రం ఈ గణాంకాలను ఉపయోగించుకోనుంది. వచ్చేనెల 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

రూ.200 లక్షల కోట్లకు జీడీపీ

ఈ ఆర్థిక సంవత్సరంలో వాస్తవిక జీడీపీ లేదా స్థిర ధరల ఆధారిత జీడీపీ రూ.201.90 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ఆ శాఖ అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరపు ప్రాథమిక జీడీపీ అంచనా రూ.187.97 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 7.4% అధికం. కాగా, 2024-25లో రూ.330.68 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న జీడీపీ..2025-26లో 8% వృద్ధితో రూ.357.14 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాత్రం కేంద్రం నామినల్ జీడీపీ వృద్ధిని 10.1 శాతంగా అంచనా వేసింది. అమెరికా కరెన్సీలో ఈసారి మన జీడీపీ (డాలర్‌కు రూ.90 చొప్పున) 3.97 లక్షల కోట్ల డాలర్లుగా నమోదయ్యే అవకాశం ఉంది.

2026-27లో 6.8% వృద్ధి: గోల్డ్‌మన్ శాక్స్

రాబోయే ఆర్థిక సంవత్సరంలో మాత్రం భారత జీడీపీ వృద్ధిరేటు 6.8 శాతానికి పరిమితం కావచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. అలాగే, ఈ ఏడాదిలో ధరల సూచీలు మళ్లీ ఎగబాకవచ్చని, దాంతో ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను తగ్గించేందుకు అవకాశాలు సన్నగిల్లవచ్చని పేర్కొంది. ఈ ఏడాది లో ద్రవ్యోల్బణం సగటు 3.9 శాతానికి పెరగవచ్చని అంచనా వేసింది.

ఆర్థిక జోరు కొనసాగుతుంది..

ఈ ఏడాది కూడా ఆర్థిక వృద్ధి జోరు కొనసాగనుంది. భారత్‌పై అమెరికా సుంకాల ప్రభావం గతంలో అంచనా వేసిన దానికంటే కూడా తక్కువే. దేశీయంగా అధిక వినియోగం, ప్రభుత్వ మూలధన వ్యయం వంటి సానుకూల అంశాలతో వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ జీడీపీ వృద్ధి రేటు 6.5-7% శ్రేణిలో నమోదు కావచ్చు. ఈ ఏడాది దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ), విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ) పెరిగి రూపాయి బలోపేతానికి దోహదపడనున్నాయి. ప్రస్తుతం భారత్ గోల్డిలాక్స్ (అధిక వృద్ధి, కనిష్ఠ ద్రవ్యోల్బణ స్థితి) దశలో ఉంది. వచ్చే రెండేళ్లపాటు ఇది కొనసాగనుంది.

- ఎస్ మహేంద్ర దేవ్, పీఎంఈఏసీ చైర్మన్

దిగుమతులు తగ్గి.. ఎగుమతులు పెరగాలి

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే భారత్ దిగుమతులను తగ్గించుకోవడంతోపాటు ఎగుమతులను మరింతగా పెంచుకోవాల్సి ఉంటుంది. పంట వ్యర్థాలను విలువైన జాతీయ వనరుగా మార్చుకోవడం ద్వారా కాలుష్యంతోపాటు ముడిచమురు దిగుమతులను భారీగా తగ్గించుకోవచ్చు.

- నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి



ఇండిగో చేతికి తొలి ఎయిర్‌బస్ ఏ321 ఎక్స్‌ఎల్ఆర్ విమానం

న్యూఢిల్లీ: దేశంలో అగ్రగామి విమానయాన సంస్థ ఇండిగో తొలి ఎయిర్‌బస్ ఏ 321 ఎక్స్‌ఎల్ఆర్ విమానాన్ని అందుకుంది. మన దేశానికి వచ్చిన తొలి ఎయిర్‌బస్ ఏ 321 ఎక్స్‌ఎల్ఆర్ విమానం ఇది. ఇండిగో ప్రతినిధులు ఈ విమానాన్ని బుధవారం ఢిల్లీ విమానాశ్రయంలో అందుకున్నారు. ఈ నెల చివరిలో ఢిల్లీ, ముంబై నగరాల నుంచి ఏథెన్స్‌కు నడిచే నాన్ స్టాప్ సర్వీస్‌లో ఈ విమానం ప్రవేశపెట్టనున్నట్టు ఇండిగో ప్రకటించింది. ఇలాంటి 40 విమానాలకు ఇండిగో ఆర్డర్ ఇవ్వగా 9 విమానాలు ఈ ఏడాది అందుబాటులోకి రానున్నాయి.

ఎంఎస్ఎంఈలకు రుణాలు పెంచాలి..

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణ లభ్యతను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని పారిశ్రామిక మండలి పీహెచ్‌డీసీసీఐ కేంద్రానికి సూచించింది. ఎంఎస్ఎంఈల కోసం వడ్డీ రాయితీ పథకాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని, ముద్ర రుణాల పరిమితిని కూడా పెంచాలని కోరింది.

అనిల్ అగర్వాల్ కుమారుడు మృతి

న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్ పెద్ద కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ గుండెపోటుతో మరణించారు. ఆయన వయసు 49 సంవత్సరాలు. వేదాంత గ్రూప్ కంపెనీ తల్వాండి సాబూ పవర్ లిమిటెడ్ బోర్డు సభ్యుడుగా ఉన్న ఆయన ఇటీవల స్కైయింగ్ ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న దశలో గుండెపోటుకు గురైనట్టు సమాచారం. అనిల్ అగర్వాల్‌కు అగ్నివేశ్‌తో పాటు ప్రియా అనే కుమార్తె కూడా ఉన్నారు. ఆమె హిందుస్థాన్ జింక్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు.

ఏపీ రైతులకు ఏఐ ఆధారిత సలహాలు

విజయవాడ/గుంటూరు: సిస్కో మద్దతుతో దేశంలోని చిన్నకారు రైతులకు టెక్నాలజీ, డేటా సేవలందించే డిజిటల్ గ్రీన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన శాఖ భాగస్వామ్యంలో ఏఐ ఆధారిత వాతావరణ సలహాలు అందించనుంది. దీని వల్ల సకాలంలో, సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా రైతులు ఆదాయాలు పెంచుకోగలుగుతారు. దీన్ని ఉద్యానవన, పట్టుపురుగుల పెంపకం శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 50 వేల మంది (25 వేల మందికి ప్రత్యక్షంగాను, మరో 25 వేల మందికి డిజిటల్ చానళ్ల ద్వారాను) మద్దతు ఇవ్వాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందులో భాగంగా ఫార్మర్ చాట్ అప్లికేషన్ వినియోగించడంలో రైతులకు శిక్షణ కూడా ఇస్తారు.

భారతీయులకు నగలూ కీలక ఆస్తే: డెలాయిట్

న్యూఢిల్లీ: దేశంలో బంగారం, ఆభరణాల కొనుగోళ్ల స్వరూపం మారుతోంది. గతంలో ఏదైనా పండగలు, పబ్బాల సమయంలో అలంకరణలు లేదా తమ ఆర్థిక స్థాయి చూపించుకునేందుకు మాత్రమే వీటిని ఎక్కువగా కొనుగోలు చేసేవారు. ఇపుడు ఆస్తుల కల్పనలో భాగంగా కూడా వీటిని కొనుగోలు చేస్తున్నట్టు డెలాయిట్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుతం నూటికి 86 మంది ఆస్తుల కల్పనకు బంగారం, ఆభరణాలు కొనుగోలు ఉత్తమం అని భావిస్తున్నట్టు పేర్కొంది. ఇది దాదాపు షేర్లు, మ్యూచువల్ ఫండ్ యూనిట్ల కొనుగోళ్లకు సమానం. వీటిని కొనేవారిలోనూ నూటికి 87 మంది ఆస్తుల కల్పన కోసమే కొంటున్నారు.

డిసెంబరు కల్లా సెన్సెక్స్ 1.07 లక్షలు

న్యూఢిల్లీ: ఈ ఏడాది డిసెంబరు చివరికల్లా సెన్సెక్స్ 1.07 లక్షల పాయింట్లకు చేరుకుంటుందని అంతర్జాతీయ బ్రోకరేజి సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ప్రస్తుత స్థాయితో పోలిస్తే ఇది దాదాపు 25% అదనం. ఏడు శాతానికి పైగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు, వాల్యుయేషన్ల మెరుగుదల ఇందుకు దోహదం చేస్తాయని తెలిపింది. ఈ సంవత్సరం ఫైనాన్సియల్, వినియోగ వస్తువుల కంపెనీల షేర్లు బాగా రాణించే అవకాశం ఉందని పేర్కొంది. వడ్డీరేట్లు, సీఆర్ఆర్ కోత, నిధుల లభ్యత, జీఎస్‌టీ రూపంలో దాదాపు రూ.1.5 లక్షల కోట్ల భారం తగ్గడం కంపెనీల అమ్మకాలతో పాటు లాభాలనూ పెంచుతాయని అంచనా వేసింది.

మూడో రోజూ మార్కెట్‌కు నష్టాలే

స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 102.20 పాయింట్ల నష్టంతో 84,961.14 వద్ద, నిఫ్టీ 37.95 పాయింట్ల నష్టంతో 26,140.75 వద్ద ముగిశాయి. భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న అనిశ్చితి, ఎఫ్‌పీఐ అమ్మకాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అయితే బ్యారెల్ ముడి చమురు ధర 60.21 డాలర్లకు రావడం, బ్లూచిప్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు సూచీలను ఇంట్రా డే కనిష్ఠ స్థాయిల నుంచి బయటపడేశాయి. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు రాబోయే బడ్జెట్ వరకు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని భావిస్తున్నారు.

వెండి దిగుమతుల విధానం మారాలి

ఈ విషయంలో చైనా విధానమే బేష్: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ: మన దేశ వెండి దిగుమతుల విధానం మారాలని నిపుణులు కోరుతున్నారు. నేరుగా శుద్ధి చేసిన వెండికి బదులు, వెండి ఖనిజాన్ని దిగుమతి చేసుకుని శుద్ధి చేసి, దాన్ని వివిధ ఉత్పత్తుల రూపంలో ఎగుమతి చేయడంపై దృష్టి పెట్టాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (జీటీఆర్ఐ) సూచించింది. చైనా ఇప్పటికే ఇలాంటి విధానాన్ని అనుసరిస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు 630 కోట్ల డాలర్ల విలువైన వెండి ఖనిజాన్ని దిగుమతి చేసుకుంటే అందులో చైనా వాటానే 560 కోట్ల డాలర్ల వరకు ఉందని తెలిపింది. చైనా ఈ ఖనిజాన్ని శుద్ధి చేసి వెండిగా మార్చి ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, సోలార్ ప్యానెళ్ల తయారీలో ప్రధాన ముడి సరుకుగా మార్చి పెద్ద ఎత్తున విలువ జోడిస్తోందని పేర్కొంది. వెండి పారిశ్రామిక, ఇంధన రంగాల్లో కీలక ముడి వస్తువుగా మారిన ప్రస్తుత నేపథ్యంలో భారత్ తన వెండి దిగుమతి విధానాన్ని మార్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని జీటీఆర్ఐ తెలిపింది. విదేశాల్లో వెండి ఖనిజ నిక్షేపాలున్న గనులు సంపాదించడం, దేశంలో వెండి ఖనిజ శుద్ధి, పాత వెండి వస్తువుల రీసైక్లింగ్ సామర్థ్యాలు పెంచుకోవడం ద్వారా దిగుమతులపై అధిక ఆధారనీయతను తగ్గించుకోవచ్చని తెలిపింది. లేకపోతే ముందు ముందు తిప్పలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి చైనా వెండి ఎగుమతుల కోసం ప్రవేశపెట్టిన లైసెన్సింగ్ విధానం వెండి సరఫరాను మరింత నియంత్రించే అవకాశం ఉందని తెలిపింది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	610
వరంగల్	582	గోదావరి	585
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	152
వరంగల్	156	గుంటూరు	157
కరీంనగర్	156	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	153
కర్నూలు	156	నెల్లూరు	158
విశాఖపట్నం	143	అనంతపురం	158
గోదావరి	152		

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తున్నారు

- ప్రభుత్వ ప్రకటనల్లో అధికార పార్టీ నేతల ఫొటోలపై పిల్
- శిక్షించే పరిధి మాకు లేదు.. సుప్రీంకు వెళ్లండి: హైకోర్టు

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికార పార్టీ నాయకులు, మంత్రుల ఫొటోలను ప్రభుత్వ ప్రకటనల్లో ముద్రించడాన్ని తప్పుపడుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టునే ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించినవారిని శిక్షించే పరిధి హైకోర్టుకు ఉండదని స్పష్టం చేసింది. పిల్‌ను కొట్టివేసింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడకు చెందిన రైల్వే ఉద్యోగి వై.కొండలరావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. బుధవారం ఈ పిల్ విచారణకు రాగా, న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల్లో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సీజేఐ, రాష్ట్రస్థాయిలో గవర్నర్, ముఖ్యమంత్రి, సంబంధిత శాఖల మంత్రులు, జిల్లా ఇంచార్జ్ మంత్రుల ఫొటోలను మాత్రమే ముద్రించాలన్నారు. అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ మంత్రుల ఫొటోలతో ప్రకటనలు ఇస్తోందన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కోసం పిల్

- ప్రతివాదులకు నోటీసులు.. కౌంటర్ దాఖలుకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. దీనిపై స్పందించిన కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని విభిన్న, స్త్రీ, శిశు, ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ కార్యదర్శి పరమానంద్ ద్వివేది ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా, అంధుడైన సీనియర్ న్యాయవాది ఎస్‌కే రుంగ్తా వాదనలు వినిపించారు. ప్రభుత్వ నియామకాల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించకపోవడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. కుల ఆధారిత రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వ నియామకాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా ఖాళీల ఆధారిత రోస్టర్‌ను సిద్ధం చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉన్న దివ్యాంగుల కేటగిరీ బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీలను లెక్కించి నిర్ణీత కాలవ్యవధిలో వాటిని భర్తీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ఎస్.ప్రణతి స్పందిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నాలుగుశాతం రిజర్వేషన్ అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మరో పిల్ కూడా దాఖలైందని, అందులో సవివరంగా కౌంటర్ వేశామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలకు చైర్మన్లు

- నియామక ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థలకు చైర్మన్లను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాల సంస్థలకు 13 మందిని చైర్మన్లుగా నియమించింది. శ్రీకాకుళం- పీరికట్ల విఠల్‌రావు, విజయనగరం- దొడ్డక రామకృష్ణ, విశాఖపట్నం- వన్నంరెడ్డి సతీశ్ కుమార్, తూర్పుగోదావరి- భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ(సాయిబాబ రాజు), పశ్చిమగోదావరి- జుట్టిగ నాగరాజు, కృష్ణా- ఎం.ఎస్ బేగ్, గుంటూరు- వందన దేవి, ప్రకాశం- సుచిత్ర ముప్పవరపు, నెల్లూరు- శాంతకుమారి, చిత్తూరు- రెడ్డివారి గురవారెడ్డి, కడప- భానుప్రకాశ్ దాసరి, కర్నూలు- తుగ్గలి నాగేంద్ర, అనంతపురం- వడ్డే వెంకట్‌ను నియమించింది. రెండేళ్లపాటు వీరు చైర్మన్లుగా కొనసాగుతారు.

పీపీపీ కాలేజీలు ప్రభుత్వ ఆధీనంలోనే

ఇందులో రోగులకు ఉచిత/ రాయితీపై చికిత్స.. ఈ విధానం గుజరాత్‌లో విజయవంతమైంది

- ఎన్‌ఎంసీ చైర్మన్ అభిజాత్ సేథ్ స్పష్టీకరణ

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో నడిచే ఆస్పత్రులు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) చైర్మన్ అభిజాత్ చంద్రకాంత్ సేథ్ అన్నారు. ఈ మోడల్‌లో రోగులకు చికిత్స ఉచితంగా లేదా రాయితీపై అందుతుందని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్రంలో పర్యటించిన ఆయన... సీఎం చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. పీపీపీని అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయమని తెలిపారు. గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. పీపీపీ విధానంపై ఎన్ఎంసీ స్పష్టమైన మార్గదర్శకాలు సిద్ధం చేస్తుందని, ఆ ఎస్‌వోపీల మేరకే కాలేజీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎన్ఎంసీ నిబంధనల్లోని సెక్షన్-8 ప్రకారం లాభాపేక్ష లేని సంస్థలకు మాత్రమే మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి ఉండేదని.. వివిధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాల విన్నపం మేరకు గత డిసెంబరు 17న బోర్డు సమావేశంలో దీనికి సవరణలు చేశామని తెలిపారు. లాభాపేక్ష ఉన్న కార్పొరేట్ సంస్థలు కూడా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చామన్నారు. వారు కూడా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా, మిగిలిన కోటా సీట్ల పంపకంలో కొంత ఇబ్బందులు ఉన్నాయని, కానీ కొన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు కన్వీనర్ కోటాకు ఇవ్వడం మంచిదని అభిజాత్ అభిప్రాయపడ్డారు. మెడికల్ కాలేజీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ అంశం ఎన్ఎంసీ పరిధిలోకి రాదన్నారు. ప్రభుత్వ వైద్యులు, ప్రైవేట్ కాలేజీల్లో వైద్యుల 75 శాతం హాజరు అనేది చివరి ఆప్షన్ మాత్రమేనని, దాని ఆధారంగా సీట్లు రద్దు, ఇతర విషయాల్లో నిర్ణయాలు తీసుకోమని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసి పని చేయడం ద్వారా వైద్య విద్య కోసం అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవచ్చని ఎన్ఎంసీ భావిస్తోందని తెలిపారు. వైద్య విద్యను సామాన్యులకు చేరువ చేస్తూనే, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే జాతీయ వైద్య కమిషన్ లక్ష్యమని వెల్లడించారు. వైద్య కాలేజీల గుర్తింపు ప్రక్రియను సులభతరం చేస్తామన్నారు. వైద్యవిద్యలో నాణ్యతను పెంచేందుకు క్లినికల్ రీసెర్చ్‌ను తప్పనిసరి చేయడంతో పాటు కొత్తగా పీహెచ్‌డీ స్పెషాలిటీ, సబ్ స్పెషాలిటీ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. వైద్య విద్యలో ఏఐ డిజిటల్ హెల్త్ కేర్, అత్యాధునిక సాంకేతికతను జోడించనున్నట్లు పేర్కొన్నారు.



సీఎంను కలసిన ఎన్ఎంసీ చైర్మన్

ఎన్ఎంసీ చైర్మన్ డాక్టర్ అభిజత్ చంద్రకాంత్ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన చంద్రకాంత్ కొద్దిసేపు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు.

సమానంగా పీజీ, యూజీ సీట్లు: వీసీ

రాష్ట్రంలో యూజీ, పీజీ సీట్లు సమానంగా పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు హెల్త్ వర్సిటీ వీసీ చంద్రశేఖర్ తెలిపారు. 500 డీఎన్‌బీ సీట్లకు ఆమోదం తెలిపి, ఫ్యామిలీ మెడిసిన్‌లో డీఎన్‌బీ సీట్లు కేటాయించేందుకు ఎన్ఎంసీ అంగీకరించిందని తెలిపారు. 12న వర్సిటీ రీసెర్చ్ డేను తొలిసారి నిర్వహిస్తున్నామన్నారు. వర్సిటీలో ప్రముఖ శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు విగ్రహాన్ని మంత్రి సత్యకుమార్ ప్రారంభిస్తారని వీసీ తెలిపారు.

‘పీపీపీ’పై ఎన్ని వ్యాజ్యాలు వేస్తారు?

- పెండింగ్‌లోని పిల్ వైసీపీ కార్యకర్తదే.. పార్టీ తరపున మరోపిల్ ఎందుకు?
- సీనియర్ న్యాయవాదికి హైకోర్టు నిలదీత

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను, ఆసుపత్రులను పబ్లిక్, ప్రైవేట్, భాగస్వామ్య(పీపీపీ) విధానంలో చేపట్టడాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే ప్రజాహిత వ్యాజ్యం(పిల్) దాఖలైందని, ఒకే అంశంపై ఎన్ని పిటిషన్లు వేస్తారని వైసీపీ తరఫున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాదిని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై గతంలో ఓ పిల్ దాఖలైందని, అది వేసింది వైసీపీ కార్యకర్తేనని తాము కచ్చితంగా చెప్పగలమని వ్యాఖ్యానించింది. ఆ పిల్ పెండింగ్‌లో ఉండగా పార్టీ తరపున మరో పిల్ వేయాల్సిన అవసరం ఏముందని నిలదీసింది. ప్రతి రెండు నెలలకు ఒకసారి కొత్త పిల్ దాఖలు చేసుకుంటూ పోతే.. కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఫలితంగా విచారణ మరింత జాప్యం అవుతుందని, కేసు పరిష్కారం కాకుండా మీరే నాశనం చేసుకుంటున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇప్పటికే దాఖలైన పిల్‌లో ప్రతివాదిగా చేరి వాదనలు వినిపించాలని పిటిషనర్(వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి)కు సూచించింది. ఈ సందర్భంగా అప్పిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. “గతంలో దాఖలు చేసిన పిల్‌తో మాకు సంబంధం లేదు. ప్రస్తుత వ్యాజ్యంలో కొత్త అంశాలను ప్రస్తావించాం. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను నిర్మించడం.. ఉచిత వైద్యం అందుతుందన్న ప్రజల న్యాయబద్ధమైన హక్కును హరించడమే. వైద్య కళాశాలల్లో ఫీజుల పెంపు, తద్వారా ప్రజలపై పడే భారాన్ని ప్రశ్నించాం. ఇప్పటికే పెండింగ్ ఉన్న పిల్‌తో ప్రస్తుత వ్యాజ్యాన్ని జత చేయండి.” అని పదేపదే అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ప్రస్తుత పిటిషన్‌ను పెండింగ్ పిల్‌తో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

5న టీచర్ల సమస్యలపై చలో ఢిల్లీ: ఏఐజేఏసీటీవో

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 5న చల్లో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు అఖిల భారత జేఏసీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐజేఏసీటీవో) వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన సంఘాలతో ఏర్పాటైన ఏఐజేఏసీటీవో తరపున రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలు బుధవారం విజయవాడలో విలేకరులకు ఆ వివరాలు వెల్లడించాయి. ఏఐజేఏసీటీవో జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఎల్.సాయి శ్రీనివాస్, ఆప్టా ప్రధాన కార్యదర్శి ఎంజీ మెహది మాట్లాడుతూ 2010 కంటే ముందు నియామకమైన 30లక్షల మంది టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు దీనిపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయని, కేంద్రం చొరవ చూపి రివ్యూ పిటిషన్ వేయాలని లేదా టెట్ మినహాయింపునకు పార్లమెంటులో చట్టం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ అమలుచేయడం తగదని, రాష్ట్రాలకు స్వేచ్ఛనిచ్చి మాతృభాషలో బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దేశంలో ఖాళీగా ఉన్న 10లక్షల టీచర్ ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని చలో ఢిల్లీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏకీకృత సర్వీసు ప్రక్రియ పూర్తిచేయాలి: ఏపీటీఎఫ్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన ఉమ్మడి సర్వీస్ రూల్స్ ప్రక్రియను పూర్తిచేయాలని ఏపీటీఎఫ్ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ నేతలు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి బుధవారం సచివాలయంలో సీఎంను కలిసి పలు సమస్యలు వివరించారు. 12వ పీఆర్‌సీ గడువు ముగిసి 29 నెలలు దాటిపోయిందని, అందువల్ల 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాల ప్రక్రియ చేపట్టాలని, రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యుటీ, సరెండర్ లీవు బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు

- 100 ఎంబీబీఎస్ సీట్లకు ప్రవేశాలు
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో దాదాపు నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఎంబీబీఎస్ ప్రవేశాలకు వీలుకలగనుంది. ఈ మేరకు ఆరోగ్య శాఖ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం(సీఎస్ఎస్) కింద ఈ కళాశాలకు రూ.195 కోట్ల సాయం అందింది. తొలిదశలో ఈ కాలేజీలో 100 మంది వైద్య విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం అంగీకారం తెలిపారు. జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) తాజా నిబంధనల మేరకు 100 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న కళాశాలలో 420 పడకలతో బోధనాసుపత్రిని ఏర్పాటు చేయాలి. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఆరు పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 330 పడకల సామర్థ్యం గల జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అనుమతించింది. కానీ, మారిన ఎన్ఎంసీ నిబంధనల మేరకు 420 పడకల ఆసుపత్రి అవసరం. ఈ నేపథ్యంలో ఈ దిశగా ఆసుపత్రిని విస్తరించేందుకు కూడా సీఎం అనుమతించారని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. పిడుగురాళ్ల వైద్య కళాశాలకు 237 మంది వైద్యులు, ఇతర సిబ్బందితో పాటు బోధనాసుపత్రికి 600 మంది సిబ్బందిని సమకూర్చేందుకు కూడా సీఎం అంగీకరించారని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు కార్పొరేట్ ‘గుర్తింపు’

- 1,454 వైద్యశాలలకు ‘ఎన్‌క్వాస్’ సర్టిఫికెట్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తున్నాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. దీనికి నిదర్శనంగా కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఎన్‌క్వాస్(జాతీయ నాణ్యత ప్రమాణాల హామీ) నుంచి ప్రాథమిక, సెకండరీ వైద్య సేవలందించే 1,454 ఆసుపత్రులకు సర్టిఫికెట్లు లభించాయన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు లభించే ఈ గుర్తింపు ప్రభుత్వ ఆసుపత్రులకు లభించడం హర్షణీయమని తెలిపారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బంగారం వస్తోంది



పెళ్లయిన తర్వాత సమంత మరింత యాక్టివ్ అయ్యారు. తన సొంత చిత్రం ‘మా ఇంటి బంగారం’ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతున్నారు. సమంత ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సినిమాకు దర్శకురాలు నందినీరెడ్డి. ‘మా ఇంటి బంగారం’. టీజర్‌ను ఈ నెల 9న విడుదల చేయనున్నట్లు సమంత సంక్రాంతి సందర్భంగా సర్‌ప్రైజ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ఓ పోస్టర్‌ను విడుదల చేసి ‘మీరు చూస్తా ఉండండి. మా ఇంటి బంగారం మీ అందరితో కలసి పోతుంది’ అని క్యాప్షన్ కూడా పెట్టారు. 1980 నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇదనీ, ఇందులో సమంత పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు లతో కలసి ‘మా ఇంటి బంగారం’ చిత్రాన్ని సమంత నిర్మిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు: వసంత్ మారింగంటి, రాజ్ నిడిమోరు, క్రియేటివ్ సూపర్ విజన్: సీతా ఆర్ మీనన్, సంగీతం: సంతోష్‌నారాయణన్, ఫొటోగ్రఫీ: ఓంప్రకాశ్,

ప్రేమికుల రోజున



నటుడు అర్జున్ సర్జా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘సీతా పయనం’. అర్జున్ కుమార్తె ఐశ్వర ప్రధాన పాత్రధారిగా శ్రీరామ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. వచ్చే నెల 14న ప్రేమికుల రోజు సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. ఈ సినిమాలో అర్జున్, ఆయన మేనల్లుడు అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ‘అస్సలు సినిమా’ అనే పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ‘ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్నీ మెప్పిస్తుంది. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుంది’ అని అన్నారు. పాటలో ఐశ్వర్య లుక్స్, విజువల్స్ సంగీతం ఆకట్టుకున్నాయి. చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రేయ ఘోషల్ ఆలపించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు. నిరంజన్, సత్యరాజ్, కోవై సరళ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అన్ని వర్గాలనూ అలరిస్తుంది



రవితేజ

‘ఈ సారి సంక్రాంతికి సరదా సరదాగా గోల గోల చేద్దాం. పండగకు వస్తున్న అన్ని సినిమాలు వినోదాన్ని అందించబోతున్నాయి.’ అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రం ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13న విడుదలవుతోంది. బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ ‘చాలా రోజుల తర్వాత కుటుంబ కథతో వస్తున్నాను. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది. కిశోర్ తిరుమల మేకింగ్ బాగుంటుంది. ఆయన శైలిలో ఉంటూనే నా నుంచి అభిమానులు కోరుకునే అంశాలున్న సినిమా ఇది. అన్ని వర్గాల వారికీ రీచ్ అవుతుంది’ అని అన్నారు. ‘ఈ సినిమాను అందరూ ఎంజాయ్ చేస్తారు’ అని కిశోర్ తిరుమల చెప్పారు. ‘ఈ సినిమా అందరికీ ఫుల్ మీల్స్ లాంటి వినోదాన్ని అందిస్తుంది. వింటేజ్ రవితేజను చూస్తారు’ అని సుధాకర్ చెరుకూరి తెలిపారు.

దళపతి ఫ్యాన్స్‌కు షాక్



● ‘జన నాయగన్’ విడుదల వాయిదా

సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కావాల్సిన దళపతి విజయ్ ప్రతిష్టాత్మక చిత్రం ‘జన నాయగన్’ అనూహ్యంగా వాయిదా పడింది. ఈ మేరకు సినిమా పంపిణీ సంస్థ ‘మాలిక్ స్ట్రీమ్స్ కార్పొరేషన్’ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ‘అనివార్య కారణాల వల్ల ముందుగా నిర్ణయించినట్లు ఈనెల 9న ‘జన నాయగన్’ను విడుదల చేయలేకపోతున్నాం. కొత్త రిలీజ్ డేట్ ఖరారైన వెంటనే తెలియజేస్తాం. విజయ్ అభిమానులు సంయమనం పాటించాలి’ అని పేర్కొంది. విజయ్ రాజకీయ అరంగేట్రానికి ముందు వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.

సెన్సార్ వివాదంపై రేపు తీర్పు

‘జన నాయగన్’ మూవీకి సెన్సార్ సర్టిఫికేట్‌ను తక్షణం జారీ చేసేలా ఆదేశించాలని కోరుతూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పీటీ ఆషా బుధవారం విచారణ జరిపారు. ఈ కేసులో 9వ తేదీన తీర్పును వెల్లడిస్తానని పేర్కొన్నారు. చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఏపీలో ది రాజాసాబ్ టికెట్ ధరల పెంపు

● నేడు రూ. 1000తో స్పెషల్ షో

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ‘ది రాజాసాబ్’ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ వెసులుబాటు కల్పించింది. సంక్రాంతి సందర్భంగా విడుదలవుతున్న ఈ సినిమా టికెట్ ధరల పెంపునకు, ప్రత్యేక షోల ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం నేటి సాయంత్రం నుంచి అర్ధరాత్రి మధ్యలో ఒక ప్రత్యేక షోకు అనుమతినిచ్చింది. టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ. 1000గా నిర్ణయించారు. సినిమా విడుదల తేదీ అయిన జనవరి 9 నుంచి పది రోజుల పాటు టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో టికెట్‌పై అదనంగా రూ. 150, మల్టీప్లెక్స్‌ల్లో టికెట్‌పై అదనంగా రూ. 200 వరకూ పెంచుకోవచ్చు. అలాగే రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకోవడానికి అనుమతి లభించింది.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

సంక్రాంతికి మీ ఇంటి బిడ్డగా వస్తున్నాను



చిరంజీవి

‘సంక్రాంతి అంటేనే సినిమా పండుగ. ఈ పండక్కి మీ ఇంటి బిడ్డగా ‘మన శంకర వరప్రసాద్ గారు’ చిత్రంతో మీ ముందుకొస్తున్నాను. జనవరి 12న ఈ సినిమా మీ ముందుకు వస్తోంది. ఈ సినిమా చూస్తున్నంత సేపు మీరు నవ్వుతూనే ఉంటారు. అలాగని ఇది కేవలం కామెడీ సినిమా మాత్రమే కాదు... ఇందులో మంచి ఎమోషన్ ఉంది. ఫ్యామిలీ అంతా కలసి థియేటర్లకు వచ్చి సినిమా చూసి ఆశీర్వదించండి’ అని చిరంజీవి అభిమానులను కోరారు.

ఆయన కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రమిది. సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించారు. బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ...

‘నా కెరీర్‌లో ఎందరో దర్శకులతో పనిచేశాను. అనిల్ రావిపూడి లాంటి ఎనర్జిటిక్ డైరెక్టర్స్ అరుదు. నాలోని కామెడీ టైమింగ్‌ను, వింటేజ్ చిరంజీవిని మళ్లీ బయటకు తీశాడు’ అని తెలిపారు. ‘నా సోదరుడు వెంకటేశ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. తను ఇందులో ప్రత్యేక పాత్ర చేసేందుకు ఒప్పుకోవడం నా అదృష్టం. ఎన్నో ఏళ్ల క్రితం మేమిద్దరం కలసి ఓ మంచి చిత్రం చేయాలనుకున్నాం. ఇన్నేళ్లకు అనిల్ ద్వారా ఆ కోరిక తీరింది. కథ కుదిరితే మేమిద్దరం కలసి పూర్తిస్థాయి చిత్రం చేస్తాం. నా కూతురు సుస్మిత, సాహు గారపాటి ఈ సినిమాను ఎంతో ప్యాషన్‌తో నిర్మించారు’ అని తెలిపారు.

వెంకటేశ్ మాట్లాడుతూ ‘నా తమ్ముళ్లు పవన్ కల్యాణ్, మహేశ్‌తో సినిమాలు చేశాను. ఇప్పుడు అన్నయ్యతో చేస్తున్నాను. ఇద్దరం రఫ్ ఆడిస్తాం. ఆయనతో కలసి డాన్స్ చేయడం, కామెడీ చేయడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. మంచి ఎంటర్‌టైనర్‌తో వస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి’ అని కోరారు.

అనిల్ రావిపూడి మాట్లాడుతూ ‘చిరంజీవి గారితో సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. వెంకీ గారు ఈ సినిమాలోకి రావడానికి ప్రధాన కారణం చిరంజీవి గారు. వారి కాంబినేషన్ మిమ్మల్ని అలరిస్తుంది’ అని అన్నారు. సుస్మిత కొణిదెల మాట్లాడుతూ ‘సంక్రాంతికి ఒక సినిమాను విడుదల చేయడమే గొప్ప విషయం. అలాంటిది డాడీ సినిమాతో మీ ముందుక రావడం మర్చిపోలేని అనుభవం’ అని చెప్పారు ఇద్దరు స్టార్స్‌తో సినిమా చేసే అవకాశం దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది, సంక్రాంతికి బాక్సాఫీసును షేక్ చేస్తాం అని సాహు గారపాటి చెప్పారు.

వినోదం అత్యవసర వస్తువు కాదు

- పెంచిన ధరలు నచ్చకపోతే వారం తర్వాత సినిమా చూడొచ్చు
- ‘మన శంకరవరప్రసాద్ గారు, ది రాజాసాబ్’ టికెట్ రేట్ల పెంపుపై ప్రభుత్వానికి స్వేచ్ఛ ఇచ్చిన హైకోర్టు డివిజన్ బెంచ్

వినోదం అంటే తాగునీటి తరహాలో అత్యవసర వస్తువో.. నిత్యావసర సరుకో కాదని హైకోర్టు డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. పెంచిన టికెట్ రేటు పెట్టి సినిమా చూడాలా? వారంరోజుల తర్వాత సాధారణ టికెట్ రేటుకు సినిమా చూడాలా? అనేది వినియోగదారులు నిర్ణయించుకుంటారని పేర్కొంది. పెంచిన టికెట్ రేట్లు నచ్చకపోయినా లేదా అంత ధర పెట్టలేకపోయినా వారం రోజుల తర్వాత సాధారణ టికెట్ రేట్లకు సినిమా చూడవచ్చని పేర్కొంది. ప్రస్తుతం తమ ముందు ఉన్న పిటిషన్లు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కాదని.. కొంతమంది పిటిషనర్లు వ్యక్తిగత హోదాలో సింగిల్ జడ్జి వద్ద రిట్ పిటిషన్‌లు దాఖలు చేశారని తెలిపింది. సదరు పిటిషన్‌లలో ‘టికెట్ రేట్లు పెంచరాదు’ అని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను అన్ని సినిమాలకు వర్తింపజేయాల్సిన అవసరం లేదని తెలిపింది. సింగిల్ జడ్జి వద్ద దాఖలైన పిటిషన్లు కేవలం ‘ఓజీ, పుష్ప-2, గేమ్‌ఛేంజర్’ సినిమాల టికెట్ రేట్లు పెంచరాదని మాత్రమే దాఖలయ్యాయని గుర్తుచేసింది. కాబట్టి సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు కేవలం ఆ మూడు సినిమాలకే వర్తిస్తాయని పేర్కొంది. ‘మన శంకరవరప్రసాద్ గారు, ది రాజాసాబ్’ సినిమా టికెట్ రేట్ల పెంపునకు సదరు సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలు వర్తించవని స్పష్టంచేసింది. ఈ మేరకు ‘మన శంకరవరప్రసాద్ గారు, ది రాజాసాబ్’ సినిమా టికెట్ రేట్లు పెంచే అంశంపై నిర్ణయం తీసుకోవచ్చని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి స్వేచ్ఛ ఇచ్చింది. ఈ మేరకు తమ సినిమాల టికెట్ రేట్ల పెంపునకు అడ్డంకిగా ఉన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టేయాలని పేర్కొంటూ నిర్మాణ సంస్థలు షైన్ స్క్రీన్స్ ఎల్ఎల్‌పీ, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ దాఖలు చేసిన రిట్ అప్పీళ్లను ముగించింది.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

మనసుకు నచ్చిన పాత్ర చేశాను



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘నారీ నారీ నడుమ మురారి’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. జనవరి 14న విడుదలవుతున్న సందర్భంగా కథానాయిక **సాక్షి వైద్య** మీడియాతో ముచ్చటించారు. ‘ఇందులో నిత్య అనే పాత్ర చేశాను. కథ వినగానే చాలా నచ్చింది. స్టోరీ ఈజ్ కింగ్ అనిపించి వెంటనే అంగీకరించాను. నిత్య పాత్ర చాలా అమాయకంగా, నిజాయితీగా ఉంటుంది. ఆ పాత్ర స్వభావం నాకు వ్యక్తిగతంగా చాలా దగ్గరగా అనిపించింది. అందుకే పర్సనల్‌గా రిలేట్ అయ్యి నటించాను. ఈ పాత్ర కోసం దాదాపు నెల రోజుల పాటు వర్క్ షాప్ చేశాం. పాత్రను పూర్తిగా అర్థం చేసుకున్నాకే సెట్స్‌పైకి వెళ్లాం. శర్వానంద్‌తో నటించడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. వెన్నెల కిశోర్, నరేశ్ గారి పాత్రలు చాలా బావుంటాయి. తెలుగు భాష మాట్లాడడం కష్టమే అయినా డైరెక్టర్ సపోర్ట్ వల్ల సులభమైంది. డైరెక్టర్ గారి బలం కామెడీనే. సినిమాలో కూడా అదే ఫన్ కనిపిస్తుంది. సంయుక్తతో నాకు చాలా మంచి కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. తను చాలా స్వీట్ పర్సన్. చాలా విషయాల్లో నాకు సాయం చేసింది’ అని ఆమె చెప్పారు.

ఆవకాయ్ సిద్ధం





సంక్రాంతి సందర్భంగా విజయవాడలో గురువారం నుంచి నిర్వహించనున్న ఆవకాయ్ కార్యక్రమానికి సిద్ధమైన వేదిక. బోటులో వెళ్తున్న మంత్రి కందుల దుర్గేశ్, పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి

విశాఖలో రేపటి నుంచి లైట్ హౌస్ ఫెస్టివల్



విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లైట్ హౌస్ ఫెస్టివల్‌కు విశాఖపట్నం సిద్ధమవుతోంది. వీఎంఆర్‌డీఏ పార్కు వెనుకనున్న ఖాళీ స్థలంలో శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు ఈ ఫెస్టివల్ జరగనుంది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. సముద్ర తీర ప్రాంతాన ఉన్న లైట్‌హౌస్‌లను పర్యాటక కేంద్రాలుగా మార్చాలని, ఆర్థికంగా ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రతి ఏటా లైట్‌హౌస్ ఉత్సవాలు నిర్వహించాలని డీజీఎల్‌ఎల్‌ను ఆదేశించింది. ఈ క్రమంలో తొలి లైట్‌హౌస్ ఫెస్టివల్‌ను 2023లో గోవాలో, 2024లో పూరీలో ఏర్పాటు చేశారు. మూడోసారి విశాఖలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో పర్యాటకులు, నగర ప్రజలను ఆకర్షించేలా కళా, సాంస్కృతిక ప్రదర్శనలు, ఫుడ్ స్టాళ్లు వంటివి ఏర్పాటు చేస్తారు. ఉత్సవాలకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి సురేశ్ గోపి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తదితర ప్రముఖులు వస్తున్నారు.

ఊపిరితిత్తులకు సెగ

- వాయు కాలుష్యం, ధూమపానంతో ముప్పు
- ఎండలో ఉంచిన వాటర్ బాటిళ్లతో క్యాన్సర్
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి



ఐఐటీహెచ్‌లో లంగ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, వెర్నర్ సీగర్ తదితరులు

కంది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యం, ధూమపానంతో ఊపిరితిత్తులకు ఎక్కువ ప్రమాదం పొంచి ఉందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఊపిరితిత్తుల వ్యాధులే రెండో అతిపెద్ద అనారోగ్య సమస్యగా ఉందన్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను విరివిగా వినియోగిస్తున్నారని, వాటిని ఎండలో ఉంచడం వల్ల మైక్రోప్లాస్టిక్ కణాలు పెరుగుతాయని, ఆ నీటిని తాగితే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ముప్పు ఉందని హెచ్చరించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లంగ్ హెల్త్ (ఐఎల్‌హెచ్) భాగస్వామ్యంతో ఊపిరితిత్తుల సమస్యలపై పరిశోధనకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యులు ఊపిరితిత్తుల మార్పిడి చేస్తున్నారని, ఐఎల్‌హెచ్-ఐఐటీహెచ్ బయో ఇంజనీరింగ్ విభాగాలు ప్రారంభించిన ఈ కేంద్రంలో ఇండో-జర్మన్ శాస్త్రవేత్తలు మూలకణాలతో కొత్త ఊపిరితిత్తులు సృష్టించేందుకు పరిశోధనలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కేంద్రంతో రానున్న ఐదేళ్లలో చాలావరకు ఊపిరితిత్తుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కరోనాతో వచ్చిన శ్వాస సమస్యలతో ఊపిరితిత్తుల ప్రాధాన్యత ప్రపంచానికి తెలిసిందన్నారు. వాయు కాలుష్యాన్ని నివారించాల్సి అవసరం ఉందన్నారు. నిత్యం యోగా, శ్వాస సంబంధిత వ్యాయామాలు, గదుల్లోకి వెలుతురు ద్వారా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెప్పారు. ఊపిరితిత్తుల పునరుత్పత్తి, మార్పిడిపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఐఎల్‌హెచ్ డైరెక్టర్ వెర్నర్ సీగర్ అన్నారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, పలువురు కార్డియాలజీ, పల్మోనాలజీ నిపుణులు పాల్గొన్నారు.

పండగ కోడికి కార్పొరేట్ కళ

కృష్ణా, ఏలూరు సరిహద్దుల్లో హైటెక్ బరి



ఆహ్వాన పత్రిక

సిద్ధమవుతున్న భారీ బరి

అద్దాలు, ఏసీలతో నిండిన ప్రత్యేక గ్యాలరీలు

- 'వారధి' పేరిట అందంగా ఆహ్వాన పత్రికలు
- పాస్‌లు ఇస్తూ రారండోయ్.. అంటూ పిలుపులు
- విస్తీర్ణం 28 ఎకరాలు..7 ఎకరాల్లో పార్కింగ్

రోజుకు 40 పందేలు

5లక్షలు-కోటి వరకు బెట్టింగ్‌లకు సై



వారధి ..హైటెక్ కోడి పందేల వేడుకకు నిర్వాహకులు పెట్టిన పేరు ఇది. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పుడు ఈ వేడుకే హాట్ టాపిక్‌గా మారింది. కృష్ణా జిల్లాలోని గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం, ఏలూరు జిల్లాలోని నూజివీడు రూరల్ మండలాల సరిహద్దుల్లో 28 ఎకరాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో ప్రధాన బరిని కార్పొరేట్ లెవల్‌లో ముస్తాబు చేస్తుండగా, మరో మూడు చిన్న బరులు కూడా సిద్ధమవుతున్నాయి. ఆహ్వానపత్రికలను ముద్రించి, పెద్దలకు, ప్రముఖులకు అందిస్తూ.. రారండోయ్...అంటూ స్వయంగా నిర్వాహకులు పిలుస్తున్నారు. పండగకు ముందు, ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు...పండగ మూడురోజులూ కోడి పందేలు నిరంతరాయంగా నిర్వహించేలా రూ.కోట్ల ఖర్చుతో ఏర్పాట్లు చేస్తున్నారు.. ప్రధాన బరికి ఒక పక్కగా వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. దీనిని అద్దాలతో, పూర్తి ఏసీతో అత్యాధునికంగా తయారు చేస్తున్నారు. నిర్వాహకుల అనుమతితో తప్ప ఎవరినీ లోనికి అనుమతించకుండా పాసులను అందజేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగానూ, ఇతర రాష్ట్రాల నుంచీ వచ్చే అతిథుల కోసం ప్రత్యేకంగా విజయవాడ, హనుమాన్‌జంక్షన్. నూజివీడు, ఏలూరు ప్రాంతాల్లో లగ్జరీ హోటళ్లలో రోజుకు 5 వేలకు పైగా ఖరీదైన రూములను సిద్ధం చేశామని నిర్వాహకులు ఓపెన్‌గానే చెబుతున్నారంటే, పందేల జోరు ఏ స్థాయిలో ఉంటుందో ఊహించవచ్చు.



మహారాజ ఆతిథ్యం...

వివిధ రాష్ట్రాల నుంచి కోడిపందేలు చూసేందుకు వచ్చే వీవీఐపీలు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి జబర్దస్త్ టీమ్‌తో పాటు, తెలంగాణకు చెందిన ప్రముఖులు కూడా వస్తున్నారని చెబుతున్నారు. వారందరికీ ప్రత్యేకంగా ఏసీ గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన బరికి ఇది అభిముఖంగా ఉంటుంది. గాజు అద్దాలతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులోనే వీఐపీలకు విందు భోజనాలు ఉంటాయి. సామాన్యుల తాకిడి తట్టుకునేందుకు వీవీఐపీలు, వీఐపీల కోసం 80 మంది బౌన్సర్లను ప్రత్యేకంగా రప్పిస్తున్నారు.

రూ.లక్షల్లో పందేలు... బహుమతులుగా కార్లు

ప్రధాన బరితో పాటు చిన్నపాటివి మూడు బరులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన బరిలో కనిష్ఠంగా రూ.5 లక్షల నుంచి రూ. కోటి వరకు పందేలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రోజుకు 40 పందేలకు పైగా ఒప్పందాలు జరిగిపోయాయి. మిగతా బరుల్లో రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు ఒకటి, రూ. లక్ష లోపు మరొకటిగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానబరిలో జరిగే పందేలలో వరుసగా 4 పందేలు గెలిచిన వ్యక్తికి బ్రెజా కారు, థార్ బహుమతులుగా ప్రకటించారు. ఈ బహుమతులను బట్టి ఎంత పెద్దఎత్తున కోడిపందేలు జరగనున్నాయో ఊహించుకోవచ్చు.

- విజయవాడ /హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆంధ్రజ్యోతి

కబడ్డీ పోటీలతో సంబరాలు మొదలు..

సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించే 'వారధి'ని ఈ నెల 9వ తేదీన కబడ్డీ పోటీలతో ప్రారంభిస్తున్నారు. 10వ తేదీన ఎద్దుల పోటీలతో పాటు ఆవుల అందాల పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. 11వ తేదీన 200 మంది మహిళలతో ముగ్గుల పోటీలు జరుపుతారు. బహుమతులుగా రూ. 25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందిస్తారు. పశుపోషకులకు కన్సొలేషన్ (పాల్గొన్నందుకు) బహుమతులు కూడా అందజేయనున్నారు.




కార్ల పార్కింగ్ కోసమే ఏడెకరాల స్థలం

కోడి పందేల వీక్షకులు, పందెపు రాయుళ్ల కోసం ప్రత్యేకంగా ఏడు ఎకరాల్లో కారు పార్కింగ్ ఏర్పాటుచేశారు. బిళ్లనపల్లి రోడ్డులోని సీపీ ఫ్యాక్టరీని ఆనుకుని ఉన్న స్థలాన్ని దీనికోసం చదును చేశారు. ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా రెండు ఎకరాలు సిద్ధం చేస్తున్నారు. రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పార్కింగ్ సిబ్బందిని కూడా ఏర్పాటుచేయడం ప్రత్యేకం. కార్లను పార్కింగ్ చేయడంతో పాటు పకడ్బందీగా సెక్యూరిటీని ఏర్పాటు చేస్తున్నారు. సెక్యూరిటీ కోసమే 200 మందికి పైగా గార్డులను నియమించుకున్నట్టు తెలుస్తోంది.

బట్టతలకు కొత్త మందు


- జుట్టును మొలిపించే సరికొత్త ఔషధం క్లాస్కోటెరోన్
- ట్రయల్స్‌లో సత్ఫలితాలు.. దుష్ప్రభావాలు తక్కువ



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అందం మీద చాలా మంది మగవారికి పెద్దగా పట్టింపు ఉండదుగానీ.. బట్టతల వస్తే మాత్రం బాగా ఫీలవుతారు. చాలా మంది ఈ సమస్య కారణంగా ఆత్మనూన్యత భావంతో కుంగిపోతుంటారు. వారి సామాజిక జీవితంపై కూడా బట్టతల ఎంతో ప్రభావం చూపుతుంది. అలాంటివారందరికీ శుభవార్త. తీవ్ర దుష్ప్రభావాలేవీ లేకుండానే బట్టతలపై (మేల్ ప్యాటర్న్ బాల్డ్‌నెస్) జుట్టు పెరుగుదలకు తోడ్పడే ఒక కొత్త పైపూత మందు త్వరలో అందుబాటులోకి రాబోతోంది! దాని పేరు.. క్లాస్కోటెరోన్ 5%. మొటిమలను తగ్గించడానికి ఇప్పటికే ఈ మందును ('విన్‌లెవి' అనే బ్రాండ్‌నేమ్‌తో) వాడుతున్నారు. అందుకు ఆ దేశ ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) అనుమతులు కూడా ఉన్నాయి. ఆ మందు బట్టతలకు కూడా బాగా పనిచేస్తున్నట్టు క్లినికల్ ట్రయల్స్‌లో వెల్లడైంది. బట్టతలపై జుట్టు మొలిపించడానికి ప్రస్తుతం వాడుతున్న ఫినాస్టెరైడ్ వంటి 'యాంటీ-యాండ్రోజెన్' మాత్రల వల్ల శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని, పలు దుష్ప్రభావాలు వచ్చే ప్రమాదం ఉంది. కానీ ఈ 'క్లాస్కోటెరోన్ లోషన్ రూపంలో నేరుగా జుట్టు కుదుళ్లపై మాత్రమే పనిచేస్తుందని.. 'డైహైడ్రోటెస్టోస్టెరాన్ (డీహెచ్‌టీ)' అనే హార్మోన్ జుట్టు కుదుళ్లను బలహీనపరచకుండా ఇది నేరుగా అడ్డుకుంటుందని పరిశోధకులు తెలిపారు. అయితే, క్లినికల్ ట్రయల్స్‌ను ఆరు నెలలపాటు నిర్వహించారని.. ట్రయల్స్‌లో ఎలాంటి దుష్ప్రభావాలూ కనిపించనప్పటికీ, ఈ మందు దీర్ఘకాల వినియోగం వల్ల కలిగే ప్రభావాలపై ఇంకా అధ్యయనం చేయాల్సి ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అలాగే, ఈ మందు డీహెచ్‌టీ కారణంగా వచ్చే 'ఆండ్రోజెనెటిక్ అలోపేసియా (బట్టతల)'కు మాత్రమే పనిచేస్తుంది తప్ప ఆటోఇమ్యూన్ వ్యాధుల వల్ల, పోషకాహార లేమి వల్ల, గాయాల కారణంగా ఊడిపోయే జుట్టును తిరిగి మొలిపించలేదని వారు పేర్కొంటున్నారు.

క్లినికల్ ట్రయల్స్ ఇలా..

క్లాస్కోటెరోన్‌కు సంబంధించి.. అమెరికా, ఐరోపా దేశాల్లో మొత్తం 1,465 మంది పురుషులపై ఇప్పటికే రెండు ఫేజ్-3 ట్రయల్స్ నిర్వహించారు. సాధారణ మందులతో పోల్చితే, క్లాస్కోటెరోన్ వాడిన వారిలో జుట్టు సాంద్రత 1.68 రెట్లు పెరిగినట్టు ఒక ట్రయల్‌లో తేలగా.. 5.39 రెట్లు అధికంగా పెరిగినట్లు మరో ట్రయల్‌లో తేలింది. ఆరు నెలల పాటు నిర్వహించిన ఈ ట్రయల్స్‌లో పాల్గొన్నవారెవరికీ ఎటువంటి తీవ్ర అనారోగ్య సమస్యలూ తలెత్తలేదు. దీన్ని వాడిన వారంతా సంతృప్తి వ్యక్తం చేశారు. నిజానికి బట్టతల చికిత్స విభాగంలో గత 30 ఏళ్లుగా ఎటువంటి విప్లవాత్మక మార్పులు రాలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలు పరిమిత ఫలితాలను మాత్రమే ఇస్తున్నాయి. కొందరికి వాటివల్ల దుష్ఫలితాలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'క్లాస్కోటెరోన్' రాక ఒక సరికొత్త ఆశగా నిలుస్తోంది. కాగా.. 2026 నాటికి ఈ ట్రయల్స్‌కు సంబంధించిన తుది నివేదికలు సిద్ధం చేసి, అమెరికా (ఎఫ్‌డీఏ), ఐరోపా ఔషధ నియంత్రణ సంస్థల అనుమతి కోసం దరఖాస్తు చేయనున్నట్లు కాస్మో ఫార్మా సీఈవో జియోవన్నీ డి నాపోలి తెలిపారు.



సచివాలయ ఉద్యోగి కుటుంబ సభ్యులకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల

ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా

- చెక్కు అందజేసిన ఆర్థిక మంత్రి పయ్యావుల
- ఎస్‌బీఐతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం ఫలితం

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ గత ఏడాది మే 3న రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎన్.కుసుమ కరుణ కుమారి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద రూ.కోటి బీమా చెక్కును ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అందజేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఎస్‌బీఐ అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి.. మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేయాలనే లక్ష్యంతో ఉద్యోగుల సమగ్ర జీతం ప్యాకేజీపై గత ఏడాది మార్చి నెలలో ఎస్‌బీఐ, యూబీఐ, యాక్సిస్, ఇండియన్, తదితర బ్యాంకులతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందని మంత్రి కేశవ్ తెలిపారు. ఇందులో భాగంగా.. ఆర్థిక శాఖలో తొలి వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద.. బీమా సొమ్మును కుసుమకరుణకుమారి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, కార్యదర్శి వినయ్ చంద్ ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

నాటు కోడి @2వేలు!

- సంక్రాంతి మొక్కుల ఎఫెక్ట్
- గ్రామాల్లో పెరిగిన డిమాండ్



నరసాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి కోడి పందేలతో పాటు నాటు కోడి వంటకాలకు ప్రాధాన్యం ఎక్కువ. పండుగకు వచ్చే అల్లుళ్లు, బంధువులకు నాటు కోడి, గారెలతో భోజనం పెట్టడం సంప్రదాయం. దీంతోపాటు ముక్కనుమ రోజున గ్రామ దేవతలకు నాటు కోడిని కోసి నైవేద్యం పెడుతుంటారు. ఈ నేపథ్యంలో నాటు కోళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. కాగా, ఈసారి గ్రామాల్లో ఎక్కడా కోడి దొరకని పరిస్థితి. కేజీ కోడి ఉందంటే కొనేందుకు పది మంది పోటీపడుతున్నారు. వంటకాలకు పుంజు కంటె పెట్టలకే మంచి డిమాండ్ ఉంది. కేజీ రూ.2వేల నుంచి రూ.2,500 ధర పలుకుతోంది. మామూలు రోజుల్లో వెయ్యి నుంచి రూ.1200 కే లభించేది. దూర ప్రాంతాల నుంచి పండక్కి వచ్చే బంధువులు తమ మొక్కుల్ని ముందుగానే కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. కనీసం కేజీ కోడి అయినా కొనుగోలు చేయాలని చెబుతున్నారు. ఇటీవల వైరస్ సోకి చాలా కోళ్లు చనిపోయాయి. పల్లెల్లో కోళ్లు పెంచే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి నాటు కోళ్లకు డిమాండ్ వచ్చి పడింది.

సచివాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ఉద్యోగుల సంఘం(అప్సా) ఆధ్వర్యంలో బుధవారం మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు, పురుష ఉద్యోగులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. సచివాలయం, అసెంబ్లీ, లోక్‌భవన్‌కు చెందిన దాదాపు 300 మంది అధికారులు, ఉద్యోగులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. అప్సా అధ్యక్షుడు గొలిమి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మణకుమారి, నాపా ప్రసాద్ పాల్గొన్నారు.





రహదారి నిర్మాణంలో రెండు గిన్నిస్ రికార్డులు

ఎన్‌హెచ్ 544జీలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ఘనత



శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం వంకరకుంట - సాతార్లపల్లి మధ్య రోడ్డు నిర్మాణం

బెంగుళూరు-కడప-విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 544జీ.. గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ రోడ్డు నిర్మాణ పనులు చేస్తోంది. ఈ క్రమంలో నాలుగు గిన్నిస్ రికార్డులు నెలకొల్పడమే లక్ష్యంగా ఈ నెల 5న పనులు చేపట్టిన ఈ సంస్థ వాటిలో రెండు రికార్డులను బుధవారం సాధించింది. 24 గంటల వ్యవధిలో 28.95 కి.మీ. తారు రోడ్డు నిర్మించడం, ఇదే సమయంలో 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్ (కంకర, తారు)ను ఉపయోగించడంతో రెండు గిన్నిస్ రికార్డులు సొంతమయ్యాయి. ఈ రికార్డులకు శ్రీసత్యసాయి జిల్లా వేదికైంది. పుట్టపర్తి మండలం వంకరకుంట-సాతార్లపల్లి మధ్య బీటీ రోడ్డు నిర్మాణంలో భగంగా ఈ రికార్డు సాధించారు.

సీఎం చంద్రబాబు అభినందన

కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ నేతృత్వంలో ఎన్‌హెచ్‌ఏఐ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ రెండు గిన్నిస్ రికార్డులను సాధించడం అభినందనీయమని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో అభినందించారు. ఇంజనీరింగ్, కార్మిక సిబ్బంది నిబద్ధతతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గిన్నిస్ రికార్డులకు వేదిక కావడం గర్వంగా ఉందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

- పుట్టపర్తి రూరల్, ఆంధ్రజ్యోతి

చిరుద్యోగి కళ్లలో 'చంద్ర' కాంతులు



చంద్రబాబుకు నమస్కరిస్తున్న శంకర్రావు, పక్కన సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ

బాబు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక టైపిస్టుగా ఉద్యోగం

తర్వాత ఇంటి స్థలం కూడా.. అప్పటి నుంచి కలుసుకోవాలని సెక్షన్ ఆఫీసర్ శంకర్రావు ఆకాంక్ష

రిటైర్మెంట్‌కు చేరువలో తీరిన కోరిక.. చిరుద్యోగిని ప్రేమగా పలకరించిన సీఎం.. ఏ అవసరం వచ్చినా రావాలని భరోసా

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): "ఇది మీరిచ్చిన జీవితం. ఆజన్మాంతం మీకు రుణపడి ఉంటాను." అంటూ రెండు చేతులు జోడించి సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న వ్యక్తి సచివాలయంలో పనిచేసే సాధారణ ఉద్యోగి శంకర్రావు. సచివాలయంలో ఆయన సెక్షన్ ఆఫీసర్. అయితే, సీఎం చంద్రబాబుకు చిరకాల అభిమాని. చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఉద్యోగాల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్(1996) ద్వారా శంకర్రావు సచివాలయంలో టైపిస్ట్‌గా ఉద్యోగం పొందారు. అప్పటి వరకు ఉద్యోగం లేక నిస్పృహలో ఉన్న తన జీవితానికి ఆ నోటిఫికేషన్ దారిచూపిందని శంకర్రావు చెప్పారు. ఆ రోజు నుంచి ఆయన చంద్రబాబు అభిమానిగా మారిపోయారు. సీఎంను సచివాలయంలో ఎన్నిసార్లు చూసినా వ్యక్తగతంగా కలిసే అవకాశం మాత్రం రాలేదు. ఇటీవల సచివాలయ సంఘం ఎన్నికల్లో నూతన కార్యవర్గం విజయం సాధించిన నేపథ్యంలో ఈ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ నేతృత్వంలో ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భం గా సీఎంను ఒక్కసారైనా కలవాలన్న తన కోరికను శంకర్రావు రామకృష్ణకు తెలిపారు. దీంతో వారితోపాటు శంకర్రావును తీసుకెళ్లారు.

మీవల్లే ఉద్యోగం.. సీఎంను కలిసిన సందర్భంగా.. "మీ వల్లే నాకు ఉద్యోగం వచ్చింది. త్వరలోనే రిటైర్ కాబోతున్నాను." అని శంకర్రావు సీఎంకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించారని, అప్పుడే తనకు కూడా స్థలం వచ్చిందని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో ప్రభుత్వం ఉద్యోగులకు హౌస్ బిల్డింగ్ అలవెన్స్‌ను అదనంగా ఇచ్చిందని, ఆ నిధులతోనే హైదరాబాద్‌లో ఇంటిని నిర్మించుకున్నానన్నారు. ఉద్యోగం నుంచి ఇంటి వరకు తన జీవితంలో కీలకమైన ప్రతి మైలురాయి చంద్రబాబు వల్లే సాధ్యమైందని ఆయన సీఎంకు వివరించారు. ఇందంతా నవ్వుతూ విన్న చంద్రబాబు.. 'మీరు సంతోషంగా ఉన్నారు కదా.' అంటూ శంకర్రావును ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిటైర్ అయిన తర్వాత ఏ అవసరం వచ్చినా తనను వచ్చి కలవాలని భరోసా ఇచ్చారు.

పోలవరం ప్రగతిపై సీఎం హ్యాపీ

▸ పనులన్నీ గాడిన పడటంపై చంద్రబాబు సంతృప్తి

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డయాఫ్రమ్ వాల్ విధ్వంసం.. కాఫర్ డ్యామ్‌లో సీపేజీ... నిర్మాణాన్ని ఎక్కడినుంచి మొదలుపెట్టాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న పోలవరం ప్రాజెక్టు రూపురేఖలు గత 18 నెలల్లోనే పూర్తిగా మారిపోయాయి. స్పిల్‌వే గేట్లు, పూర్తికావస్తోన్న డయాఫ్రమ్‌వాల్, ప్రారంభమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ -2 పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు తన సంతోషం వ్యక్తం చేశారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1 పనులు ఈ ఏడాది జూన్ నాటికి, గ్యాప్-2 పనులు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని సీఎంకు అధికారులు వివరించారు. దీంతో.. పనులన్నీ గాడిన పడ్డాయన్న సంతృప్తిని ఆయన వ్యక్తం చేశారు. గ్యాప్-2 పనులను 2027 మార్చి నాటికే పూర్తి చేయాలంటూ నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్‌ను ఆదేశించారు. డయాఫ్రమ్ వాల్ పనులు 65,362 చదరపు మీటర్లకు గాను 56,583 చదరపు మీటర్ల (87 శాతం) మేర జరిగాయని అధికారులు వివరించారు. వచ్చే నెల 15వ తేదీనాటికి మిగతా పనులు కూడా పూర్తి చేస్తామని మేఘా ఇంజనీరింగ్ అధినేత కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు 2027 జూన్ 30 నాటికి పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఎడమ గడ్డ, కుడి గడ్డ రోడ్లు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తవుతాయని అధికారులు వెల్లడించారు. పోలవరం టన్నెల్‌ను సీఎం పరిశీలించారు. అప్రోచ్ చానల్‌ను ఈ ఏడాది మే చివరి నాటికి, హెడ్ రెగ్యులేటర్‌ను ఈ ఏడాది జూన్ నాటికి, ఇరిగేషన్ టన్నెల్‌ను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. వైసీపీ సమయంలో పోలవరం ప్రాజెక్టు దెబ్బతిన్నప్పుడు తనకు నిద్రపట్టలేదని చంద్రబాబు వారికి తెలిపారు. తిరిగి ఇప్పుడు ప్రాజెక్టును చూశాక అనుకున్న లక్ష్యం మేరకు పూర్తి చేయగలనన్న నమ్మకం కలిగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

2047 నాటికి అందరికీ బీమా సౌకర్యం: సీఎస్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి 2047 నాటికి బీమా సౌకర్యాన్ని కల్పించే లక్ష్యంతో భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీఏఐ) పని చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పారు. బుధవారం సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఇన్సూరెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు బీమా కవరేజిని విస్తరించడానికి, బీమా ప్రయోజనాలు సామాన్యులకు చేరేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కమిటీ చర్చించింది. అదేవిధంగా జీవిత బీమా, పంటల బీమా, మోటారు, ఆరోగ్య బీమాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఉప కమిటీలను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. లీడ్ బీమా సంస్థలు మొదటి విడతలో సుమారు 5 వేల గ్రామ పంచాయతీలను దత్తత తీసుకున్నాయి.

పిఠాపురంలో సంక్రాంతి మహోత్సవానికి పవన్

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి మహోత్సవం పేరిట డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో 3 రోజులపాటు పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం సంక్రాంతి మహోత్సవం పేరిట నిర్వహిస్తున్న ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. ఉదయం 10.30కు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల మైదానానికి చేరుకుని సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గ పరిధి లో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం సంక్రాంతి మహోత్సవంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్‌ను తిలకిస్తారు. శనివారం ఉదయం గొల్లప్రోలు ప్రాంతంలోని ఇళ్ల స్థలాలను పరిశీలిస్తారు.

పవన్.. ఒక్క ప్రార్థన చేస్తే వైఎస్‌లాగే చనిపోతావు: పాల్

అమీర్‌పేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'పవన్ కల్యాణ్ జాగ్రత్త... నేను ఒక్క ప్రార్థన చేస్తే రాజశేఖర్‌రెడ్డిలా చనిపోతావు' అంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ శాపనార్థాలు పెట్టారు. బుధవారం హైదరాబాద్, అమీర్‌పేటలో ఆయన మాట్లాడారు. 'వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను ఓ దొంగలా రాత్రికి రాత్రే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కిడ్నాప్ చేయించారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ ఎందుకు మౌనం పాటిస్తున్నారో అర్థంకావడం లేదు. అందరూ శాంతిని కోరుకుంటున్నారు. మూడో ప్రపంచ యుద్ధం జరుగకుండా, అమెరికాలో చర్చించాం. నేను శాంతి కోసం ప్రార్థిస్తున్నా. గద్దర్ చనిపోలేదు.. చంపేశారు.' అని పాల్ చెప్పారు.

ప్రజలను మోసం చేసిన జగన్, కేసీఆర్: లంకా

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జగన్, కేసీఆర్.. ఇద్దరూ కలసి తెలుగు ప్రజలను మోసం చేశారని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. 'సముద్రంలోకి వృధాగా పోతున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. గోదావరి, కృష్ణాలోని వరద, మిగులు జలాలను వాడకునేందుకు ఏపీకి సహజ సిద్ధమైన హక్కు ఉంది. గోదావరి-నల్లమలసాగర్ అనుసంధానంతో 60 లక్షల మందికి తాగునీటిని, 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిచవచ్చు. సీమ ఎత్తిపోతల పథకం పనులు జగన్ పాలనలోనే ఆగిపోయాయి. గతంలో అధికారంలో ఉన్న జగన్, కేసీఆర్‌లు తెలుగు ప్రజలను మోసం చేశారు. పోలవరంపై కేసీఆర్ అసత్య ప్రచారాలు చేస్తుంటే జగన్ కిమ్మనలేదు.' అని దినకర్ విమర్శించారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు: సీఎస్

రాజధాని అమరావతిలో తొలిసారిగా ఈ నెల 26న 77వ భారత గణతంత్ర వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సీఎస్ విజయానంద్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. వేడుకల సన్నాహక ఏర్పాట్లపై బుధవారం సీఎస్ సమీక్షించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు చేశారు. శాఖల వారీ శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

నేడు క్యాబినెట్ సమావేశం

సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం గురువారం జరగనుంది. ఈ సమావేశంలో సీఆర్డీయే 57వ అథారిటీ భేటీలో ఆమోదించిన అంశాలకు ఆమోదం తెలపనున్నారు. ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన 14 సంస్థలకు చెందిన 19,391 కోట్ల పెట్టుబడులకూ ఆమోదం తెలుపనున్నారు.

రాయలసీమ కట్టప్ప జగన్: దీపక్ రెడ్డి

జగన్ సీఎం అయిన వెంటనే జీవో 365 తెచ్చి 102 రాయలసీమ ప్రాజెక్టులను రద్దు చేసి, రాయలసీమ కట్టప్పగా మిగిలిపోయారని సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. 'సీమ ఎత్తిపోతలపై 2020లోనే స్టే తెచ్చామని తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మరి 2020 నుంచి నాలుగేళ్లు అధికారంలో ఉన్న జగన్ ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదు? రాష్ట్రాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలన్నదే జగన్ లక్ష్యం.' అని దీపక్‌రెడ్డి మండిపడ్డారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఏవైనా ఎరువుల్ని గరిష్ఠ చిల్లర ధర కన్నా అధికంగా వసూలు చేసినా.. అనవసరమైన ఎరువుల్ని అంటగట్టినా.. మండల వ్యవసాయ అధికారికి లేదా కాల్ సెంటర్ నంబరు 155251కు ఫిర్యాదు చేస్తే.. డీలర్లపై తగిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ తెలిపారు. ప్రస్తుతం 45 కిలోల యూరియా బస్తా రూ.266.5, డీఏపీ రూ.1,350 చొప్పున అమ్మాల్సి ఉంటుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పోలవరం ఎంతో ప్రత్యేకం!



"సముద్రంలో కలిసే జలాలను ఎవరైనా వాడుకోవచ్చు. దానిపై తెలంగాణకు అభ్యంతరం ఎందుకు? గోదావరి నదిపై తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తుంటే మేం ఏనాడూ అడ్డు చెప్పలేదు. కానీ, పోలవరం - నల్లమల సాగర్‌పై తెలంగాణ నేతలు అనవసరంగా రాజకీయాలు చేస్తున్నారు. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. వాటిని వాడుకుని దేవాదుల ప్రాజెక్టును తెలంగాణ విస్తరించుకుంటే ఎవరు కాదంటారు? కానీ, పోలవరం జలాలను ఏపీ వినియోగించుకుంటే అభ్యంతరం చెప్పడం తెలంగాణకు తగునా?"

\- సీఎం చంద్రబాబు

ఈ ప్రాజెక్టుతో నదులన్నీ అనుసంధానం: చంద్రబాబు

పోలవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పోలవరం యూనిక్ ప్రాజెక్టు అని సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం పూర్తి కాగానే, రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానిస్తామని తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతంలో ప్రధాన డ్యామ్ పనుల పురోగతిని బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి ఆయన పరిశీలించారు అధికారులతో సమావేశమై ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "వీలైనంత త్వరగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం. గతంలోనే డయాఫ్రమ్ వాల్ నిర్మాణం రూ.445 కోట్లతో పూర్తిచేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చాక పనులు కొనసాగించి ఉంటే, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేది. కానీ, కాంట్రాక్టరు, అధికారులను జగన్ మార్చేశారు. దీంతో ప్రాజెక్టుకు భారీనష్టం జరిగింది. డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిన్న విషయం గుర్తించేందుకు జగన్ ప్రభుత్వానికి చాలా సమయం పట్టింది. కేంద్రమే అంతర్జాతీయ నిపుణుల కమిటీని వేసి, డయాఫ్రమ్‌వాల్ కొత్తది నిర్మించాలని సూచించింది. దీంతో రూ.1,000 కోట్లతో నిర్మాణం చేపట్టాం. వచ్చేనెల 15నాటికి పూర్తి చేస్తాం" అని తెలిపారు. మెయిన్ డ్యామ్ పనుల పూర్తికి చర్యలు చేపడుతున్నామని చంద్రబాబు వెల్లడించారు. "ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించాను. 2027 జనవరి నాటికి 41.15 మీ. కాంటూరులో 119 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో భూ నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాలు పూర్తిచేయాలని స్పష్టం చేశాను" అని తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద అంతర్గత జల రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నామని సీఎం ప్రకటించారు. పోలవరం కుడి, ఎడమ కాలువలను సొరంగాల ద్వారా అనుసంధానిస్తామని తెలిపారు. "2014-19లో రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల కోసం జల వనరుల శాఖ రూ.65వేల కోట్లు వ్యయం చేసింది. ఇందులో ఒక్క రాయలసీమలోనే రూ.12వేల కోట్లు ఖర్చు చేశాం. వైసీపీ ప్రభుత్వం తన హయాంలో కేవలం రూ.2వేల కోట్లు ఖర్చు చేసింది. ప్రాజెక్టులను జగన్ నిర్వీర్యం చేస్తున్నారంటూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేస్తుంటే, నన్ను అరెస్టు చేశారు" అని తెలిపారు. పోలవరం స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టు కాదని, ఇది ఒక నెర్వ్ సెంటర్ అని అభివర్ణించారు. కర్నూలు మినహా రాష్ట్రమంతటికీ పోలవరం జలాలు వెళతాయని తెలిపారు. "గోదావరి- కృష్ణాడెల్టా అనుసంధానం జరగాలి. రాయలసీమలో 368 టీఎంసీల జలాలు రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్నాయి. ఒక పంటకే నీళ్లు ఇవ్వలేని స్థితి నుంచి నేడు రెండు పంటలకు నెల్లూరు జిల్లాకూ అందిస్తున్నాం." అని చంద్రబాబు తెలిపారు.

రాజకీయాలొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన డ్యామ్ పనుల పురోగతిని బుధవారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి చంద్రబాబు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సముద్రంలో కలిసే జలాలను ఎవరైనా వాడుకోవచ్చునని, దానిపై తెలంగాణకు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. "తెలుగు జాతి ఒక్కటే. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. భావోద్వేగాలతో ఆటలు సరికాదు." అని సూచించారు. గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తుంటే తామెప్పుడూ అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. కానీ, పోలవరం - నల్లమల సాగర్‌పై తెలంగాణ నేతలు అనవసరంగా రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని, వాటిని వాడుకుని దేవాదుల ప్రాజెక్టును తెలంగాణ విస్తరించుకుంటే ఎవరు కాదంటారని వ్యాఖ్యానించారు. కానీ, పోలవరం జలాలను ఏపీ వినియోగించుకుంటే అభ్యంతరం చెప్పడం తెలంగాణకు తగునా అని ప్రశ్నించారు "కృష్ణా డెల్టాను ఆధునీకరించి 20 టీఎంసీలను పొదుపు చేసి, ఆ నీళ్లను భీమాకు (తెలంగాణ) కేటాయించాం. హైదరాబాద్ నగరానికి నాగర్జున సాగర్ జలాలను తీసుకువచ్చాం. తెలుగుజాతి కోసం హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాం." అని గుర్తు చేశారు. పోలవరం నీళ్ల వినియోగించుకుని కృష్ణాజలాలను పొదుపు చేసుకుని, రాయలసీమకు మళ్లిస్తున్నాం. అన్నీ కలసి వస్తే అవసరమైతే తెలంగాణకూ నీళ్లివ్వవచ్చు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

'రాయలసీమ'పై జగన్‌ది రాద్ధాంతం

▸ ఆయన అక్రమాలపై దర్యాప్తునకే 30ఏళ్లు పడుతుంది

▸ కేసులు పెట్టమని కోర్టులే చెబుతున్నాయి: చంద్రబాబు

పోలవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ రాద్ధాంతం చేస్తున్నారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి పూర్తి చేసిన ఘనత తనదన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేశాక.. రాయలసీమలో కృష్ణా జలాలను వినియోగించుకుంటామని చెప్పారు. "రాయలసీమ ఎత్తిపోతలకు 2020 మే 5న జగన్ రూ.3,825 కోట్లతో పాలనామోదం తెలిపారు. దానిపై తెలంగాణ నాయకుడు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌కు (ఎన్‌జీటీ) వెళ్లగా, పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టును ముంకొనసాగించవద్దంటూ అదే నెల 20న 'స్టే' ఇచ్చింది. డీపీఆర్‌ను తయారు చేస్తున్నామంటూ ఎన్‌జీటీకి నివేదించిన జగన్.. ప్రాజెక్టు పనులు కొనసాగిస్తుండటంతో 2020 అక్టోబరు 29న స్టాప్‌వర్క్ ఆర్డర్‌ను ఇచ్చింది. పర్యావరణ అనుమతులు తీసుకోలేదంటూ తొలిసారి 2.65 కోట్ల మేర అపరాధ రుసుం వేసింది. డీపీఆర్ పేరిట పనులు చేయడంపై 2024 మే 22న రెండోసారి రూ.100కోట్ల అపరాధ రుసుము విధించగా, రూ.25 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది" అని చంద్రబాబు వివరించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం యావత్తు రాయలసీమకు ప్రయోజనం కలిగిస్తుందంటూ జగన్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఈ పథకం వల్ల 35 టీఎంసీలు మాత్రమే వాడుకునేందుకు వీలుంటుందని.. ఇందులో రాష్ట్రవాటా 22 టీఎంసీలేనని వివరించారు. ఈ పథకానికి సమీపంలో మాల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాలున్నాయన్నారు. అయితే, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించకుండానే రూ.966 కోట్లు, మరో మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించకుండానే జగన్ ప్రభుత్వం దాదాపు రూ.2500 కోట్లు చెల్లించిందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సర్కారు నిర్ణయాలపై దర్యాప్తును చేపడితే తుది నివేదిక వచ్చేందుకు 25 నుంచి 30ఏళ్లు పడుతుందని వ్యాఖ్యానించారు. దీనివల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. జగన్ నిర్ణయాలపై కేసులు పెట్టాలని కోర్టులే ఆదేశిస్తున్నాయని సీఎం తెలిపారు.

టీడీపీని తాకిన 'భూ' కంపం

పార్టీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ.. భూ సమస్యలపై బాధితుల గోడు

▸ స్వయంగా అనగానికే పిటిషన్లు

▸ క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందిపై అత్యధికంగా ఫిర్యాదులు

▸ ప్రభుత్వమే పరిష్కరించాలంటూ అభ్యర్థన



టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఆనాడు రీసర్వే పేరుతో సృష్టించిన భూ వివాదాల సునామీ గ్రామాలను కుదిపేస్తోంది. ఈ వివాదాల పరిష్కారంపై కూటమి సర్కారు ఏటూ తేల్చడం లేదు. తెలుగునేలపై రీసర్వే తర్వాత ఎలాంటి వివాదాలు, సమస్యలు వస్తున్నాయో తెలియజేస్తూ 'ఆంధ్రజ్యోతి' కొద్దిరోజులుగా వరుసగా వార్తలు ప్రచురిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని సమస్యలన్నీ పరిష్కరించాలని రెవెన్యూశాఖను ఆదేశిస్తున్నారు. సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని రెవెన్యూ శాఖ చెబుతున్నా.. వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని బుధవారం అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం సాక్షిగా నిరూపితమయింది. రొటేషన్‌లో భాగంగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం ప్రజా గ్రీవెన్స్ సెల్‌లో కూర్చున్నారు. భూ సమస్యల బాధితులు అక్కడికి భారీగా వచ్చి మంత్రిని కలిసి పరిష్కారం కోరారు. ఇలా గతంలోనూ అనేక దఫాలుగా పిటిషన్లు తీసుకున్నారు. కానీ ఈసారి మంత్రే ఆశ్చర్యపోయేలా బాధితులు భారీ ఎత్తున అర్జీలు ఇచ్చారు. దీన్నిబట్టి గ్రామీణ ప్రాంతాల్లో రీసర్వే 1.0 అనంతర సమస్యలు ఎంతగా పాతుకుపోయాయో స్పష్టమవుతోంది.

మంత్రి దృష్టికి వచ్చిన అంశాలు..

- సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన రైతు నారాయణ స్వామి తన భూమిని వైసీపీ నేతలు స్వాధీనం చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 103-1-ఏ1లోని 75 సెంట్ల మెట్టభూమిని అధికారుల సహకారంతో వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారని తన ఫిర్యాదులో ఏర్కొన్నారు.
- అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం ముదిగుబ్బ గ్రామానికి చెందిన రైతు నాగరాజు తన భూమిని గుర్తించి అప్పగించాలని కోరారు. స్థానిక వైసీపీ నేతలు భూములను ఆక్రమించుకొని భూమిపై పొజిషన్ చూపకుండా, హద్దులు నిర్ధారించకుండా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.
- అన్నమయ్య జిల్లా బి. కొత్తకోటకు చెందిన సురేంద్రబాబు పిటిషన్ ఇచ్చారు. గ్రామంలో సర్వే నం. 847-1లోని భూమిని 2023-2026 కాలానికి వేలంలో పాడుకున్నా, ఇప్పటి వరకు దేవస్థానం అధికారులు భూమిని చూపించలేదని పేర్కొన్నారు. తక్షణమే భూములను పొజిషన్‌లో చూపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- పశ్చిమగోదావరి జిల్లా ఇనపర్రు గ్రామానికి చెదిన కర్రి గోపిరెడ్డి రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ జవాను. 1999లో నాటి ప్రభుత్వం ఆయనకు సర్వే నం.194-3లో 3 ఎకరాల భూమి కేటాయించింది. ఆ భూమిని అభివృద్ధి చేసిన తర్వాత 2019లో నాటి వైసీపీ ప్రభుత్వం ఆయన భూమిలో చెరువును తవ్వింది. మరో చోట భూమి ఇస్తామన్నా ఇప్పటికీ కేటాయించలేదు.
- ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం శివన్నపాలెం గ్రామానికి చెందిన రామకృష్ణ భూమిని గత ప్రభుత్వంలో రికార్డుల్లో తారుమారు చేశారు. నాటి రెవెన్యూ, సర్వే అధికారులు అక్రమార్కులతో కొమ్ముకాసి తన భూమిని మరొకరి పేరుపై రాశారని బాధితుడు చెప్పారు.
- నంద్యాలకు చెందిన చెన్నమ్మ ఓ వినతి ఇచ్చారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామం, కడమల, తిమ్మాపురం పరిధిలో దాదాపు 500 ఎకరాల అటవీ భూమి ఉంది. మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆ భూమిని ఆక్రమించుకున్నారు. ఈ విషయమై పలుమార్లు కలెక్టర్, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో చెన్నమ్మ పేర్కొన్నారు.

పరిష్కారం చూపెడతారా?

టీడీపీ గ్రీవెన్స్‌లో మంత్రిని కలిసి సమస్యను చెప్పుకున్నవారు చెప్పిన దాంట్లో ఒక ఉమ్మడి అంశం ఉంది. స్థానిక వీఆర్వో, సర్వేయర్ తమకు అన్యాయం చేశారని అందరూ ఫిర్యాదు చేశారు. ఇక తమ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు స్థానిక తహసీల్దార్, ఆర్డీవోను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా కనీసం పట్టించుకోలేదనేది మరో ప్రధాన ఫిర్యాదు. అంటే, బాధితులను గ్రామస్థాయిలో మోసం చేశారు. మండల, డివిజన్ స్థాయిలో పట్టించుకోలేదు. అందుకే నేరుగా మంత్రి ఉన్న దగ్గరికే వచ్చి తమ గోడు చెప్పుకొన్నారు. మరి ఈ దఫా అయినా వారి సమస్యకు పరిష్కారం చూపెడతారా? లేక మిగతా పిటిషన్ల మాదిరిగా వీటిని కూడా పరిష్కరించేసిన జాబితాలో కలిపేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదిలో 3,380 కోట్లతో రహదారుల నిర్మాణం

▸ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి. చిత్రంలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, జేసీ నవీన్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఒకే సంవత్సరం రూ.3,380కోట్ల వ్యయంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో మరో మంత్రి కొల్లు రవీంద్ర, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావుతో కలసి ఆయన... బందరు ఓడరేవు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, రహదారులు భవనాల శాఖ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,081కోట్ల వ్యయంతో 16 వేల కి.మీ మేరకు రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తిచేశాం. రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఒకే సంవత్సరం రూ.3,380 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇందుకోసం టెండర్లు పిలిచాం. కొన్ని పనులు మొదలయ్యాయి. నాణ్యతలో ఏమాత్రం లోటులేకుండా వచ్చే మే నెల ఆఖరిలోగా పూర్తిచేస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలను ఏం చేద్దాం!

▸ అసెంబ్లీకి రాకుండా వేతనం, టీఏ, డీఏలు పొందడమేంటి?

▸ అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై ఎథిక్స్ కమిటీలో చర్చ

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా వేతనాలు, టీఏ, డీఏలు పొందుతుండటంపై శాసనసభ ఎథిక్స్ కమిటీ సీరియస్ అయింది. బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో సభ్యులు జ్యోతుల నెహ్రూ, ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అర్హత లేకపోయినా ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరడం, హోదా ఇస్తేనే సభకు వస్తామనడం దేశ చరిత్రలోనే తొలిసారి అని వ్యాఖ్యానించారు. సమావేశాలకు రాకుండా 10మంది వైసీపీ ఎమ్మెల్యేలు వేతనాలు తీసుకుంటున్నారని, వారిలో ఆరుగురు టీఏ, డీఏలు క్లెయిమ్ చేశారని ఎథిక్స్ కమిటీకి అసెంబ్లీ అధికారులు సమాచారం ఇచ్చారు. సదరు వైసీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి ఎథిక్స్ కమిటీ ముందుకు పిలిపించాలని జ్యోతుల నెహ్రూ కోరారు. దీనిపై బుద్ధప్రసాద్ స్పందిస్తూ.. నోటీసులు ఇచ్చి పిలిపించడం కన్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ప్రధాన నగరాల్లో మేధావులు, ప్రజాసంఘాలతో సమావేశాలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, దాని ప్రకారం ఓ నిర్ణయానికి వస్తే బాగుంటుందన్నారు. ఎథిక్స్ కమిటీలో ప్రస్తుతం ముగ్గురు మాత్రమే హాజరైనందున వచ్చే భేటీలో ఈ విషయంపై చర్చించి ఓ నిర్ణయానికి వద్దామని చైర్మన్ చెప్పారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాలకైనా వైసీపీ సభ్యులు హాజరుకావాలని బుద్ధప్రసాద్ కోరారు.

'మదనపల్లె'పై జోక్యం చేసుకోలేం

▸ అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మార్చడాన్ని నిలువరించలేం: హైకోర్టు

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చడాన్ని నిలువరించలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాలలో జోక్యం చేసుకోలేమంది. గతంలో ఓ మండల హెడ్‌క్వార్టర్ మార్పులో ఓ హైకోర్టు జోక్యం చేసుకోగా, సుప్రీంకోర్టు తప్పుపట్టిందని గుర్తు చేసింది. తరలింపు ప్రక్రియపై స్టే విధించేందుకు నిరాకరించింది. జిల్లా కేంద్రం మార్పు విషయంలో చట్టనిబంధనలు ప్రకారమే నడుచుకున్నామని ప్రభుత్వం చెబుతోందని, ఈ నేపథ్యంలో పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది బి. వెంకటనారాయణరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది సి.సుమన్ వాదనలు వినిపిస్తూ.. జిల్లా కేంద్రం మార్పు విషయంలో రెవెన్యూ శాఖ ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్ ఏపీ డిస్ట్రిక్ట్ ఫార్మేషన్ చట్టం-1974లోని సెక్షన్ 3(5)కి అనుగుణంగా లేదన్నారు. ప్రజలు, భాగస్వామ్య పక్షాల నుంచి అభ్యంతరాలు స్వీకరించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. 2022లో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఏర్పడిందని, మూడేళ్లలోనే ఎలాంటి కారణాలు లేకుండా జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చారన్నారు. జిల్లా కేంద్రం మార్చడం వల్ల కార్యాలయాల నిర్మాణం కోసం ఖర్చు చేసిన కోట్ల రూపాయలు వృథా అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి స్పందిస్తూ.. జిల్లా కేంద్రం మార్పు విషయంలో చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నామన్నారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయాలని పలు అభ్యర్థనలు వచ్చాయన్నారు. పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచుతామన్నారు.

రామ భజనలకు యునెస్కో హోదాకు ప్రయత్నం

▸ మారిషస్ తెలుగు వారి ఆత్మీయ సమావేశంలో వక్తలు

హైదరాబాద్ సిటీ, జనవరి7(ఆంధ్రజ్యోతి): మారిషస్‌లోని తెలుగువారి నోట 190 ఏళ్లుగా అలరారుతున్న రామ భజనలకు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం తమ దేశ తెలుగు సాంస్కృతిక కేంద్రం ద్వారా ప్రయత్నిస్తున్నట్లు మారిషస్ తెలుగు మహాసభ అధ్యక్షుడు హెవిన్ గురయ్య తెలిపారు. ఆ దేశానికి రామభజనలు ఎప్పుడు.. ఎలా వచ్చాయి? వాటి పరిణామంలో మార్పులు తదితర అంశాలపై మారిషస్‌లోని తెలుగు పండితులు వివిధ బృందాలుగా ఏర్పడి పరిశోధన చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదికల్లా యునెస్కో వారసత్వ జాబితాలోకి రామభజనలు చేరేలా అవిరళ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగుజాతి ట్రస్టీ, సీనియర్ పాత్రికేయురాలు, డీపీ అనూరాధ నిర్వహణలో బుధవారం జూబ్లీహిల్స్‌లో మారిషస్ తెలుగువారితో ఆత్మీయ సమావేశం జరిగింది.

ప్రైవేటు ట్రావెల్ బస్సు దగ్ధం

- కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

కొవ్వూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీప.. కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై బుధవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్ బస్సు దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌తో అందరూ చూస్తుండగానే క్షణాల్లో బస్సంతా మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. వివరాలివీ.. ఖమ్మం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్‌ఆర్‌ఆర్ ట్రావెల్స్ బస్సు బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై టోల్‌ప్లాజా వద్దకు వస్తోంది. ఇంతలో డ్రైవర్‌కు అనుమానం వచ్చి రోడ్డు పక్కనే వాహనాన్ని ఆపాడు. అప్పటికే షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులో ఆరుగురు ప్రయాణికులు, నలుగురు సిబ్బంది కలిసి మొత్తం పది మంది ఉన్నారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన డ్రైవర్ మరపల్లి భిక్షం.. నిద్రలో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేసి బస్సులోఉన్న అందరినీ దింపివేశాడు. ఫైర్ సిలిండర్, నీటితో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో స్థానిక ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. కొవ్వూరు నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపుచేసినా అప్పటికే బస్సు కాలిపోయింది. బస్సును వంతెనపై నుంచి హైడ్రాలిక్ క్రేన్‌సాయంతో కిందకు తరలించే క్రమంలో క్రేన్ బోల్తా పడింది. దీంతో దాన్ని మరో క్రేన్‌తో పైకి తీశారు.

ప్రయాణికులు బెంబేలు!

పండగ నేపథ్యంలో ఉద్యోగ ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారంతా తమ సొంత ఊళ్లకు వస్తుంటారు. ప్రయాణికుల రవాణాకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల ట్రావెల్ బస్సుల్లో వరుస అగ్ని ప్రమాదాలు జరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. సంక్రాంతి నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పూర్తిస్థాయిలో చెక్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించే బస్సులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై దగ్ధమవుతున్న ట్రావెల్ బస్సు



మామిడి జ్యూస్ కంటెయినర్ బోల్తా



రోడ్డుపై మ్యాంగో జూస్ కారణంగా జారిపడ్డ ద్విచక్ర వాహనదారుడు

చిలమత్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మ్యాంగోజ్యూస్ డ్రమ్ములతో వెళుతున్న కంటెయినర్ లారీ ప్రమాదానికి గురైంది. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని కోడూరుతోపు వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున బోల్తా పడింది. డ్రమ్ములు కిందపడి అందులో ఉన్న జ్యూస్ మొత్తం రోడ్డు పాలైంది. కోడూరు తోపులోని కుషావతి నది బ్రిడ్జిపై ఉన్న స్పీడ్ బ్రేకర్లను గమనించకుండా లారీని డ్రైవర్ అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. స్పీడ్ బేకర్ల వద్ద సడన్ బ్రేక్ వేయడంతో లారీలో ఉన్న జ్యూస్ డ్రమ్ములన్నీ కంటెయినర్ క్యాబిన్‌పై పడ్డాయి. దీంతో క్యాబిన్ అమాంతం కిందికి కుంగిపోయింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు వెంటనే అక్కడికిచేరుకొని కంటెయినర్‌ను పక్కకు తొలగించారు.ప్రమాదంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుపై జ్యూస్ కారణంగా ద్విచక్రవాహనదారులు జారిపడ్డారు. దీంతో పోలీసులు స్థానికులతో కలిసి ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చి రోడ్డును శుభ్రం చేసి కాస్త మెరుగుపరిచారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మాహుతి

- పెట్రోల్ పోసుకుని.. నిప్పంటించుకుని అఘాయిత్యం
- గుంటూరు జిల్లాలోని ఓ ప్రైవేటు కళాశాల ఆవరణలోనే ఘటన

చేబ్రోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మాహుతి చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన నల్లూరి రాఘవేంద్ర వెంకట్(21) స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వచ్చిన వెంకట్ మధ్యాహ్న సమయంలో కళాశాల ఆవరణలోని మరుగుదొడ్ల వైపు వెళ్లాడు. బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు, పొగలు రావడాన్ని గమనించిన తోటి విద్యార్థులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన వెంకట్‌ను గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ముద్దుకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్‌ఐ వీరనారాయణ తెలిపారు.

ప్రత్యేక సర్వీసుల్లో అదనపు చార్జీలు ఉండవు: ఆర్టీసీ

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా నడిపే ప్రత్యేక సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయబోమని ఏపీఎస్‌ఆర్టీసీ స్పష్టం చేసింది. స్త్రీ శక్తి పథకం ద్వారా బస్సు సర్వీసులు 94శాతానికి తగ్గకుండా ఆక్యుపెన్సీతో నడుపుతున్నట్లు స్పష్టం చేసింది. కొన్ని రోజుల్లో 100శాతం ఆక్యుపెన్సీ ఉంటుందని, అందుకే అంతర్‌రాష్ట్ర ప్రయాణీకులకు సంక్రాంతి సందర్భంగా రవాణా సేవలందించేందుకు పెద్ద పీట వేశామని వివరించింది. అందుబాటులో ఉన్న బస్సుల్ని పొరుగు రాష్ట్రాలకు నడుపుతున్నామని తెలిపింది.

జగన్ హయాంలోనే సీమ ఎత్తిపోతలపై స్టే

స్టీల్ ప్లాంటు భూములను ఇతర అవసరాలకు కేటాయించేది లేదు

- విశాఖలో మీడియాతో మంత్రి లోకేశ్

విశాఖపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాటలో నడవాలని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. కర్మాగారం రక్షణకు పదేపదే బెయిల్ అవుట్‌లు ఇవ్వడం సమంజసం కాదని, లాభాలు సాధించాలని తామంతా ఆకాంక్షిస్తున్నామని అన్నారు. జగన్ పత్రికపై వేసిన పరువు నష్టం కేసులో విచారణ నిమిత్తం బుధవారం ఆయన విశాఖ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం కోర్టు బయట మీడియాతో లోకేశ్ మాట్లాడారు. విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు ఉక్కు పరిశ్రమ భూములు తీసుకుంటున్నారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదన్నారు. ఉక్కు కర్మాగారం రక్షణకు ఎన్డీయే ప్రభుత్వం రూ.14 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. విశాఖ ఉక్కుకు చెందిన భూములను ఇతర అవసరాలకు మళ్లించే యోచన ఎన్డీయే ప్రభుత్వానికి లేదని లోకేశ్ స్పష్టం చేశారు. భూములు మళ్లిస్తున్నారనే స్క్రిప్ట్ ఎక్కడ నుంచి వచ్చిందో సీపీఎం నేతలే చెబితే బాగుంటుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో క్రెడిట్ కోసం తాము ఎలాంటి పోరాటం చేయలేదన్నారు. ఎయిర్‌పోర్టు వల్ల ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరుగుతుందని భావించి శరవేగంగా పూర్తిచేశామని చెప్పారు. "ఎర్రబస్సు రాని ఊరికి ఎయిర్‌పోర్టు అవసరమా.." అని అప్పట్లో జగన్ అన్నారా?.. లేదా?..అనేది అందరికీ తెలుసునన్నారు. ఆ వీడియోను అందరూ చూశారని తెలిపారు. భోగాపురం క్రెడిట్ కావాలంటే వైసీపీ తీసుకోవచ్చునని, దాంతోపాటు అమర్‌రాజా బ్యాటరీస్ సహా పలు కంపెనీలను రాష్ట్రంనుంచి తరిమేసిన క్రెడిట్‌కూడా ఆ పార్టీ తీసుకోవాలని లోకేశ్ ఎద్దేవా చేశారు.

రాజధాని రైతుల పక్షాన

విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. వైసీపీ హయాంలో 108 వాహనాలు ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కటి కూడా ఆగలేదని గుర్తుచేశారు. అమరావతి రాజధానిని ఎవరూ తరలించలేరని వ్యాఖ్యానించారు. అప్పట్లో సీఎం చంద్రబాబు ముందుచూపుతో భూముల విషయంలో రైతుల పక్షాన అగ్రిమెంట్లు చేశారని, అందుకే రాజధానికి వైసీపీ నేతలు తరలించలేకపోయారని వివరించారు.

ఏపీ నెంబర్ 1

ఫార్చ్యూన్ 500 వంటి పెద్ద కంపెనీలకు ఎకరా భూమి 99 పైసలకు ఇస్తే తప్పేమిటని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. వైసీపీ ఐదేళ్లలో చేయలేనిది తమ ప్రభుత్వం 18 నెలల్లో చేసి చూపించిందన్నారు. ప్రోత్సాహకాలతోపాటు తక్కువ ధరకు భూములు ఇచ్చినందునే కాగ్నిజంట్, టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. విశాఖ జిల్లాలోని తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ పనులు రెండు నెలల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. దీనికి సంబంధించి భూముల అప్పగింత, ఇతర కార్యక్రమాలు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. దేశంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు.

జల వివాదం సరికాదు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే 2020లో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై స్టే వచ్చిందని మంత్రి లోకేశ్ తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం దీనిపై కొందరు వివాదం చేస్తున్నారని, ఇది సరికాదని వ్యాఖ్యానించారు. గోదావరి జలాలు తెలంగాణ దాటి ఏపీలోకి ప్రవేశించినతర్వాతే ఆ నీటిని లిఫ్ట్ ద్వారా రాయలసీమకు తరలించాలనేది ప్రభుత్వ ఆలోచన అని వివరించారు. నిడమర్రు పాఠశాలను సొంత నిధులతో అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

ఆస్ట్రేలియాతో ఒప్పందం

రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. మహిళా క్రికెట్ టీమ్‌ను ముందుగా తానే కలిశానని, మిథాలీరాజ్‌ను ఏసీఏ సలహాదారుగా నియమించామని తెలిపారు. క్రీడల కోసం ఆస్ట్రేలియాలోని గ్రిఫిట్ వర్సిటీతో ఒప్పందం చేసుకున్నట్టు వివరించారు.



కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్

విశాఖ కోర్టుకు లోకేశ్

- క్రాస్ ఎగ్జామిన్ చేసిన 'జగన్ పత్రిక' లాయర్లు

విశాఖపట్నం లీగల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ బుధవారం విశాఖ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. జగన్ పత్రిక ప్రచురించిన కథనంపై లోకేశ్ గతంలో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో లోకేశ్ హాజరయ్యారు. ఆయనను జగన్ పత్రిక తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. లోకేశ్ తరపున న్యాయవాదులు కోటేశ్వరరావు, ఎస్వీ రమణ, వెన్నెల ఈశ్వరరావు హాజరయ్యారు. అనంతరం కేసు విచారణను జడ్జి రతన్‌కుమార్ ఈ నెల 21కి వాయిదా వేశారు.

జనార్దనరావుతో చాలా ఏళ్లుగా స్నేహం!

- నకిలీ మద్యం సీసాలకు లేబుళ్లను సమకూర్చా
- కస్టడీ విచారణలో నిందితుడు నకిరికంటి రవి వెల్లడి
- అద్దేపల్లికి ప్లాస్టిక్ సీసాలు సరఫరా చేశా
- మరో నిందితుడు శ్రీనివాసులురెడ్డి వాంగ్మూలం

అన్నమయ్య/ ములకలచెరువు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): "అద్దేపల్లె జనార్దనరావుతో చాలా ఏళ్లుగా స్నేహం ఉంది. ములకలచెరువుతో పాటు ఇబ్రహీంపట్నంలో తయారు చేసిన నకిలీ మద్యం సీసాలకు అంటించిన లేబుళ్లు సమకూర్చడంలో కీలక ప్రాత పోషించా" అని ములకలచెరువు నకిలీ మద్యం కేసులో కీలక నిందితుడైన నకిరికంటి రవి వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో నిందితులైన రవి(ఏ16), ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం సూరంపల్లెకు చెందిన శ్రీనివాసులు రెడ్డి(ఏ23)ను రెండు రోజుల కస్టడీకి అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె కోర్టు అనుమతించింది. దీంతో మదనపల్లె సబ్‌జైల్లో ఉన్న నిందితులను బుధవారం ఉదయం కస్టడీకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు వారికి జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఇద్దరినీ కలిపి, వేర్వేరుగా విచారించారు. నకిలీ మద్యం బాటిళ్ల లేబుళ్లతో పాటు మూతలు, ఇతర సామగ్రిని సమకూర్చడానికి జనార్దనరావుకు హైదరాబాద్‌లో పలువురిని పరిచయం చేశానని రవి చెప్పినట్లు సమాచారం. "ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో పేపర్ మిల్లు నడుపుతూ నష్టాలు రావడంతో హైదరాబాద్‌కు మకాం మార్చా. ఆర్థిక ఇబ్బందులు తీరేందుకు జనార్దనరావు(ఏ1) ఎంతో సాయం చేశాడు. 2023లో ఆయనతో కలిసి గోవాకు వెళ్లి బాలాజీ(ఏ15)ని కలిశాం. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి చేసిన రోజున జనార్దనరావు పాటు ఆఫ్రికా ఖండంలోని అంగోలా దేశంలో ఉన్నా" అని ఆయన వెల్లడించినట్లు తెలిసింది. కాగా, ప్లాస్టిక్ వస్తువుల తయారీ పరిశ్రమ నిర్వహిస్తూ జనార్దనరావుకు ప్లాస్టిక్ సీసాలను సరఫరా చేశానని మరో నిందితుడు శ్రీనివాసులురెడ్డి చెప్పినట్లు సమాచారం.



సమీక్షా సమావేశంలోమాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

సాగులో వైవిధ్యమే భూమికి రక్ష

- విభిన్న రకాల పంటలను ప్రోత్సహించాలి: డిప్యూటీ సీఎం

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'భూమిని రక్షించుకుంటూ, రైతుల ఆదాయం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలి. విభిన్న జాతుల మొక్కలతో పండ్ల తోటలను సాగు చేయడం ద్వారా భూసారాన్ని, వాతావరణాన్ని రక్షించుకోవచ్చు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ, 50% గ్రీన్ కవర్ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై అటవీ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు. గ్రీన్ కవర్‌లో ఉద్యాన శాఖ పాత్ర, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... '2047నాటికి రాష్ట్రంలో 50% గ్రీన్ కవర్ సాధించే అంశాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా తీసుకుంది. ఇందుకోసం అన్ని శాఖలు అటవీ శాఖతో సమన్వయం కావాలి. గ్రీన్ కవర్ ఏర్పాటులో ఉద్యానవన శాఖ కీలక పాత్ర పోషించాలి. రైతులకు, భూమికి ఉపయోగపడేలా ఉద్యానపంటల సాగులో వైవిధ్యం తీసుకురావాలి. ఒకే పంటలో వివిధ జాతుల మొక్కలను పెంచాలి. అంతర పంటలను ప్రోత్సహించాలి. సింథటిక్ మందుల వినియోగం తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలి. దీనివల్ల భూమికి చేవ పెరుగుతుంది. జీవ వైవిధ్యాన్ని రక్షించుకోవచ్చు' అని పేర్కొన్నారు.

మిర్చి ధరల స్థిరీకరణకు ముందస్తు చర్యలు

- కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చికి రుణాలు: మంత్రి అచ్చెన్న



మిర్చి ధరలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మిరప రకాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్న

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది మిర్చి క్రయవిక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా ధరల స్థిరీకరణకు ముందస్తు చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. బుధవారం గుంటూరులోని మార్కెటింగ్ శాఖ డైరెక్టరేట్‌లో మిర్చి ధరలపై ఆయన సమీక్ష నిర్వహించారు. మిర్చి వ్యాపారులు, ఎగుమతిదారులు, రైతు ప్రతినిధులు, కమిషన్ ఏజెంట్లతో చర్చించారు. అచ్చెన్న మాట్లాడుతూ... 'నిరుటితో పోల్చితే మిర్చి సాగు విస్తీర్ణం తగ్గింది. ఉత్పాదకత 44% తగ్గింది. ఎంత విస్తీర్ణంలో మిర్చి సాగు చేస్తే ధరలు నిలకడగా ఉంటాయో రైతులకు అవగాహన కల్పించాలి. కోల్డ్ స్టోరేజీల్లో ఉంచిన మిర్చికి రుణాలు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. గుంటూరు యార్డుకు ఇతర రాష్ట్రాల నుంచి మిర్చి వస్తున్నందున స్థానిక రైతులకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటాం. మిర్చి రైతులకు రశీదులు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. యార్డులో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించాం' అని తెలిపారు. మార్కెట్‌లో ఉన్న పోటీ ధరలు చెల్లించాలని లారీల యజమానులు, వర్షం కురిస్తే యార్డులో మిర్చి టిక్కీలు తడిసిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతు ప్రతినిధులు కోరారు.

'అమరావతి'కి చట్టబద్ధత కల్పించండి!

బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదించండి.. అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సీఎం చంద్రబాబు కోరారు. 2024 నుంచే ఏపీకి రాజధానిగా అమరావతి నిర్ణయించాలని కోరారు. దీనివల్ల రాజధానిలో పెట్టుబడులు పెట్టే వారికి భరోసా కలుగుతుందని చెప్పారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ఆర్థిక మద్దతు ఇవ్వాలని, పలు అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్రప్రాయోజిత పథకాల్లో రాష్ట్రానికి వాటా పెంచాలని... గృహ నిర్మాణం, రహదారులు, రైల్వే ప్రాజెక్టుల్లో ప్రాధాన్యమివ్వాలని అభ్యర్థించారు. రెవెన్యూలోటును భర్తీ చేసేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం పోలవరం పర్యటన ముగించుకున్న అనంతరం చంద్రబాబు ఢిల్లీకి చేరుకున్నారు. అమిత్‌షా నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులతోపాటు రాజకీయ అంశాలపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. "వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలి. రాయలసీమను హార్టికల్చర్ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలి. డిసెంబరు 25న పూర్వోదయ, సాస్కీ పథకాల కింద రూ.10,054కోట్ల మేరకు నిధులు ఇవ్వాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రతిపాదనలు సమర్పించాం. వీటిపై సానుకూలంగా స్పందించండి. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వండి" అని చంద్రబాబు కోరారు.

'ఉపాధి' మార్పులతో ప్రభావం

ఇటీవల కేంద్రం ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన 'జీ రామ్ జీ'లోని కొన్ని అంశాల నుంచి రాష్ట్రానికి వెసులుబాటు కల్పించాలని అమిత్‌షాను సీఎం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడంవల్ల... ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఏపీపై మరింత ప్రభావం పడుతుందని వివరించారు. త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ గురించి చంద్రబాబుతో అమిత్ షా సూచనప్రాయంగా చర్చించినట్లు తెలిసింది. మద్యంకేసు పురోగతి, జగన్ పాత్ర గురించి కూడా వివరాలు సమర్పించినట్లు తెలుస్తోంది. గత పర్యటనలో చంద్రబాబు... అమిత్‌షాను కలవలేకపోయారు. ఈ నేపథ్యంలో... చంద్రబాబును షా ప్రత్యేకంగా ఢిల్లీకి ఆహ్వానించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ భేటీ అనంతరం చంద్రబాబు తిరిగి అమరావతికి చేరుకున్నారు.

ఇరికిద్దామనుకొని.. అడ్డంగా దొరికారు!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. టీటీడీతో పాటు పోలీసు శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో కొందరు వైసీపీ కార్యకర్తలు, జగన్ మీడియా ప్రతినిధులు కుట్రకు పాల్పడినట్లు నిర్ధారించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించారు. ప్రాథమికంగా ముగ్గురిపై కేసు నమోదు చేసిన తిరుమల టూటౌన్ పోలీసులు.. వైసీపీ కార్యకర్త ఆళ్వపాక కోటి, జగన్ మీడియా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ మోహన్ కృష్ణను బుధవారం అరెస్టు చేశారు.

అసలేం జరిగిందంటే...

తిరుమలలోని కౌస్తుభం అతిథి గృహం సమీపంలో ఖాళీ మద్యం సీసాలు పడి ఉన్న వీడియోలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తిరుమల భద్రత, పవిత్రతను కాపాడాల్సిన పోలీసులకు చెందిన గెస్ట్‌హౌస్ వద్దే ఈ సీసాలు కనిపించడంతో శ్రీవారి భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసు అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. పోలీసుల సమాచారం ప్రకారం.. తిరుపతికి చెందిన వైసీపీ కార్యకర్త ఆళ్వపాక కోటి మరికొందరితో కలసి తిరుపతి నుంచి ఖాళీ మద్యం సీసాలు పట్టుకెళ్లి కౌస్తుభం గెస్ట్‌హౌస్ ప్రహరీ సమీపాన పొదల్లో పడేశారు. ఆ సమాచారాన్ని తిరుమలలోని వైసీపీ సోషల్ మీడియా విభాగం కార్యకర్త నవీన్‌కు చేరవేశారు. అతను తిరుపతి సాక్షి మీడియా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ మోహన్‌కృష్ణకు విషయం చెప్పడంతో అతను తిరుమలలోని సాక్షి రిపోర్టర్ ప్రసాద్, సాక్షి టీవీ వీడియో జర్నలిస్ట్ ముఖేష్, సాక్షి ఫొటోగ్రాఫర్ గిరికి సమాచారం ఇచ్చి మద్యం సీసాల వీడియోలు, ఫొటోలు తీయించాడు. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయించాడు. దీనికి సంబంధించి కోటి, నవీన్, మోహన్‌కృష్ణపై కేసు నమోదైంది. కోటి, మోహన్ కృష్ణను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నవీన్ కోసం గాలిస్తున్నారు.

ఆధారాలు సేకరించారిలా...

ఈ కేసులో జిల్లా పోలీసు యంత్రాంగం సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పక్కా ఆధారాలు సేకరించింది. తిరుమలలో లభ్యమైన ఖాళీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వాటి తయారీ బ్యాచ్ వివరాలతో ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించారు. సంబంధిత బ్యాచ్ సీసాలు ఏయే మద్యం దుకాణాలకు సరఫరా అయ్యాయో ఆరా తీశారు. తిరుపతిలోని ఏ మద్యం షాపులో, ఎప్పుడు వాటిని విక్రయించారు? ఎవరు కొనుగోలు చేశారో గుర్తించారు. ఈ క్రమంలో వైసీపీ కార్యకర్త కోటి ఖాళీ మద్యం సీసాలను ఈ నెల 2న తిరుమల తీసుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అలిపిరి టోల్‌గేట్‌లో నిందితుల వాహనాల ఫాస్టాగ్ చెల్లింపులు, తిరుమలలో సీసీ కెమెరాల ఫుటేజీ, నిందితుల మొబైల్ ఫోన్ సిగ్నళ్లను జల్లెడ పట్టి ఆధారాలు సేకరించారు. నిందితులతో పాటు వీడియోలు తీసినవారిని విచారించి, వారి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అయితే మోహన్‌కృష్ణ మొబైల్ ఫోన్ మాత్రం పోలీసులకు లభ్యం కాలేదు. ఎక్కడో పోగొట్టుకున్నట్టు చెబుతుండటంతో దానికోసం గాలిస్తున్నారు. ఆ ఫోన్ లభ్యమైతే కీలక ఆధారాలు దొరుకుతాయని భావిస్తున్నారు. కాగా, మద్యం సీసాల కేసులో అరెస్టయిన ఇద్దరినీ తిరుపతి రెండో ఏడీజే కోర్టు న్యాయాధికారి కోటేశ్వరరావు ఎదుట పోలీసులు హాజరుపరిచారు. న్యాయాధికారి రిమాండ్‌ను తిరస్కరించడంతో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వైసీపీ కుట్ర: టీటీడీ చైర్మన్

తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వైసీపీ కుట్రకు తెగబడిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆరోపించారు. మద్యం బాటిళ్లు తిరుమలకు తీసుకొచ్చి ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి హల్‌చల్ చేసిన వాళ్ల పాపం పండిందన్నారు. 'టీటీడీని, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి పనిగట్టుకుని భూమన కరుణాకరరెడ్డి తన మనుషులతో అనునిత్యం అసత్య ప్రచారాలు చేస్తూ నేడు పోలీసులకు దొరికిపోయారు. భూమనకు దేవుడంటే భయం, భక్తి లేదు. ప్రైవేట్ సైన్యాన్ని నియమించి టీటీడీపై బురద జల్లే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వైసీపీ సోషల్ మీడియా, కరుణాకరరెడ్డి చేస్తున్న కుట్రలు బయటపడ్డాయి. తిరుమలపై కుట్రలకు బాధ్యుడు, తొలి ముద్దాయి కరుణాకరరెడ్డి. ఆయన్ను అరెస్టు చేయాలి' అని బీఆర్ నాయుడు డిమాండ్ చేశారు.

పదేళ్లలో ఎంపీల ఆస్తులు డబుల్

110శాతం పెరిగిన 102 మంది ఎంపీల ఆస్తులు

- 124 కోట్ల సంపాదనతో టాప్ 3లో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి
- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఆస్తులు తగ్గుదల
- ఏడీఆర్ నివేదికలో వెల్లడి
- గత మూడు సార్లు గెలిచిన ఎంపీల ఆస్తుల విశ్లేషణ

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజకీయమంటే సేవ కాదు.. అదో లాభసాటి వ్యాపారమని మరోసారి రుజువైంది! పదేళ్లలో సామాన్య ప్రజల ఆస్తులు ఎంత పెరుగుతాయో తెలియదు కానీ లోక్‌సభకు వరుసగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీల ఆస్తులు మాత్రం రాకెట్ వేగంతో పైకి దూసుకెళ్తున్నాయి. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తులు గత పదేళ్లలో సగటున 110 శాతం పెరిగాయి. గత మూడు పర్యాయాలు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించి అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) రూపొందించిన నివేదికలో ఈ మేరకు వివరాలు వెల్లడించింది. 2014లో ఈ ఎంపీల సగటు ఆస్తులు రూ.15.76 కోట్లు కాగా, 2019 నాటికి రూ.24.21 కోట్లకు, 2024లో రూ.33.13 కోట్లకు పెరిగాయి. పదేళ్లలో ఈ 102 మంది ఎంపీల సగటు ఆస్తుల విలువ 17.36 కోట్లు పెరగడం గమనార్హం. విచిత్రమేమిటంటే ఈ ఎంపీల జాబితాలో చివరన ఉన్న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆస్తులు ఇదే కాలంలో దాదాపు సగానికి పడిపోయాయి. 2014లో పాటిల్ ఆస్తులు రూ.74 కోట్లు కాగా, 2024 నాటికి రూ.39 కోట్లకు తగ్గాయి. పదేళ్లలో కేంద్ర మంత్రి పాటిల్ రూ.35 కోట్లు నష్టపోయారు. 102 మందిలో బీజేపీ సతార ఎంపీ ప్రతాప్ బోంస్లే అత్యధికంగా రూ.162 కోట్లు సంపాదించి మొదటి స్థానంలో ఉన్నారు. 2014లో ఆయన ఆస్తులు రూ.60 కోట్లు కాగా, 2024 నాటికి రూ.223 కోట్లకు చేరాయి. ఆ తర్వాత రెండో స్థానంలో ఉన్న జామ్‌నగర్ ఎంపీ పూనంబెన్ రూ.130 కోట్లు సంపాదించారు. ఆమె ఆస్తులు రూ.17 కోట్ల నుంచి రూ.147 కోట్లకు పెరిగాయి. వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి రూ.124 కోట్ల సంపాదనతో మూడో స్థానం, బాలీవుడ్ నటి హేమమాలిని రూ.100 కోట్లతో నాలుగో స్థానం, బాలీవుడ్ నటుడు శత్రుఘ్నసిన్హా రూ.78 కోట్లతో ఏడో స్థానం, సుప్రియా సూలే రూ.52 కోట్ల సంపాదనతో 10 స్థానంలో ఉన్నారు. 38వ స్థానంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆస్తులు రూ.11 కోట్లు పెరిగాయి. 2014లో రాహుల్ ఆస్తులు రూ.9 కోట్లు కాగా, 2024 నాటికి రూ.20 కోట్లకు పెరిగాయి. ప్రధాని నరేంద్రమోదీ ఆస్తులు 2014లో రూ.1.65 కోట్లు కాగా, 2019లో 2.51 కోట్లు, 2024 నాటికి 3.02 కోట్లకు చేరాయి. 94వ స్థానంలో ఉన్న మోదీ ఆస్తులు పదేళ్లలో రూ.1.36 కోట్లు పెరిగాయి.

మిథున్‌రెడ్డి ఆస్తి రూ.22 కోట్ల నుంచి.. రూ.124 కోట్లకు..

వైసీపీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి ఆస్తులు భారీగా పెరిగాయి. 2014లో ఆయన ఆస్తులు రూ.22 కోట్లు కాగా, 2024 నాటికి రూ.146 కోట్లకు చేరాయి. 2019-24 మధ్యకాలంలో మిథున్‌రెడ్డి ఏకంగా 80 కోట్ల ఆస్తులు సంపాదించారు. మొత్తంగా పదేళ్లలో మిథున్‌రెడ్డి రూ.124 కోట్లు సంపాదించి.. 102 మంది ఎంపీలలో మూడో స్థానంలో నిలిచారు. వైసీపీ మరో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆస్తులు రూ.7 కోట్ల నుంచి రూ.40 కోట్లకు పెరిగాయి. 2019-24 మధ్య అవినాశ్‌రెడ్డి ఆస్తి రూ.22 కోట్లు పెరిగింది. రూ.78 కోట్లతో వైసీపీ అత్యధికంగా సగటు ఆస్తులు కలిగిన పార్టీల జాబితాలో రెండో స్థానంలో ఉంది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి ఆస్తులు పదేళ్లలో రూ.8 కోట్ల నుంచి రూ.23 కోట్లకు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆస్తులు రూ.4 కోట్ల నుంచి రూ.23 కోట్లకు పెరిగాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.